తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 02.12.2025 | సంపుటి :12 సంచిక : 133 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం

JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698

అభివృద్ధిని కాంక్షించే వారికే

# ఓటేయండి

## అడ్డుకునే వారిని ఓడించండి: సీఎం రేవంత్ రెడ్డి



- పాలమూరు ప్రాజెక్టులను ఆపింది బీఆర్ఎస్
- ఈ ప్రాంత బిడ్డగా ఈ గడ్డను అభివృద్ధి చేస్తా
- బూర్గుల తరవాత నాకే అవకాశం ఇచ్చారు
- దశాబ్దాల జిల్లా కరువును పారదోలుతా
- గత పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో తీవ్రనిర్లక్ష్యం
- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తా
- మక్తల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

"బీసీలు ఎంతమంది ఉన్నారో వందేళ్లుగా లెక్కలేదు. సామాజిక కులసర్వే చేసి అన్ని కులాల లెక్కలు తీసుకున్నాం. కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేసి పోయారు. ఓవైపు కేసీఆర్ చేసిన అప్పులు తీరుస్తూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధిని అడ్డుకునే వాళ్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించవద్దు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండేవాళ్లను గెలిపిస్తే గ్రామం అభివృద్ధి చెందదు. మంత్రుల వద్దకు వెళ్లి గ్రామానికి నిధులు అడిగే నేతలను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలి. ప్రభుత్వంతో కలిసి పనిచేసే వారిని గెలిపిస్తేనే గ్రామం బాగుపడుతుంది."- సీఎం రేవంత్ రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి, వనపర్తి బ్యూరో(జనంసాక్షి):** పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను పదేళ్లపాటు గత బిఆర్ఎస్ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక తెలంగాణలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఈ ప్రాంతానికి ఏదైనా చేయాలని గతంలో ఏ నేత కూడా అనుకోలేదని విమర్శించారు. అందుకే ఈసారి ఇక్కడి ప్రజలు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించార న్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన బ్రహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తుంది. రెండేళ్ల విజయోత్సవ సభను మక్తల్‌లో నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. స్వాతంత్ర్యం మిగతా 2లో..



మేడారం పనుల్లో

## వేగం పెంచాలి

ఆలయ అభివృద్ధిపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి 2లో..

తక్కువ వడ్డీతో రుణాలు

## మంజూరు చేయండి

హడ్కో ఛైర్మన్‌ను కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులపై చర్చ

జీహెచ్ఎంసీ విస్తరణ ఆర్డినెన్స్‌లకు

## గవర్నర్ ఆమోదం

2లో..



మొదటి రోజే

# అట్టుడికిన పార్లమెంట్

## 'సర్'పై చర్చకు పట్టుబట్టిన విపక్ష సభ్యులు

- సభలో పలు బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రులు
- విపక్షాల ఆందోళనల మధ్యే మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- విపక్ష సభ్యుల ఆందోళనతో సభ వాయిదా వేసిన స్పీకర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలిరోజే లోక్ సభలో వాయిదాల పర్వం మొదలైంది. ఉదయం సభ ప్రారంభంకాగానే ఇటీవల మృతిచెందిన ఐదుగురు మాజీ ఎంపీలకు నివాళులు అర్పించారు. తర్వాత దేశానికి పురస్కారాలు తెచ్చిన మహిళ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. అనంతరం 'సర్'పై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో మధ్యాహ్నం 12 గంటల వరకూ లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా వాయిదా వేశారు. అనంతరం సభలో పొగాకు, పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం, మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్, పాన్‌మసాలా తయారీపై కొత్త సెస్ విధించేలా బిల్లులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. దీంతో విపక్షాలు ఆందోళన చేపట్టగా సభను మధ్యాహ్నం 2గంటలకు స్పీకర్ వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభం కాగానే మరోసారి మిగతా 2లో..

సభా సమయాల్లో

## డ్రామాలొద్దు

- విపక్షాలు ఓటమిని అంగీకరించలేకపోతున్నాయి
- సమస్యలపై చర్చకు ఎప్పుడూ సిద్ధమే: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బీహార్ పరాజయాన్ని కూడా ఒప్పుకునే మనసు విపక్షానికి లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ మిగతా 2లో..



## 11 ఏళ్లుగా ఏడ్డీయే అణచివేత ధోరణి

- గత సమావేశాల్లో హడావిడిగా 12 బిల్లులు ఆమోదించారు
- ఎస్ఐఆర్ పక్రియలో ఒత్తిడికి గురై బీఎల్ఓలు చనిపోతే కేంద్రానికి ఎలాంటి పట్టింపులేదు
- ధన్‌ఖడ్‌కు సరైన రీతిలో వీడ్కోలు దక్కలేదు
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ విపక్షనేత ఖర్గే
- ప్రజాసమస్యలు లేవనెత్తడం డ్రామా కాదు
- కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పార్లమెంటరీ మర్యాదలను, పార్లమెంటరీ వ్యవస్థను గత 11 ఏళ్లుగా ప్రభుత్వం అణిచివేస్తూనే ఉందని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. గత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులు హడావిడిగా ఆమోదించారని, మిగతా 2లో..

మహిళా సంఘాలకు

## మరో 448 అద్దె బస్సులు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలోని మహిళా సంఘాల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊతమిచ్చింది. మహిళా సంఘాలకు మరో 448 అద్దె బస్సులు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాష్ట్రంలో మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొదటి విడతలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని 150 మహిళా సంఘాలకు 150 బస్సులను కొనుగోలు చేసింది.





## తొలగిన ప్రతిష్టంభన

### పత్తి కొనుగోళ్లపై ఫలించిన మంత్రి తుమ్మల చర్చలు

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లపై జిన్నింగ్ మిల్లులు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మధ్య నెలకొన్న ప్రతిష్టంభన తొలగింది. సీసీఐ తీసుకొచ్చిన కొన్ని నిబంధనలను రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు వ్యతిరేకించడంతో ఇటీవల కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమస్యపై దృష్టి సారించి.. సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో పలు దఫాలుగా చర్చలు నిర్వహించారు. ఈ అంశంపై కేంద్ర మంత్రులతో పాటు సీసీఐ సీఎండీతో మాట్లాడి.. నిబంధనల్లో మార్పులు చేసేందుకు అంగీకరించేలా ఒప్పించారు. దీంతో రాష్ట్రంలో నోటిపై చేసిన మొత్తం 330 మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు సీసీఐ



మొత్తం 3.66 లక్షల టన్నుల పత్తిని సేకరించింది. రైతుల వద్ద నిల్వ ఉన్న పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేలా ఇకపై సీసీఐ, జిన్నింగ్ మిల్లులు పనిచేస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల కోడ్‌ను

## ఉల్లంఘిస్తున్నారు: హరీశ్



2లో..

హిల్ట్ పాలసీపై విపక్షాలది

## దుష్ప్రచారమే

### బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన జివోలే అమలు చేస్తున్నాం

- లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదు
- సొంత భూములు ఉన్నవారికే కన్వర్షన్ ఫీజు పెట్టాం
- ఖాయిలా పడిన పరిశ్రమల భూములను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నమే హిల్ట్ పాలసీ
- కాలుష్య నియంత్రణకు పరిశ్రమలు తరలిస్తున్నాం: శ్రీధర్ బాబు



**హైదరాబాద్(జనంసాక్షి):** హిల్ట్ పాలసీపై విపక్షం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదని స్పష్టం చేశారు. పట్టాలు ఉండి.. సొంత భూములు ఉన్నవారికే కన్వర్షన్ ఫీజు పెట్టామని తెలిపారు. గత సర్కారే ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే జీవో ఇచ్చిందన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో ప్రభుత్వ భూములపై యాజమాన్య హక్కులను పారిశ్రామికవేత్తలకు ఇచ్చే జీవో తీసుకొచ్చారు. ఖాయిలా పడిన పరిశ్రమల భూములను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నమే హిల్ట్ పాలసీ. ప్రభుత్వ భూమిపై హక్కును బదిలీ చేస్తున్నామనేది అబద్ధం. హిల్ట్ పాలసీలో ఎస్ఆర్‌వో రేటు కంటే ఎక్కువ ఫీజు నిర్ణయించాం అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో రైతులకు సంబంధించిన భూములు లేవన్నారు. ఇకపోతే బిఆర్ఎస్ తెచ్చిన జీవోనే తాము ముందుకు తీసుకుని వెళుతున్నామని అన్నారు. నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడాలన్న ఉద్దేశ్యంతోనే నగరంలో బాలానగర్, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న పరిశ్రమలను ఓఆర్ఆర్‌కు ఆవలకి తరలిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.

## హిల్ట్ పాలసీ వేలకోట్ల కుంభకోణం



- 9 వేల ఎకరాల్లో రియల్ఎస్టేట్ వ్యాపారం
- గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన బీజేపీ
- ప్రభుత్వ అక్రమాలకు నిరసనగా 7న ధర్నా

2లో..

ఎయిర్‌పోర్టుల్లో జీపీఎస్ స్పూఫింగ్


## నిజమే

### సైబర్ దాడిపై కేంద్రం స్పష్టత

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఢిల్లీ విమానాశ్రయంలో సాంకేతిక సమస్య కారణంగా దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. దానికి కొన్ని రోజులముందు జీపీఎస్ స్పూఫింగ్ జరిగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ స్పూఫింగ్ నిజమేనని, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) మార్చేందుకు యత్నాలు జరిగినట్టు కేంద్రం ధ్రువీకరించింది. ఈ మేరకు రాజ్యసభలో పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.జీపీఎస్ స్పూఫింగ్ సంఘటనలు చోటుచేసుకున్న 10 నిమిషాల్లోనే మిగతా 9లో..



## డిజిటల్ అరెస్టు మోసాలపై విచారణ



సైబర్ నేరగాళ్ల ఖాతాలు

### ఫ్రీజ్ చేసేందుకు ఏఐ ఉపయోగించరేం?

రిజర్వ్ బ్యాంక్‌ను ప్రశ్నించిన సుప్రీం

### పంట వ్యర్థాల దహనాన్ని రాజకీయం చేయొద్దు

వాయు కాలుష్యానికి రైతులను నిందించడం సరికాదు: సుప్రీం కోర్టు

2లో..

# సీబీఐకి

### అప్పగిస్తూ సుప్రీం ధర్మాసనం ఆదేశం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** డిజిటల్ అరెస్టు మోసాలపై దేశవ్యాప్తంగా సీబీఐ విచారణకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మోసాల వల్ల ఇప్పటివరకు భారీ నష్టం జరిగినట్లు గుర్తించిన సుప్రీంకోర్టు..సీబీఐ విచారణకు రాష్ట్రాలు అనుమతి ఇవ్వాలని ఆదేశించింది. డిజిటల్ అరెస్టులపై సుప్రీంకోర్టులో విచారణ భాగంగా ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బగ్చి నేతృత్వంలోని బెంచ్ ఈ కేసును స్వయంగా పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్‌గా(సుమోటో పిల్) తీసుకుని విచారించింది.డిజిటల్ అరెస్టులో భాగంగా కొంతమంది పోలీసు, కోర్టు అధికారులుగా నటిస్తూ, నకిలీ సుప్రీం కోర్టు ఆదేశాలు చూపించి, ప్రజలను బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నారు. దాంతో పలువురు డిజిటల్ అరెస్టు బారిన పడి కోట్ల రూపాయలు నష్టాన్ని చవిచూస్తున్నారు.2025 చివరి త్రైమాసికంలో డిజిటల్ అరెస్టు మోసాలు విపరీతంగా పెరగడంతో, కోర్టు జోక్యం చేసుకుంది. ఈ మోసాలు రాష్ట్రాలవారీగా కాకుండా దేశవ్యాప్తంగా జరుగుతున్నందున, సీబీఐకి కేంద్రీకృత విచారణ బాధ్యత అప్పగించాలని సుప్రీం నిర్ణయించింది. దీనిలో భాగంగా మిగతా 2లో..





### మరోసారి జాతీయ స్థాయిలో సత్తా చాటిన తెలంగాణ పోలీసింగ్ వ్యవస్థ

దేశంలో ఏడో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా శామీర్‌పేట్ పీఎస్

12లో..

'సర్' పని ఒత్తిడి..

### మరో బీఎల్వో ఆత్మహత్య



2లో..

కేరళ సీఎంకు

## ఈడీ నోటీసులు

### రూ.2,000 కోట్ల మసాలా బాండ్ కేసులో పినరయి విజయన్‌కు నోటీసులు జారీ



**తిరువనంతపురం(జనంసాక్షి):** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాకిచ్చింది. రూ. 2,000 కోట్ల మసాలా బాండ్ కేసులో నోటీసులు జారీ చేసింది. సీఎంతోపాటూ ఆయన పర్సనల్ సెక్రటరీ, ఆర్థికశాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్‌కు సోమవారం షోకాజ్ నోటీసులు పంపింది. 2019లో మసాలా బాండ్ జారీలో విదేశీ మారకపు నిర్వహణ చట్టాన్ని ఉల్లంఘించారనే ఆరోపణలపై ఈ నోటీసులు జారీ చేసింది. రూ.466 కోట్ల లావాదేవీలకు సంబంధించి ఈ నోటీజులు జారీ చేసినట్లు తెలిసింది. రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.50 వేల కోట్లను సేకరించే ప్రణాళికలో భాగంగా పినరయి విజయన్ ప్రభుత్వం ఈ బాండ్లను తీసుకువచ్చింది. అయితే ఈ నిధులను అక్రమంగా మళ్లించారని, ఫెమా చట్టాన్ని ఉల్లంఘించారని ఈడీ ఆరోపిస్తోంది. దానిలో భాగంగా ఈ జనవరిలో థామస్‌కు దర్యాప్తు సంస్థ సమన్లు జారీ చేసింది. ప్రస్తుతం ఇచ్చిన షోకాజ్ నోటీసులు రూ.468 కోట్ల లావాదేవీలకు సంబంధించినవని అధికారులు వెల్లడించారు. ఈ నోటీసుల కింద సీఎం మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
02.12.2025



## తెలంగాణ పోలీసుల ముందడుగు

● మహిళా భద్రతకు 'టీ-సేఫ్' విప్లవాత్మక విధానం

● 'టీ-సేఫ్' విశిష్టతను వివరించిన డిజిపి బి. శివధర్ రెడ్డి.

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు, ముఖ్యంగా శ్రామిక మహిళల సురక్షిత ప్రయాణానికి ఉద్దేశించిన 'టీ-సేఫ్' వ్యవస్థ దేశంలోనే ఒక విప్లవాత్మక ముందడుగు అని తెలంగాణా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఇటీవల జరిగిన డీజీపీల కాన్ఫరెన్స్‌లో 'టీ-సేఫ్ - మహిళల కోసం సురక్షిత ప్రయాణం' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చి, ఈ సాంకేతిక పరిజ్ఞానం యొక్క విశిష్టతను వివరించారు. ఇప్పటివరకు మహిళా భద్రత కోసం ఉన్న సౌకర్యాలు కేవలం అత్యవసర ప్రతిస్పందన కోసం మాత్రమే పనిచేస్తుండగా, 'టీ-సేఫ్' మాత్రం ప్రయాణం మొదలైనప్పటి నుంచే పర్యవేక్షణ ప్రారంభిస్తుంది. ఈ విధంగా, ఇది కేవలం 'ప్రతిస్పందించే విధానానికి బదులుగా, 'ముందస్తు నివారణ' విధానంలో పనిచేయడం దీని ప్రధాన ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు.ఈ ఫీచర్ మొదలైనప్పుడు సమీపంలోని వ్యాన్లు లేదా పోలీస్ పెట్రోల్ మోటార్‌సైకిళ్లు తక్షణమే బాధితురాలి ప్రదేశానికి చేరుకుంటాయని ఆయన తెలిపారు. ఈ సదుపాయానికి మహిళల నుంచి 5 కు గాను 4.7 రేటింగ్ లభించిందని ,ఈ విషయంలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని డిజిపి తెలియజేశారు.

**భవిష్యత్ కార్యాచరణ పై పోలీస్ అధికారులతో డిజిపి సమీక్ష**

తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలో కీలకం కానున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047' సన్నాహాలపై రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ శ్రీ బి. శివధర్ రెడ్డి సోమవారం అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో డిజిపి పోలీసు ఉన్నతాధికారులకు కీలక వ్యూహాత్మక దిశానిర్దేశం చేశారు. 'గ్లోబల్ సమ్మిట్ 2047' కార్యక్రమాన్ని కేవలం నిర్దేశిత సమయంలోనే కాకుండా, అత్యంత చురుకైన ప్రణాళికతో అమలు చేయాలని, వాస్తవంగా నిర్దేశించిన సమయం కంటే దశాబ్దం ముందుగానే అనేక లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఉందని డిజిపి స్పష్టం చేశారు.అదనపు డిజిపి (శాంతిభద్రతలు) శ్రీ మహేష్ ఎం. భగవత్ స్వాగతోపన్యాసం చేయగా, ఈ సమావేశంలో టీజీఎస్పీఎఫ్ డైరెక్టర్ శ్రీమతి స్వాతి లక్రా, ఏడీజీపీ (సీఐడీ) శ్రీమతి చారు సిన్హా, ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఐజీపీ కె. రమేష్ నాయుడుతో పాటు ఏడీజీపీలు, ఐజీపీలు, డీఐజీలు, ఎస్పీలు, డీసీపీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభిప్రాయాలను డిజిపి తెలియజేశారు.

## హిల్ట్ పాలసీ పేరుతో వేలకోట్ల కుంభకోణం

హైదరాబాద్(జనంసాక్షి):హిల్ట్ పాలసీ పేరుతో రూ.వేలకోట్ల కుంభకోణం జరుగుతోందని గవర్నర్‌కు బిజెపి ఫిర్యాదు చేసింది. తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసింది. అక్రమాలు జరగకుండా చూడాలని వినతిపత్రం అందజేసింది.

## డిజిటల్ అరెస్టు మోసాలపై విచారణ సీబీఐకి

డిజిటల్ అరెస్టు మోసాలపై రాష్ట్రాలు సీబీఐ విచారణకు సహకరించాలని పేర్కొంది.అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ వద్ద నమోదైన ఎఫ్ఐఆర్ వివరాలను సీబీఐకి అందించాలని, ఫలితంగా సదర సంస్థ పూర్తి స్వేచ్ఛతో విచారణ చేయడానికి ఆస్కారం దొరుకుతుందని తెలిపింది. –ఇతర సైబర్ మోసాలు (ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు తరహా లాంటి కేసులు ఉన్నా మొదట ప్రాధాన్యం డిజిటల్ అరెస్టు కేసులకు ఇవ్వాలని ఆదేశించింది.ఇంటర్‌పోల్, సోషల్ మీడియా కంపెనీలు, ఆర్బీఐ వంటి సంస్థల సహకారంతో విచారణ జరగాలని కోర్టు సూచించింది. ప్రజల నమ్మకాన్ని కాపాడటానికి, డిజిటల్ అరెస్టుల ద్వారా డబ్బు వసూలు చేసే మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

## సైబర్ నేరగాళ్ల ఖాతాలు ఫ్రీజ్ చేసేందుకు ఏఐ ఉపయోగించరేం?

రిజర్వ్ బ్యాంక్‌ను ప్రశ్నించిన సుప్రీం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సైబర్ నేరగాళ్ల ఖాతాలు ఫ్రీజ్ చేసేందుకు కృత్రిమమేధ (ఏఐ) ఎందుకు వాడట్లేదని రిజర్వ్ బ్యాంక్ ను సోమవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. డిజిటల్ అరెస్టు కేసుల విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుల్లో పాన్ ఇండియా స్థాయిలో ఒకేతరహాలో దర్యాప్తు ఉండాలని కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి సూచించింది. సీబీఐ విచారణకు సమ్మతి తెలియజేయాలని బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సూచనలు చేసింది గత కొంతకాలంగా దేశంలో డిజిటల్ అరెస్టులు కలకలం సృష్టిస్తున్నాయి. తాము ప్రభుత్వ అధికారులమంటూ నేరగాళ్లు ఆడియో, వీడియో కాల్స్ చేసి, బాధితులను భయపెట్టి, డిజిటల్ అరెస్టు చేస్తున్నారు. బెదిరించి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. డిజిటల్ అరెస్టు కారణంగా తాను రూ.కోటి కోల్పోయానని హరియాణాకు చెందిన ఓ వృద్ధ మహిళ వేసిన కేసు నేపథ్యంలో కొన్నిరోజులుగా సుప్రీంకోర్టు లో విచారణ జరుగుతోంది. సైబర్ నేరాల కేసుల్లో నేరగాళ్లు ఉపయోగించే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడానికి కృత్రిమ మేధ లేక మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీని ఎందుకు వాడట్లేదో తెలియజేయాలని తాజాగా ఆర్‌బీఐకి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. నిందితులు ఎక్కువగా సీనియర్ సిటిజెన్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని, వారు జీవితాంతం సంపాదించిన సొమ్మును దోచుకుంటున్నారని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఈ కేసుల దర్యాప్తులో ఐటీ అనుబంధ సంస్థల సహకారం తీసుకోవాలని సీబీఐని ఆదేశించింది. టెలికాం సంస్థలు ఒక వినియోగదారుడికి ఎక్కువ సంఖ్యలో సిమ్ కార్డులు అందకుండా చూసుకోవాలని సూచించింది. అలాగే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రాంతీయ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, దానిద్వారా దర్యాప్తులో సీబీఐతో సమన్వయం చేసేందుకు ఉపయోగపడుతుందని పేర్కొంది.

## పంట వ్యర్థాల దహనాన్ని రాజకీయం చేయొద్దు: సుప్రీం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రస్థాయిలో ఉన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో వాయు కాలుష్యంపై విచారణ సందర్భంగా సోమవారం సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశరాజధానిలో పెరుగుతున్న వాయు కాలుష్యానికి రైతులను నిందించడం సరికాదని పేర్కొంది. పంట వ్యర్థాల దహనాన్ని రాజకీయం చేయొద్దని..దాన్ని అహంకారానికి సంబంధించిన విషయంగా పరిగణించకూడదని సూచించింది. పంట దహనం చేయకూడదంటే వ్యర్థాలను తొలగించడానికి వారి వద్ద యంత్రాలు కూడా ఉండాలని పేర్కొంది. ఢిల్లీ కాలుష్య అంశాన్ని కాలానుగుణమైన అంశంగా పరిగణించలేమని తెలిపింది. కాలుష్య నివారణకు శాస్త్రీయ పరిష్కారాల కోసం ప్రయత్నాలు చేయాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు సూచించింది. కాలుష్య నివారణకు ఇప్పటి వరకు ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ తీసుకున్న చర్యల వల్ల గాలి నాణ్యత ఎంతమేరకు మెరుగుపడిందనే విషయంపై వారంలోపు నివేదిక సమర్పించాలని సూచించింది. వారి కార్యాచరణ ప్రణాళిక అసమర్థంగా ఉంటే.. ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించాల్సి ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. కాలుష్యం విషయంలో ప్రతిసారి పంట వ్యర్థాల దహనాన్ని కారణంగా చూపడం..సరైన చర్య కాదని సుప్రీం కోర్టు మందలించింది. రైతులపై నింద వేయడం అలవాటుగా మారిపోయిందని అసహనం వ్యక్తం చేసింది.

## అభివృద్ధిని కాంక్షించే వారికే ఓటేయండి

వచ్చిన తొలినాళ్లలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు సీఎం అయ్యారు. ఆ తర్వాత 75 ఏళ్లలో ఎవరూ కాలేదు. ఇన్నాళ్లకు పాలమూరు బిడ్డ రాష్ట్ర సీఎంగా మీ ముందు నిలబడ్డారు. పాలమూరుకు ఏది కావాలన్నా చేసి మీ రుణం తీర్చుకుంటానని అన్నారు. దశాబ్దాలుగా పాలమూరు జిల్లా కరవు, వలసలకు మాత్రమే పేరు పొందింది. ఇక్కడి నుంచి ఎంపీగా చేసిన మాజీ సీఎం కెసిఆర్ కూడా ఈ జిల్లాకు ఏం చేయలేదు. ప్రాజెక్టులను పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. ఈసారి పాలమూరు బిడ్డను ప్రజలు గెలిపించి అధికారం కట్టబెట్టారని సీఎం రేవంత్ అన్నారు. కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ఆ అప్పులు తీరుస్తూనే.. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధిని అడ్డుకునే వాళ్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించొద్దు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవాళ్లను గెలిపిస్తే.. గ్రామం అభివృద్ధి చెందదు. మంత్రుల వద్దకు వెళ్లి గ్రామానికి నిధులు అడిగే నేతలను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలి. ఈసారి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించాం. పదేళ్లు నిర్లక్ష్యానికి గురైన నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాం. ఈ ప్రాజెక్టుపై కేసులు వేసి అడ్డుకున్నారు. రైతులు నష్టపోవద్దని ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చేందుకు ముందుకొచ్చాం. పాలమూరు జిల్లాలో కృష్ణానది పారుతున్నా.. ఇక్కడి నేలకు నీళ్లు అందలేదు. మాయగాళ్ల మాటలు విని.. ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌లను ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నాం అని సిఎం రేవంత్ అన్నారు. మక్తల్ పర్యటనలో భాగంగా రూ.200 కోట్లతో సమీకృత గురుకుల పాఠశాల సముదాయ భవనాలు, మక్తల్- నారాయణపేట మధ్య నాలుగు లైన్ల రోడ్డు, మక్తల్‌లో క్రీడాభవనం తదితర అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతకుముందు వనపర్తి జిల్లా ఆత్మకూరులో పర్యటించారు. రూ.151.92 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జూరాల దిగువన హైలెవల్ వంతెన నిర్మాణం, ఆత్మకూరు మున్సిపాలిటీలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన తర్వాత కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు.



కేసీఆర్ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే.. ఆటోడ్రైవర్లను మాజీ మంత్రి కేటీఆర్ అండ్ కో రెచ్చగొట్టి తమ మీదకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు సీఎం. తమ ప్రభుత్వంలో పేదలకు కూడా సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తుచేశారు. మహిళలను వ్యాపార వేత్తలుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి పాలమూరును ఆదర్శంగా మారుస్తామని వివరించారు. ఎన్ని నిధులు కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధమని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వంలో ఇరిగేషన్‌తో పాటు ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి పేద బిడ్డకు చదువు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళ్లు ప్రారంభించామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.ఇప్పటిదాకా మక్తల్ నారాయణపేట కొడంగల్‌కు సాగునీరు ఇవ్వాలని ఎవ్వరికీ అనిపించలేదు. కానీ 12 మందిని మీరు ఆశీర్వదించి పంపిస్తే నాకు ఇక్కడి ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది. మన కష్టాలను తీర్చేందుకు ఎవ్వరూ బాధ్యత తీసుకోలేదు. కానీ మీ సోదరుడిగా.. మీతో పాటు పెరిగిన బిడ్డగా సీఎంగా వచ్చాను. పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది. కానీ మోసగిస్తే పాతాళానికి తొక్కింది.. ఇది కేసీఆర్ విషయంలో జరిగింది. గతంలో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి.. సీఎంగా చేస్తే.. మన జిల్లాలో ఎలాంటి ప్రాజెక్టు పూర్తి చేయలేదు. రూ.12 కోట్లు కేటాయించి సంగంబండ రిజర్వాయర్ పూర్తి చేయలేదు. అందుకే ఎవరికో పెద్దరికం ఇవ్వొద్దని.. మన బిడ్డ సీఎంగా ఉండాలని మీరు కోరుకున్నారు. మంత్రి మండలి సహకారంతో.. ఇక్కడ అన్ని ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తున్నాం.. గతంలో జీవో నెంబరు- 69 ద్వారా వచ్చిన నారాయణపేట - కొడంగల్ ప్రాజెక్టును పక్కన పెట్టారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తున్నాం. ఇప్పటికీ కొంతమంది అడ్డంకులు పెట్టారు.. కానీ మా మంత్రి వాకిటి శ్రీహరి రైతులతో మాట్లాడి..

## తెలంగాణను అభివృద్ధిలో దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయం

**వనపర్తి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి**

**వనపర్తి బ్యూరో(జనంసాక్షి):**
తెలంగాణను అభివృద్ధిలో దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.సోమవారం వనపర్తి జిల్లా ఆత్మకూరు పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. రూ.15 కోట్ల వ్యయంతో ఆత్మకూరు నగర అభివృద్ధి పనులకు, రూ.15 కోట్ల వ్యయంతో అమరచింత నగర అభివృద్ధి పనులకు శంఖు స్థాపన చేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.22 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటరు భవన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు.

ఎకరానికి రూ.20 లక్షల పరిహారంతో 95 శాతం మంది రైతులు భూములు ఇవ్వడానికి ఒప్పుకోవడంతో పనులు ప్రారంభించాం. ఇది నా జీవితంలో చాలా సంతోషకరమైన విషయం. రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం.. ఈ ప్రాజెక్టుకు ఎవరైనా అడ్డుపడితే ఊరుకోం' అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు పాలమూరు విశ్వవిద్యాలయంలో కావాల్సిన కోర్సులన్నీ తెచ్చా.. పాలమూరు జిల్లా విద్యాపరంగా రాష్ట్రానికి మోడల్‌గా ఉండాలి. సన్నబియ్యం, ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్సు అన్నీ అమలు చేస్తున్నాం.. ఇది చాలదన్నట్లు మా ఆడబిడ్డలు పెట్రోల్ బంకులు, వెయ్యి బస్సులకు యజమానులు అయ్యారు. అంబానీ, అదానీలకు సమానంగా హై టెక్ సిటీలో మా అక్కలకు స్టాల్స్ వచ్చాయి. మీరు ఒక్కసారి ఆశీర్వదిస్తే ఇవన్నీ సాధ్యమయ్యాయి. అందుకే మాకు అండగా ఉన్న పాలమూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. మా మాదిగ సోదరులు వర్గీకరణ కోసం చేయని పోరాటంలేదు.. కానీ సుప్రీంకోర్టు తీర్పు వెంటనే నేను వర్గీకరణ చేసి మాల, మాదిగ పంచాయితీ లేకుండా చేసి చూపించా. బీసీ లెక్క చేసి.. దేశానికి ఆదర్శంగా నిలిచాం. సంక్షోభం దిశలో ఉన్న రాష్ట్రాన్ని సక్కగా చేస్తున్నా. స్థానిక ఎన్నికలపై మాట్లాడుతూ.. కాళ్లల్లో కట్టెలు పెట్టే వారిని సర్పంచులుగా గెలిపిస్తే.. మళ్లీ అడ్డంకులు సృష్టిస్తారు. డిసెంబరు 8, 9వ తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ పెట్టుకుని.. మన తెలంగాణ రాష్ట్ర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుదాం.

## జీహెచ్ఎంసీ విస్తరణ ఆర్డినెన్స్‌లకు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్(జనంసాక్షి):జీహెచ్ఎంసీ విస్తరణ ఆర్డినెన్స్‌లకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల చట్టాల సవరణ ఆర్డినెన్సులకు ఆమోద ముద్ర వేశారు. జీహెచ్ఎంసీలో 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు విలీనం చేయాలని ఇటీవల తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఆర్డినెన్సులకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బాహ్య వలయ రహదారి(ఓఆర్ఆర్) లోపల, దాన్ని ఆనుకుని బయట ఉన్న 27 నగర, పురపాలక సంఘాలను గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ)లో విలీనం చేయాలని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ విలీన ప్రక్రియ ముగిశాక... ఐదు జిల్లాలు, 47 మండలాలు, 311 గ్రామాల పరిధిలో ఆరు పార్లమెంటు స్థానాలు, 28 అసెంబ్లీ స్థానాలతో దేశంలోనే అతి పెద్ద నగరంగా హైదరాబాద్ విస్తరించనుంది.

## మేడారం పనుల్లో వేగం పెంచాలి

**హైదరాబాద్(జనంసాక్షి):**మేడారం ఆలయ అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆలయ పనులపై జూబ్లీహిల్స్ నివాసంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయ పనులపైన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఆలయ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దని సూచించారు. మేడారం ఆలయ నిర్మా ణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దని ఆదేశించారు. గద్దెల సమీపంలో వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గద్దెల దగ్గర నాలుగు వైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. గద్దెలకు గ్రాండ్ లుక్ వచ్చేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. .

## తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయండి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హడ్కో ఛైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠను కోరారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కులశ్రేష్ఠ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణాలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని సీఎం హడ్కో ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూర్, అమరావతి మీదుగా చెన్నై వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి, బుల్లెట్ ట్రైన్ నిర్మాణాలపై ముఖ్యమంత్రి... హడ్కో ఛైర్మన్‌ల మధ్య చర్చ సాగింది. గతంలో అత్యధిక వడ్డీ రేటుతో ఇచ్చిన రుణాలకు సంబంధించి రుణ పునర్వ్యవస్థీకరణ (లోన్ రీకన్‌స్టక్చన్) అంశాన్ని సీఎం హడ్కో ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై హడ్కో ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. సానుకూల వృద్ధి రేటుతో ఉన్న తెలంగాణలో ప్రాజెక్టులకు తక్కువ వడ్డీరేటుతో దీర్ఘ కాల రుణాలు ఇవ్వాలని సీఎం కోరారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనపై మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతుంటే ఎస్ఈసీ ఏం చేస్తోందని నిలదీశారు. శంకుస్థాపన చేసే ప్రాజెక్టులు, రోడ్లు గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగపడవా?అని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం వెంటనే సమీక్షించి సీఎంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ శాఖపై మాట్లాడుతూ.. 'విద్యుత్ శాఖను మొత్తం ఏపీ అధికారులతో నింపుతున్నారు. కీలకమైన బాధ్యతల్లో ఆంధ్ర అధికారులను నియమిస్తున్నారు. ప్రభుత్వాన్ని తెలంగాణ వారు నడుపుతున్నారా? వెనకుండి ఏపీ వాళ్లు నడుపుతున్నారా? ఏపీ అధికారులు, అవినీతితో రాష్ట్ర విద్యుత్ రంగం అస్తవ్యస్తమవుతోంది. తక్కువ ధరకే ఎన్టీపీసీ విద్యుత్ ఇస్తుంటే.. కొత్త ప్లాంటు ఎందుకు? కమీషన్ల కోసమే కొత్త పవర్‌ప్లాంట్లు చేపడుతున్నారు. ఈ విషయంలో చర్చ పెడితే ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నాం. కొత్తగా చేపట్టే మూడు ప్లాంట్లకు రూ.45వేల కోట్లు అవుతుంది. పైసా ఖర్చు లేకుండా ఎన్టీపీసీ విద్యుత్ ఇస్తుంటే.. ఇన్ని వేల కోట్లు ఎందుకు?"అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## కేరళ సీఎంకు ఈడీ నోటీసులు

వ్యక్తిగతంగా దర్యాప్తు సంస్థ ముందు హాజరుకావాల్సిన అవసరం లేదు.2019లో మసాలా బాండ్ జారీలో విదేశీ మారకపు నిర్వహణ చట్టాన్ని ఉల్లంఘించారనే ఆరోపణలపై ఈ నోటీసులు జారీ అయ్యాయి. 2019లో కేరళ రాష్ట్రం మసాలా బాండ్లను జారీచేసింది. ఆ తరహా బాండ్లను జారీ చేసిన తొలి రాష్ట్రం కేరళనే. భారత సంస్థలు విదేశాల్లో స్థానిక కరెన్సీలో కాకుండా భారత కరెన్సీలో వీటిని జారీ చేశాయి. దేశీయంగా వృద్ధికి దోహదపడేలా విదేశీ ఇన్వెస్టర్ల నుంచి నిధులు సేకరించడం, రూపాయి అంతర్జాతీయీకరణ వీటి ఉద్దేశం. ఈ బాండ్ల ద్వారా కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డ్ రూ.2వేల కోట్లమేర సమీకరించింది. తర్వాత అవి లండన్ ఎక్స్ఛేంజీకి ఎంట్రీ ఇవ్వడం ద్వారా ఆ మొత్తం విలువ రూ.2,150 కోట్లకు పెరిగింది.

## 'సర్' పని ఒత్తిడి.. మరో బీఎల్వో ఆత్మహత్య

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ కొనసాగుతున్న కొన్ని రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారులు పనిఒత్తిడి కారణంగా అనారోగ్యానికి గురవడం, రాజీనామాలు చేస్తుండటం, పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి. తాజాగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో బీఎల్వో ఆత్మహత్యచేసుకున్నాడు. బలవన్మరణానికి ముందు ఆయన తీసుకున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మృతుడిని సర్వేశ్ సింగ్ (46)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

# మొదటి రోజే అట్టుడికిన పార్లమెంట్

విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. విపక్షాల ఆందోళన మధ్యే మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్షాల నిరసనలు కొనసాగడంతో సభను స్పీకర్ మంగళవారానికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఎస్ఐఆర్‌పై చర్చ పెట్టాలని విపక్షాలు నిరసనలు తెలిపాయి. ఎస్ఐఆర్‌పై చర్చ పెట్టేందుకు తాము సిద్ధమేనని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. కానీ, తక్షణమే చర్చ పెట్టడం సరికాదన్నారు. చర్చ పెట్టేందుకు తగిన సమయం ఉంటుందని అంతవరకు ఆగాలని విపక్షాలను కోరారు. ఐనప్పటికీ విపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించగా రాజ్యసభ సైతం మంగళవారానికి వాయిదా పడింది.

### సభా సమయాల్లో డ్రామాలొద్దు

ప్రతిపక్ష కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు ఆయన సూచించారు. ఈ మేరకు ప్రతిపక్ష ఇండియా కూటమిపై నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా సోమవారం పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సమావేశాల్లో అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. 'సమావేశాలు సజావుగా ముందుకు సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలి. సభా సమయాల్లో డ్రామాలు వద్దు. చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి. దేశ ప్రగతి కోసం పార్లమెంటులో మంచి చర్చలు కొనసాగాలి. వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. పరాజయం కూడా ఒప్పుకునే మనసు విపక్షానికి లేదు. మేము మాత్రం విపక్షాలను కలుపుకొని ముందుకెళ్తాం. దేశాభివృద్ధి కోసం విపక్షాలు కూడా మాతో కలిసి రావాలి. అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నాను. దేశ ప్రగతి కోసం సలహాలు, సూచనలు ఇవ్వాలి. కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి' అని ప్రధాని పేర్కొన్నారు.బిహార్ ఓటమి నుంచి ఇంకా బయటకు రాలేదంటూ ప్రతిపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ చురకలంటించారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ ఇండి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన సూచించారు. మీ బాధ్యతను మీరు నిర్వర్తించండంటూ ఆయా పార్టీలకు ప్రధాని హితవు పలికారు. పార్లమెంటులో బలమైన అంశాలతోపాటు ప్రశ్నలు లేవనెత్తండంటూ వారికి కీలక సూచన చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం అంటే ఈ రోజు నుంచి ప్రారంభమమ్యాయి. తమ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి అని వివరించారు. అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని తాను ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.ఈ పార్లమెంట్ సమావేశాల్లో అన్ని అంశాలపై చర్చలు సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను. దేశ ప్రగతి కోసం మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలని చట్టసభ సభ్యులను విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలి. కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి. నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలకు అడ్డుతగలవద్దని కోరుతున్నాను. విపక్షాలు ఓటమి నిరాశను అధిగమించాలి. అవి తమ బాధ్యతను నిర్వర్తించాలి. బలమైన అంశాలను లేవనెత్తాలి అని మోదీ సూచించారు. గత పదేళ్లుగా ప్రతిపక్షాలు ఆడుతున్న ఆట దేశ ప్రజలకు ఇక ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వారు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. వారికి కొన్ని టిప్స్ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను అని ప్రధాని విపక్షాలకు చురకలంటించారు. జీఎస్టీ సంస్కరణల తర్వాత ప్రజలు సంతోషంగా ఉన్నారని మోదీ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని వెల్లడించారు. వికసిత్ భారత్ లక్ష్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈసారి పార్లమెంట్ సెషన్ కూడా దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు బాటలు పరుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశాలు ప్రారంభంకాగా, ఇవి ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సెలవు రోజులు మినహా మొత్తం 15 రోజులపాటు ఈ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ఆమోదం పొందనున్నాయి. ఈ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కేంద్రం కోరింది. ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంట్ సజావుగా సాగేందుకు సహకరించాలని, ఆటంకాలు సృష్టించ వద్దని విపక్షాలను కోరామన్నారు. దాదాపు గంటన్నర పాటు ఈ అఖిలపక్ష భేటీ జరిగింది. ఈ భేటీలో విపక్షాల డిమాండ్లు విన్నారేగానీ ఏమాత్రం స్పందించలేదని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు. అఖిల పక్ష సమావేశానికి కేంద్ర మంత్రులు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘవాల్, ఎల్.మురుగన్, అనుప్రియ పటేల్‌తోపాటు జైరామ్ రమేశ్ (కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ), మిథున్‌రెడ్డి (వైసీపీ), సురేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), బాలశౌరి (జనసేన) సహా 36 పార్టీల నుంచి దాదాపు 50మంది నేతలు పాల్గొన్నారు. కృష్ణా జలాల వినియోగం, కేటాయింపులపై పార్లమెంట్‌లో చర్చించాలని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల అంశాన్ని పరిష్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్ తెలిపారు.

## 11 ఏళ్లుగా ఏడ్డీయే అణచివేత ధోరణి


కొన్ని బిల్లులు కేవలం 15 నిమిషాల్లో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించారని గుర్తుచేశారు. జీఎస్టీ, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, రైతు వ్యతిరేక చట్టాలు పార్లమెంటు ద్వారా ప్రభుత్వం బుల్డోజింగ్ చేసిన బిల్లులని ఆక్షేపణ తెలిపారు.పరాజయాన్ని అంగీకరించే మనసు ప్రతిపక్షాలకు లేదని, వాళ్లు వ్యూహం మార్చుకుంటే కొన్ని 'టిప్స్' ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని, సభా సమయాల్లో మాత్రం డ్రామాలు వద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. శీతాకాల సమావేశాల తొలి రోజే పార్లమెంటు ముందున్న కీలక అంశాల గురించి మోదీ ప్రస్తావించే బదులు నాటకీయ ప్రసంగం సాగించారని ఖర్గే తప్పుపట్టారు. 11 ఏళ్లుగా పార్లమెంటరీ మర్యాదలు, వ్యవస్థను ప్రభుత్వం అణిచివేస్తోం దన్నదే అసలు నిజమని అన్నారు. మణిపూర్ వంటి కీలక అంశాలపై విపక్షాలు అవిశాస్వ తీర్మానం ప్రవేశపెట్టేంతవరకూ ప్రభుత్వం మౌనంగానే ఉండిపోయిందని, ఎన్నికల జాబితా ఎస్ఐఆర్ పక్రియలో ఒత్తిడికి గురై బీఎల్ఓలు చనిపోతే ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపులేదని విమర్శించారు. 'ఓటు చోరీ' వంటి కీలకాంశాలను విపక్షం లేవనెత్తుతూనే ఉంటుందని, ప్రభుత్వం డ్రామాలు కట్టిపెట్టి పార్లమెంటులో ప్రజాసమస్యలపై చర్చకు ముందుకురావాలని సూచించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానత్వం, దేశ విలువైన వనరుల లూటీ వంటివి నిజమైన ప్రజాసమస్యలనీ, అయితే అధికారంలో ఉన్న వారు అధికార దురహంకారంతో డ్రామాలాడుతున్నారని ఖర్గే విమర్శించారు. బిహార్ ఓటమి నుంచి వాళ్లు బయటకు రావడం లేదంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై మాట్లాడుతూ, ప్రతికూల ధోరణి రాజకీయాల్లో పనికొస్తుందే కానీ జాతి నిర్మాణానికి సానుకూల ఆలోచనా దృక్పథం అవసరమని, ప్రతికూలతా ఆలోచలను ప్రభుత్వం పక్కనపెట్టి జాతినిర్మాణంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ ఇవాళ రాజ్యసభ ఛైర్మన్‌గా తొలిసారి బాధ్యతలు నిర్వర్తించారు. ఛైర్మన్ చైర్ లో ఆయన కూర్చున్న సమయంలో ఖర్గే మాట్లాడారు. రాధాకృష్ణన్‌కు స్వాగతం పలికిన ఆయన తన ప్రసంగంలో మాజీ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ అంశాన్ని ప్రస్తావించారు. అనారోగ్య కారణాల వల్ల రాజ్యసభ మాజీ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ తన పదవికి అకస్మాత్తుగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ అంశాన్ని సోమవారం రాజ్యసభ ఎంపీ మల్లిఖార్జున్ ఖర్గే లేవనెత్తారు. జగదీప్ ధన్‌కర్‌కు సరైన రీతిలో వీడ్కోలు దక్కలేదని, దీని పట్ల బాధగా ఉందని ఖర్గే అన్నారు.

**పార్లమెంట్‌లో ప్రజాసమస్యలు లేవనెత్తడం డ్రామా కాదు: ప్రియాంక గాంధీ**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభంలోనే అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ప్రధాని నరేంద్ర మోదీ సభలో 'డ్రామా'కు కాకుండా, 'డెలివరీ' (పని)కి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఎదురుదాడి చేశారు.పార్లమెంటు సమావేశాలకు ముందు ప్రధాని మోదీ తన ప్రసంగంలో.. ప్రతిపక్షాలు తమ పాత వ్యూహాలను మార్చుకోవాలని, చర్చలకు అవకాశం ఇవ్వాలని సూచించారు. 'డ్రామా కాదు, డెలివరీ ఉండాలి.. నినాదాలు కాదు, విధానాలకు ప్రాధాన్యత నివ్వాలి' అని అన్నారు. తొలిసారిగా ఎన్నికైన ఎంపీలకు మాట్లాడే అవకాశం రావడం లేదని, డ్రామా చేయడానికి పార్లమెంట్ సరైన వేదిక కాదని ఆయన ప్రతిపక్షాలకు చురకలు అంటించారు.

# పల్లెల్లో 'పవర్' పంచాయతీ

- మొదలైన సమీకరణలు
- గెలుపు గుర్రాలకు మద్దతు



**నిజామాబాద్ ప్రతినిధి (జనం సాక్షి):** ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలవగా, ప్రధాన రాజకీయ పార్టీలు పవర్ దక్కించుకోవడంపై దృష్టి పెట్టాయి. ఆయా గ్రామాల్లో స్థానిక అంశాలతో పాటు కుల,రాజకీయ సమీకరణలు చేస్తూ గెలుపు గుర్రాలను బరిలో నిలుపుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో పవర్ నిలబెట్టుకుంటే ఆ తర్వాత రానున్న జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లోనూ జనం నాడి పట్టవచ్చనే అంచనాలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెజారిటీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో పార్టీ మద్దతు తెలిపే అభ్యర్థులను గెలిపించుకునేందుకు సమాలోచనలు చేస్తున్నారు. తొలి దశ నామినేషన్ల పర్వం ముగియగా, ఆశావహులు ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టారు. నిజామాబాద్ రెవిన్యూ డివిజన్ తో పాటు జక్రాన్ పల్లి మండల పరిధిలో ఆదివారం నుంచి అధికారులు రెండో విడత నామినేషన్లు స్వీకరిస్తున్నారు. పంచాయతీల్లో పవర్ దక్కించుకునేందుకు ప్రధాన పార్టీల నేతలు సన్నాహాలు చేస్తున్నారు. మెజార్టీ స్థానాలను దక్కించుకొని తమ పార్టీ ఉనికి చాటుకోవాలని తహ తహ లాడుతున్నారు. గెలుపు గుర్రాలను వెతికి బరిలో నిలుపు తున్నారు. వాస్తవానికి పంచాయతీ ఎన్నికల్లో పార్టీల గుర్తులు లేకపోయినప్పటికీ, పరోక్షంగా పార్టీ అభ్యర్థులుగా ప్రకటిస్తూ మద్దతు తెలుపుతున్నారు.

నిజామాబాద్ జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండగా, అర్బన్, ఆర్మూర్ స్థానాల్లో బిజెపి,బాల్కొండ నుంచి బిఆర్ఎస్, బోధన్, నిజామాబాద్ రూరల్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిజామాబాద్ అర్బన్ మినహా మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. బోధన్, రూరల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి ఆయా గ్రామాల గ్రామ శాఖల నాయకులతో చర్చించి సర్పంచ్ అభ్యర్థులను బరిలో నిలిపి గెలుపే లక్ష్యంగా దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇక, ఆర్మూర్ లో బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పంచాయతీ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఆ పార్టీ గ్రామ శాఖల ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ గెలుపు గుర్రాలను బరిలో నిలుపుతున్నారు. అయితే కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ రెడ్డి, ఇతర నాయకులతో సంప్రదింపులు జరుపుతూ పార్టీ ప్రతిష్ట పెంచాలనే యోచనతో పావులు కదుపుతున్నారు. ఇదిలా ఉండగా, బాల్కొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మరోసారి తన సత్తా చాటేందుకు సమాయత్తమయ్యారు. అయితే బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సైతం బలంగా ఉండడంతో, అనేక గ్రామాల్లో కాంగ్రెస్, బి.ఆర్.ఎస్ పార్టీల మధ్య నువ్వా- నేనా అన్నట్లుగా పంచాయతీ పోరు సాగనుంది. రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ ఇన్చార్జి సునీల్ రెడ్డి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తమ అనుచరులను సర్పంచ్లుగా గెలిపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఇక కామారెడ్డి జిల్లా విషయానికి వస్తే, కామారెడ్డి స్థానంలో బిజెపి, బాన్సువాడలో బి ఆర్ ఎస్, ఎల్లారెడ్డి, జుక్కల్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ నుంచి గెలుపొందినప్పటికీ, ఆయన కాంగ్రెస్ పార్టీ లో చేరిపోయారు. దీంతో మూడు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండగా, బిఆర్ఎస్ పార్టీకి మాజీలే పెద్దదిక్కుగా మారారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలకు ఈ పంచాయతీ ఎన్నికలు కీలకంగా మారాయి. తమ బలాన్ని నిరూపించుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి జిల్లాలో బీజేపీ ఉనికి చాటేందుకు ఆ పార్టీ నాయకుల సమిష్టి సహకారంతో ముందుకు సాగుతున్నారు. అయితే ముగ్గురు ఎమ్మెల్యేలు తమ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తుండగా, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆదిక్యత సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

### వ్యూహం ఫలించేనా?

ప్రధాన పార్టీల నాయకులు పంచాయతీ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ పార్టీ బలహీనంగా ఉన్న గ్రామాల్లో, ఇతర పార్టీల నుంచి మద్దతు ఆశించి భంగపడుతున్న వారిని మచ్చిక చేసుకుంటున్నారు. ఇతర పార్టీల నుంచి తమ పార్టీల్లోకి ఆహ్వానిస్తూ జంప్ జిలానీలకు గాలం వేస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కాంగ్రెస్, బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు కులాల వారీగా లెక్కలు తీస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల బాధ్యతలను ఆయా పార్టీల గ్రామ శాఖలు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు రోజువారి సమాచారాన్ని జిల్లా నాయకులకు చేరవేస్తున్నారు. మంగళవారంతో రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియనుంది. ఈ నేపథ్యంలో బోధన్, నిజామాబాద్ రెవిన్యూ డివిజన్ పరిధిలో ప్రచారపర్వం వేడెక్కనుంది. ఆర్మూర్ డివిజన్ లో మూడో విడతలు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహరచనలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతో హస్తం శ్రేణుల్లో అదే ఉత్సాహం కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను హస్తగతం చేసుకునేందుకు అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకున్నారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అధికార పార్టీ వైపే జిల్లా వాసులు మొగ్గుచూపే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

# ప్రభుత్వ భూముల కబ్జాలకు ప్రయత్నాలు

- కేసులుండగానే అమ్మకాలు.. నిర్మాణాలు
- హైడ్రా ప్రజావాణిలో 47 ఫిర్యాదులు



**హైదరాబాద్, డిసెంబర్ 01 (జనంసాక్షి) :** ప్రభుత్వ భూమి ఎక్కడ ఉంది.. లిటిగేషన్ భూములు, వివాదాలు ఎక్కడెక్కడ ఉన్నాయి.. ఇలా వివరాలు తెలుసుకోవడం అక్కడ కబ్జాలకు పాల్పడడం బడాబాబులకు పరిపాటిగా మారింది. కేసులు, వివాదాలంటూ దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా జాగ్రత్త పడడం.. తర్వాత వాటిని గుట్టు చప్పుడు కాకుండా సొంతం చేసుకోవడం జరిగిపోతోందంటూ పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రహదారుల పక్కనే ఉన్న ప్లాట్లు కొనడం.. తర్వాత ఇష్టానుసారం జరిగి నిర్మాణాలు చేపట్టడంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎల్ ఆర్ ఎస్ లేకపోవడంతో అలా కబ్జా చేసిన భూములను సొంతం చేసుకోలేకపోతున్నారు కాని.. లేని పక్షంలో ఖాళీ స్థలాలు మిగిలేవి కాదని పలువురు పేర్కొన్నారు. కబ్జాలకు ఏది అనర్హం అనేట్టు చెరువులను, నాలాలు, రహదారులను కూడా వదలడం లేదని ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి 47 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్యగారు పరిశీలించి.. పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

### ఫిర్యాదులు ఇలా..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మ మండలం, బహదూర్ పల్లి విలేజ్‌లోని సర్వే నంబరు 227లో దాదాపు 353 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని ఓ కంపెనీ వారితో పాటు.. సొసైటీగా ఏర్పడిన వారు కబ్జా చేశారంటూ గతంలో అక్కడ ప్రజాప్రతినిధిగా ఉన్న ఓ వ్యక్తి హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో జాయింట్ కలెక్టర్ కూడా దీనిని ప్రభుత్వ భూమిగానే పేర్కొనగా.. హైకోర్టు మళ్లీ సర్వే చేయాలని ఆదేశించడంతో గత నెల మరోసారి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ జాయింట్ కలెక్టర్ హైకోర్టుకు నివేదించారు. కోర్టులో వివాదం పెండింగ్‌లో ఉంటుండగానే అక్కడ కొన్ని ఇళ్లు వచ్చేశాయని.. ఓ ఫంక్షన్‌హాల్ ను నిర్మించి ప్రతి కార్యక్రమానికి రూ. 70 వేల వరకూవసూలు చేస్తున్నారని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు. కోర్టు తీర్పు వచ్చేలోపు మరిన్ని అక్కడ నిర్మాణాలు జరగకుండా.. ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలని ప్రజావాణి ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కీసర మండలం నాగారం మున్సిపాలిటీలోని వెస్ట్ గాంధీ నగర్‌తో పాటు పలు కాలనీల నుంచి మురుగు నీరు.. వరద నీరు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ కాలనీల నుంచి వర్షపు నీరు కోమటి కుంటకు వెళ్లేవని.. ఆకాలువకు ఆనుకుని ఉన్న స్థలాన్ని సొంతం చేసుకున్నవారు.. నాలాను పూడ్చేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. 4 వేల గజాల ప్లాట్ కొన్నవాళ్లు గతంలో చేసుకున్న ఒప్పందాన్ని వారి వద్ద తాజాగా కొన్నవారు అమలు చేయకపోవడమే కాకుండా ఉన్న కాలువను ధ్వంసం చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. దీంతో పైన ఉన్న కాలనీల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించిందని.. గతంలో ఉన్న కాలువను పునరుద్ధరించాలని కోరారు.

రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం శ్రీ రమణ కాలనీ సర్వే నంబరు 60లో ప్రభుత్వ భూమిలోకి జరిగి 8 దుకాణాలు నిర్మించుకుని వ్యాపారం చేసుకుంటున్నారని.. స్థానికంగా ఉన్న పలు ప్రభుత్వ విభాగాలకు ఇప్పటికే ఫిర్యాదు చేశామని అయినా ప్రయోజనం లేకపోయిందని ప్రజావాణిలో స్థానికులు వాపోయారు. పక్కనే ప్రభుత్వ పాఠశాలకు.. ఆక్రమణలో ఉన్న దాదాపు 200ల గజాలతో పాటు.. మొత్తం 700ల గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు.

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీలోని ఏకశిలా నగర్ కాలనీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు ఆక్రమణకు గురౌతున్నాయని స్థానిక నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పార్కులు, పోలీసు స్టేషన్, పోస్టాఫీసు, ఇలా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలతో పాటు.. రహదారులను కూడా వదలకుండా కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 50 అడుగుల వెడల్పుతో ఉండే రోడ్డును 15 అడుగుల మేర కబ్జాలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.

# నర్సింగ్ విద్యార్థినిపై కెమికల్ దాడి



**వరంగల్ బ్యూరో, డిసెంబరు 01 (జనం సాక్షి) :** ఓ నర్సింగ్ కాలేజీకి చెందిన నర్సింగ్ విద్యార్థిని పై కెమికల్ దాడి జరిగిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. కాజీపేట కడిపికొండ బ్రిడ్జి మీద బైకు ఆపుకొని కూర్చున్న సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసున్న వ్యక్తి అదే దారిలో వెళుతున్న బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న యువతిపై హఠాత్తుగా కెమికల్ పోయడంతో గాయాల పాలయింది. ఆమెను వెంటనే ఎంజిఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గాయాల పాలైన యువతిది జనగామ జిల్లా జఫర్గడ్ అని తెలిసింది. జరిగిన సంఘటనపై కాజీపేట ఏసిపి తో పాటు పోలీసులు విచారణ చేస్తున్నారు.

# నవంబర్‌లో ఎన్ఎండీసీ అత్యుత్తమ ఫలితాలు





**హైదరాబాద్ (జనంసాక్షి) :** నవంబర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు ఎన్ఎండీసీ ప్రకటించింది. 2026లో సంచిత ఉత్పత్తి 21శాతం అమ్మకాలు 9శాతం పెరిగాయని ప్రకటించింది. నవంబర్ నెలలో రికార్డు స్థాయిలో ఉత్పత్తి 11శాతం, అమ్మకాలు 4శాతం పెరిగాయని పేర్కొంది. ఏప్రిల్-నవంబర్ కాలంలో అత్యధిక ఉత్పత్తి మరియు అమ్మకాల గణాంకాలను నమోదు చేసినట్లు పేర్కొంది. ఉత్పత్తి 5.01 మిలియన్ టన్నులకు పెరిగిందని ఇది నవంబర్ 2024లో 4.51 మిలియన్ టన్నుల నుండి 11% పెరిగిందని, అమ్మకాలు గత సంవత్సరం 4.0 మిలియన్ టన్నుల నుండి 4% పెరిగి 4.17 మిలియన్ టన్నులకు చేరుకున్నాయని పేర్కొంది. ఉత్పత్తి కూడా నెలవారీ లక్ష్యాన్ని 1% అధిగమించిందని, ఇది మైనింగ్ సామర్థ్యం, సమర్థవంతమైన వినియోగాన్ని మరియు కంపెనీ ఆస్తులలో మెరుగైన కార్యాచరణ చేసింది.

ఈ సందర్భంగా ఎన్ఎండీ సీఎండీ అమితవ ముఖర్జి మాట్లాడుతూ నవంబర్ నెలలో సాధించిన వృద్ధికి అభినందనలు తెలిపారు. అధిక-నాణ్యత గల ఇనుప ఖనిజం నమ్మకమైన సరఫరాను నిర్ధారించడం ద్వారా, మేము మా వాటాదారులకు స్థిరమైన విలువను అందిస్తూనే భారతదేశ ఉక్కు రంగానికి ఇస్తున్నామని తెలిపారు. మూడు ఉత్పత్తి యూనిట్లు సమిష్టిగా రికార్డు ఉత్పత్తిని అందించాయని ఉక్కు మంత్రిత్వ శాఖ కింద నవరత్న సీపీఎస్, ఎన్ఎండీసీ బలమైన వ్యూహాత్మక దృక్పథంతో ముందుకు వెళ్తున్నాయని, స్థిరమైన దేశీయ డిమాండ్ మరియు మైనింగ్ ఉత్పాదకత మరియు వ్యయ పోటీతత్వాన్ని బలోపేతం చేయడానికి కొనసాగుతున్న చొరవల మద్దతుతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు.

# నూతన వైన్ షాపులు ప్రారంభం




**బెల్లంపల్లి, డిసెంబర్ 1, (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గంలో సోమవారం నూతన వైన్ షాపులు ప్రారంభం అయ్యాయి. లక్కీ డ్రాలో వైన్ షాపులు దక్కించుకున్న అదృష్టవంతులు ప్రత్యేక పూజలు చేసి నూతన షాపులు ప్రారంభించారు. గ్రామపంచాయతీ ఎన్నికల వేళ నూతన షాపులు లక్కీ డ్రాలో దక్కించుకున్న యజమానులకు ప్రారంభమే పంచాయతీ ఎన్నికలు రావడంతో వైన్ షాపులు కళకళ లాడుతున్నాయి. నూతన మద్యం పాలసీ విధానం ద్వారా మూడేళ్ల పరిమితి ఉండటం, ఎన్నికల కోలాహలం పంచాయతీ ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు వెనువెంటనే ఉడటంతో వైన్ షాపులు దక్కించుకున్న షాపుల యజమానులు ఆనందంలో మునిగి తేలుతున్నారు.

# ఎన్నికల అధికారులు పారదర్శకంగా అంకితభావంతో పనిచేయాలి..

- కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి..



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 1 (జనం సాక్షి):** ఎన్నికల అధికారులు వారికి కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వహిస్తూ నిష్పక్షపాతంగా అంకితభావంతో పనిచేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో నియమించిన నోడల్ అధికారుల పనితీరు పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన ఎం సి సి, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి, ఎం సి ఎం సి తదితర నోడల్ అధికారులు వారికి కేటకేటాయించిన విధులను అంకితభావంతో నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ప్రత్యేకంగా సూచించారు. మొదటి విడత నామినేషన్లు పూర్తి అయి స్క్రూటీని జరుగుతుందని, అదేవిధంగా రెండో విడత నామినేషన్లు మొదలైనవని, ఎన్నికల ప్రక్రియ అంతయు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టరేట్లో నోడల్ పాయింట్లవారిగా డ్యూటీలో కేటాయించిన సిబ్బంది కలెక్టరేట్లో వారి వారి ఎన్నికల విధులు నిర్వహించేందుకు కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాట్లు చేయడమైనదని, ఎప్పటికప్పుడు ఎలక్షన్ కమిషన్ కి అందించవలసిన రోజువారి నివేదికలు అందించాలని ఈ సందర్భంగా నోడల్ అధికారులకు సూచించారు. జిల్లాలో మూడు విడతలుగా కొనసాగుతున్న గ్రామపంచాయతీ మరియు వార్డ్ మెంబర్ల రెండవ సాధారణ ఎన్నికల ప్రక్రియ అంతయు డిసెంబర్ 17 వరకు కొనసాగుతుందని ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు నిరంతరం సంసిద్ధంగా ఉంటూ ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు .ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిపిఓ కల్పన సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులు మరియు సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# విద్యా ప్రమాణాలు పెంచాలి

- ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి

**నిర్మల్ బ్యూరో, డిసెంబర్01(జనంసాక్షి) :** పట్టణంలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాల, కస్బా ఉన్నత పాఠశాలలను సోమవారం వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణ రెడ్డి సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, ఫౌండేషన్ లర్నింగ్ స్టడీకి ఉపాధ్యాయులు, విద్యార్థులు సమగ్రమైన సిద్ధతతో ఉండాలని సూచించారు. కస్బా పాఠశాలలో రికార్డులు, విద్యా కార్యక్రమాల అమలు, భోజన పథక నాణ్యతను పరిశీలించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా బోధనలో 100% నిబద్ధత చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.130 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

- సహజ కవి అందెశ్రీ తో పాటు మాజీ కౌన్సిలర్ సాంబయ్య లకు నివాళులు
- మేయర్ అధ్యక్షతన వరంగల్ బల్దియా సర్వసభ్య సమావేశం
- పాల్గొన్న శాసన మండలి,శాసనసభ్యులు కార్పొరేటర్లు




**వరంగల్ బ్యూరో, డిసెంబరు 01 (జనం సాక్షి) :** సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలు నగర మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది ఈ సందర్భం గా కౌన్సిల్ 39 అంశాలకు, రూ.130 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది.ఇట్టి సమావేశం లో శాసనమండలి సభ్యులు బసవరాజు సారయ్య వరంగల్ (పశ్చిమ) శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు కార్పొరేటర్లు పాల్గొన్నారు.ముందుగా ఇటీవల మృతి చెందిన ప్రముఖ సహజ కవి అందెశ్రీ తో పాటు మాజీ కౌన్సిలర్ బైరీ సాంబయ్య లకు కౌన్సిల్ లో నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి మేయర్ మాట్లాడుతూ వరద వల్ల దెబ్బతిన్న ఒక్కొక్క ఇంటికి 15,000/- వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దినితోపాటుగా వరద బాదిత కుటుంబాలకు ఒక నెల రేషన్ అదనంగా మంజూరు చేశారు. గ్రేటర్ వరంగల్ లోని 6400 మంది కుటుంబాలు ఆర్థిక సహాయం పొందిన కుటుంబాల తరపున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వరంగల్ మహా నగర ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని మేయర్ అన్నారు. అమృత 2.ఓ పథకం ద్వారా వరంగల్ నగరానికి 551 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి.ఈ నిధులతో రానున్న 20 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా తాగు నీటి సరఫరా పనులు 24/7 నీటి సరఫరా పనులకు డి.పి.ఆర్.లు సిద్ధమవుతున్నాయని మేయర్ వివరించారు. వరంగల్ నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు చేపట్టాలని నిర్ణయించడం జరిగింది. నగరంలో తాగునీటి ఎద్దడి లేకుండా ఏళ్ల అవసరాలు ముందే గుర్తించి పనులు చేపట్టేందుకు నిర్ణయించామని అన్నారు. ఈ 50 కోట్ల రూపాయల నిధులతో నగరానికి బహులార్ధకంగా ఉపయోగపడే పనులు ప్రతిపాదించడం జరుగుతోంది.వరంగల్ మహా నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడానికి అడుగులు పడ్డాయి. 66 డివిజన్లలో ఇళ్ల వద్దనే తడి పొడి చెత్తను వేరు చేసేందుకు 198 మంది వాలంటీర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.వరంగల్ మహానగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు అమలు చేశామన్నారు. బస్వరాజు సారయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి హైదరాబాద్ తర్వాత రెండో అతి పెద్ద నగరం గా వరంగల్ కు ప్రాధాన్యం ఇచ్చి ఇతోధికం గా నిధులు మంజూరు చేస్తున్నారని కానీ అధికారుల తీరు బాగాలేదని విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం బాధాకరమని అన్నారు. గ్రీవెన్స్ లో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారానికి నోచుకోకపోవడం సరి కాదని అన్నారు. వరంగల్ (పశ్చిమ)నియోజక వర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ కు సంబంధించి గత 10 సం.లకు ప్రస్తుత 2 సం.లలో జరిగింది గమనించాలని ఎవరికైన అనుమానాలు ఉంటే తీసుకెళ్లి.చూపించడానికి సిద్ధం అని ,నగరం లో వరదలు వచ్చాయని 24 గంటల్లో ముఖ్యమంత్రినీ తీసుకు వచ్చి ఇంటికి రూ.15 వేలు ఇవ్వడానికి చర్యలు తీసుకున్నాం,సోమవారం నుండి అట్టి డబ్బు అకౌంట్ లో జమ అవుతాయని, వరదలు వచ్చినపుడు వాగ్దానాలు ఇచ్చి ఎగ్గొట్ట లేదని ఆర్థిక పరిస్థితి ఆశాజనకం గా లేకున్న నగర అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తున్నామని అన్నారు. వర్ధన్నపేట శాసన సభ్యులు కె ఆర్ నాగరాజు మాట్లాడుతూ ఓపెన్ ప్లాట్ ఓనర్ లకు నోటీసులు ఇచ్చి నీరు నిలవకుండా చూడాలని, తద్వారా డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని,రాష్ట్ర ప్రభుత్వం హాం రోడ్లను అభివృద్ధి చేసే కార్యక్రమాలను ముఖ్యమంత్రి తీసుకురావడం జరిగిందని వారికి వరంగల్ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

కుక్క లు కోతుల సమస్య పరిష్కారానికి ఇటీవల టెండర్ పిలిచి ఒక్కో కోతిని పట్టుకోవడానికి రూ.520 చెల్లించేలా ఖరారు చేశామని కమిషనర్ బాజ్ పాయి తెలిపారు. నగర వ్యాప్తం గా సుమారు 28 వేల వీధి కుక్కలు ఉన్నాయని బల్దియా నుండి అదనం గా మరో ఏ బి సి సెంటర్ ను ఏర్పాటు చేశాం కుక్కల సంతతి పెరగకుండా రేబిస్ వ్యాధి సంక్రమించకుండా వాటికి ఇంజెక్షన్లు ఇస్తున్నాం అన్నారు. సమావేశ అనంతరం ప్రజల సమస్యలను పరిష్కరించడానికి రూపొందించిన "మై జీ డబ్ల్యూ ఎం సి ఆప్" తో పాటు తడి పొడి చెత్తను వేరుగా అందించడానికి వీలుగా ప్రజల అవగాహన కోసం రూపొందించిన వాల్ పోస్టర్ ను మేయర్ శాసన సభ్యులు కమిషనర్ లు సంయుక్తం గా ఆవిష్కరించారు.ఈ సమావేశం లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ తో పాటు బల్దియా ఇంజనీరింగ్ శానిటేషన్ హార్టికల్చర్ టౌన్ ప్లానింగ్ విపత్తు ప్రతిస్పందన విభాగ ఉన్నతాధికారులతో పాటు ఎన్ పి డి సి ఎల్, పబ్లిక్ హెల్త్ విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
2 డిసెంబర్ 2025

# సమకాలీన రాజకీయ వ్యవస్థలో- రాజకీయ పార్టీలు




తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పాతుకుపోయిన రాజకీయ ప్రభావం శాతాల ఆధారంగా విశ్లేషించినప్పుడు ఇది కేవలం చరిత్ర పరంగా మాత్రమే కాక నేటి సమకాలీన రాజకీయ వాస్తవికతలోనూ స్పష్టంగా కనబడుతుంది. స్వాతంత్ర్యపు తొలి దశ నుండి గ్రామీణ సమాజంలో అందరికీ చేరువయ్యే సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ పాలన సాధారణ ప్రజల్లో నమ్మకాన్ని నాటింది. ఆ నమ్మకం కారణంగా 1970–2000 మధ్య గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 60–70 శాతం ప్రజలు కాంగ్రెస్‌ను ప్రధాన రాజకీయ శక్తిగా భావించారు. ఇందిరమ్మ రాజ్యం భావన గ్రామాల్లో ఎంతో బలంగా నిలిచిపోయింది. పేదలకు ఇళ్లు, తక్కువ ధరలకు అన్నం, గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలు, రైతులకు రుణాలు, గ్రామీణ రహదారుల నిర్మాణం, పాఠశాలల విస్తరణ, పేద మహిళలకు ఉపాధి అవకాశాలు వంటి చర్యలు కాంగ్రెస్‌ను గ్రామీణ జీవితంలో భాగంగా మార్చాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజకీయ వాతావరణం మారినా కూడా కాంగ్రెస్ పాతబలం పూర్తిగా కోల్పోలేదు. రాష్ట్ర నిర్మాణం తర్వాత మొదటి దశలో ప్రజల్లో కొత్త ఆశలు వెలిసినా 2014–2023 మధ్యలో గ్రామీణ సమాజం పార్టీలను పునర్విమర్శించడం ప్రారంభించింది. తాజా అధ్యయనాలు, రాజకీయ విశ్లేషణలు, భూతపూర్వ ఎన్నికల గణాంకాలు పరిశీలించినప్పుడు గ్రామీణ ఓటర్లలో సుమారు 38–42 శాతం మంది ఇప్పటికీ కాంగ్రెస్‌ని సంక్షేమ చరిత్ర కలిగిన పార్టీగా గుర్తిస్తున్నారు. ప్రత్యేకించి రైతులు, కూలీలు, అట్టడుగు వర్గాలు, వృద్ధులు, మహిళలు వంటి వర్గాల్లో ఈ శాతం మరింత లాగా 45 శాతానికి పైగా కనిపిస్తోంది.గ్రామాల్లో రాజకీయ అనుబంధం వయస్సుతో మార్పు చెందుతుంది. పెద్దతరం ఓటర్లలో కాంగ్రెస్ అనుబంధం సుమారు 55 శాతం వరకు ఉండగా, యువతలో ఈ అనుబంధం 30–35 శాతం వరకూ కనిపిస్తుంది. అయితే యువతలో ఆర్థిక భద్రత, ఉపాధి అవకాశాలు, విద్యా ప్రయోజనాలు వంటి అంశాలపై చర్చ పెరుగుతున్నందున సంక్షేమ పథకాల స్పష్టమైన చరిత్ర ఉన్న కాంగ్రెస్ వైపు మళ్లీ దృష్టి తిరిగే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

గ్రామీణ మహిళల్లో కాంగ్రెస్ పట్ల సానుభూతి అధికంగా కనిపిస్తోంది. వారి రాజకీయ అభిప్రాయాల్లో సుమారు 48%–%52 శాతం మంది కాంగ్రెస్ అమలు చేసిన అంగన్వాడి సేవలు, ప్రసూతి సమయ వైద్య సహాయం, గృహనిర్మాణ సహాయం వంటి పథకాలను ప్రధాన కారణాలుగా చూపుతున్నారు. దళితులు, గిరిజనులు, చిన్న రైతులు వంటి వర్గాల్లో కాంగ్రెస్ ప్రభావం ఇంకా బలంగా ఉంది. వీరిలో సుమారు 50–60 శాతం మంది కాంగ్రెస్ కాలంలో వచ్చిన సంక్షేమ నిర్ణయాలను గ్రామీణ అభివృద్ధి యొక్క పునాది అని భావిస్తున్నారు.ఇటీవలి పరిస్థితులను పరిశీలిస్తే తెలంగాణలో 2023 తర్వాత గ్రామీణ రాజకీయాలు మళ్లీ సంక్షేమంపై ఆధారపడే దిశగా సాగుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో జరిగిన సర్వేలు, రాజకీయ చర్చలు చూపుతున్నదేమిటంటే సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతులు, రైతు సంక్షేమం వంటి అంశాలలో కాంగ్రెస్ పట్ల ఆకర్షణ మళ్లీ పెరుగుతోంది. కొద్ది సంవత్సరాలుగా గ్రామాల్లో నిర్వహించిన రాజకీయ విశ్లేషణల ప్రకారం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సుమారు 45–50 శాతం గ్రామీణ ఓటర్లు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వగలరని అంచనా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పేదల సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యంగా చూసే గ్రామీణ వర్గాలు "సంక్షేమ చరిత్ర ఉన్న పార్టీనే మళ్లీ అవకాశమివ్వాలి" అనే భావనలో ఉన్నట్లు సూచనలు ఉన్నాయి.

స్వాతంత్రం నుండి ఇప్పటి వరకు కాంగ్రెస్ అమలు చేసిన పథకాల విలువ గ్రామీణ సమాజంలో స్థిరమైన గుర్తింపును సాధించింది. ఉచిత గృహాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, పేదలకు ఆహార భద్రత, రైతు రుణమాఫీలు, పేద మహిళా గుంపులకు ఆర్థిక సాయం, విద్య కోసం ప్రత్యేక కార్యక్రమాలు, గ్రామీణ రహదారుల నిర్మాణం, పింఛన్లు, భరోసా పథకాలు కార్యక్రమాలు కాంగ్రెస్‌కు గ్రామాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన రాజకీయ మూలాలను అందించాయి.

ఈ నేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామీణ తెలంగాణలో కాంగ్రెస్‌కు బలమైన అవకాశం చూపిస్తున్నాయి. గ్రామీణ రాజకీయ వాతావరణం సంక్షేమ ప్రాతిపదికగా మారుతున్న పరిస్థితిలో శాతాల ఆధారంగా చూస్తే కాంగ్రెస్ మళ్లీ గ్రామాల్లో గణనీయమైన పునాది పొందే అవకాశాలు ప్రబలంగా ఉన్నాయి. ప్రజల రాజకీయ నిర్ణయాల్లో అనుభవించిన సంక్షేమం ప్రధాన ప్రమాణంగా మారుతున్నది. కాబట్టి గ్రామీణ ఓటర్లు తమ జీవనానుభవాలను, తమ కుటుంబాల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టే పరిస్థితి ఏర్పడవచ్చని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

సారాంశంగా గ్రామీణ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభావం గతం మాత్రమే కాదు వర్తమాన రాజకీయ వాస్తవికత కూడా అవుతోంది. ప్రజలు సంక్షేమమే నిజమైన పరిపాలన అని నమ్మే స్థితిలో ఉన్నందున గ్రామీణ శాతాల ఆధారంగా కాంగ్రెస్‌కు పెరుగుతున్న మద్దతు రాబోయే ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిబింబించే అవకాశం ఉంది.

తెలంగాణ గ్రామీణ సమాజం నేటి రాజకీయ పరిణామాలను పరిశీలిస్తూ గతంలో తమకు భరోసా ఇచ్చిన ప్రభుత్వాల్ని తిరిగి గుర్తు చేసుకుంటోంది. సంక్షేమం కేవలం ఒక పదం కాదు గ్రామీణ జీవితానికి శ్వాసనిచ్చే ఆధారంగా ప్రజలు భావిస్తున్నారు. ఈ భావనలో కాంగ్రెస్ పాత్ర మరువలేనిది కాబట్టి ప్రజల్లో పాత నమ్మకం మళ్లీ పుట్టుకొస్తోంది. ఎన్నికల సమయంలో వాగ్దానాల కంటే అనుభవించిన ప్రయోజనాలకే ప్రాధాన్యం పెరుగుతున్నది. గ్రామాల్లో పెద్దలు చెప్పిన పాత కథలువంటి సంక్షేమ జ్ఞాపకాలు కుటుంబాలను ఓటు నిర్ణయాల్లో ప్రభావితం చేస్తున్నాయి. రైతు నష్టాలను పట్టించుకునే ప్రభుత్వం అనే గుర్తింపు కూడా కాంగ్రెస్‌కు అదనపు బలం ఇస్తోంది. గ్రామీణ మహిళలు, వృద్ధులు, పేద కుటుంబాలు రోజువారీ జీవితంలో నిజంగా ఉపశమనం ఇచ్చిన పథకాలను గుర్తు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాజకీయ వాతావరణం మళ్లీ స్థిరమైన సంక్షేమంపై దృష్టిసారిస్తున్నది. ఈ మార్పు గ్రామీణ ఓటరును మరింత స్పష్టమైన నిర్ణయం వైపు నడిపిస్తున్నది. చివరికి, పట్టణాల కంటే గ్రామాలు ఎన్నికల హృదయంగా నిలుస్తాయి కాబట్టి గ్రామీణ ఓటరి తీర్పు కాంగ్రెస్‌కు అనుకూలంగా మారే అవకాశాలు మరింత బలపడుతున్నాయి.

ఈ రాజకీయ ప్రస్థానాన్ని విశ్లేషించే ప్రక్రియలో తెలంగాణ గ్రామీణ సమాజం నేడు తీసుకుంటున్న నిర్ణయాలు ఒక ముఖ్యమైన వాస్తవాన్ని చెబుతున్నాయి. ప్రజలు సంక్షేమం అనే మూల్యానికి నిబద్ధత చూపే రాజకీయ శక్తినే తమ భవిష్యత్తుకు బలమైన ఆధారంగా చూస్తున్నారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాలలో యువతలో కూడా రాజకీయ జాగృతి పెరిగి తమ కుటుంబాల ఆర్థిక భద్రతకే ప్రాధాన్యం పెరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో సంక్షేమానికి చరిత్రాత్మకమైన పునాది వేసిన పార్టీగా కాంగ్రెస్‌ను పునర్మూల్యాంకనం చేస్తున్న గ్రామీణ వర్గాలు తమ నిర్ణయాలను ఆ దిశగా మళ్లిస్తున్నాయి. రైతు కుటుంబాల్లో పంటల నష్టాల నుండి తిరిగి నిలబడటానికి సహాయం చేసిన కార్యక్రమాలు మళ్లీ చర్చలోకి రావడం కాంగ్రెస్ ప్రభావాన్ని పెంచుతోంది. పేదలకు అందించిన పింఛన్లు, మహిళలకు ఇచ్చిన ఉపాధి ప్రోత్సాహాలు, గ్రామీణ విద్యా విస్తరణ వంటి అంశాలు గ్రామాల్లో ఓటర్ మనోభావాలను మారుస్తున్నాయి. సమాజంలో అట్టడుగు వర్గాలు కూడా తమకు ఆర్థికంగా అండగా నిలిచిన పార్టీగా కాంగ్రెస్‌ను గుర్తిస్తూ పాత అనుబంధాన్ని పునరుద్ధరిస్తున్నాయి. తెలంగాణ రాజకీయ పరిణామాలు సంక్షేమ ప్రాతిపదిక వైపు మళ్లుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలు తమ ఓటును భవిష్యత్తు భద్రతకు గుర్తింపుగా ఉపయోగిస్తారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రాబోయే ఎన్నికల్లో గ్రామీణ ఓటరుకు సంక్షేమం ప్రధాన ప్రమాణంగా మారుతుండడం కాంగ్రెస్ అవకాశాలను గణనీయంగా పెంచుతోంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## పోటీ పరీక్షలకు దిక్సూచి.. బోధనకు మార్గదర్శి

# డా. ఇడికోజు శ్రీనివాసాచారి

కోట్లాది మనుషుల భావప్రపంచానికి తెలుగు భాష శ్వాస లాంటిది. ఆ భాషను బోధించడం అనేది కేవలం ఉద్యోగం కోసమే కాదు ఆత్మీయత, అంకితభావం, బాధ్యత అనే మూడు మూలాలను కలిపి నడుపాల్సిన గురుతరమైన మహాయజ్ఞం. నిరంతర అంకితభావంతో ఈ యజ్ఞంలో నిమగ్నమై వేలాది మందికి జ్ఞానజ్యోతి వెలిగిస్తూ, తెలుగుతో మునుముందుకు సాగుతూ ఉద్యోగ యుద్ధానికి సన్నద్ధమవుతున్న పోటీ పరీక్షార్థులైన యువతలో కొత్త ఆశలు నింపుతూ, ఉపన్యాసకులకు విద్యా మార్గదర్శకుడిగా, విద్యార్థులకు ప్రత్యక్ష ప్రేరణగా డాక్టర్ ఇడికోజు శ్రీనివాసాచారి నిలుస్తున్నారు. తెలుగు భాషా సాహిత్యంలో విశిష్టతను సృష్టిస్తూ, బోధన రంగంలో వినూత్న మార్గాలను అందిస్తూ, నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపే వ్యక్తిగా ఆయన నిలదొక్కుకున్న తీరు నేటి తరానికి ఆలోచనాత్మకం, అనుసరణీయం.

నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రంలో మధ్య తరగతి విశ్వబ్రాహ్మణ (కమ్మరి) కుటుంబంలో జన్మించిన శ్రీనివాసాచారి గారి బాల్య జీవితం అత్యంత సాధారణమైంది. విలువలను పాటిస్తూ పెరిగే వాతావరణం చిన్ననాటి నుండే ఆయనకు తోడైంది. చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోవడం ఆయన ఆయన కుటుంబానికి పెద్ద దెబ్బ. అన్నయ్య వెంకటాచారి–వదిన సుధారాణిల ఆదరణతో విద్యాభ్యాసాన్ని ఆపకుండా శ్రీనివాస చారి మొక్కవోని ధైర్యంతో కొనసాగించారు. ప్రాథమిక విద్యను చండూరులోనే పూర్తి చేసి, నల్లగొండలోని ఎన్ జి కళాశాలలో కళాశాల విద్యను అభ్యసించారు.గణితశాస్త్రంలో ఆయన డిగ్రీ చదువుతున్నప్పటికీ, ఆయన మనసు మాత్రం తెలుగు భాషా సాహిత్యాల వైపు పూర్తిగా మళ్లిపోయింది. తెలుగు పట్ల ఆయనలో ఉన్న ఆసక్తి, కవిత్వం పట్ల పెరిగిన జిజ్ఞాస ఆయనను సాహిత్య శీలిగా తీర్చిదిద్దాయి. తెలుగు భాషపై శ్రీనివాసాచారికి ఉన్న ఆసక్తిని గుర్తించిన గురువులు ఏనుగు ఉన్నప్రదీప్ రెడ్డి, విజయరాములు, బొడ్డోజు మల్లాచారి అందించిన అపూర్వమైన ప్రోత్సాహం ఆయన విద్యా ప్రస్థానంలో కీలకమైన మలుపుకు దారితీసింది. గణితం డిగ్రీ తర్వాత పూర్తిగా తెలుగులోనే ఉన్నత విద్యకు వెళ్లాలని నిర్ణయించుకొని ఆ దిశగా ముందడుగు వేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2011లో ఎం.ఏ. తెలుగు పూర్తిచేశారు. యూజీసీ నెట్, జెఆర్ యఫ్ విద్యార్హతలను సాధించి తన ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుకుని తద్వారా తనకు ఎంతో ఆసక్తి కలిగిన పరిశోధన రంగంలోకి అడుగుపెట్టారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పీహెచ్ డి లో ప్రవేశం లభించింది."నల్లగొండ జిల్లా ప్రాచీన కవిత్వం – పరిశీలన" అనే వైవిధ్యవంత, ప్రామాణికమైన అంశంపై డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి పర్యవేక్షణలో ఆయన సప్రమాణికమైన పరిశోధన చేశారు.ఈ పరిశోధన కేవలం డాక్టరేట్ పట్టాదారునిగా ఆయనను నిలబెట్టడమే కాకుండా నల్లగొండ ప్రాంతీయ సాహిత్య చరిత్రకు విలువైన అధ్యయనాన్ని కూడా అందించిన ఘనతను దక్కించింది.ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థిగా ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా ఆయన చురుకైన పాత్ర పోషించారు. విద్యారంగం పట్ల ఉన్న ప్రత్యేక ఆసక్తి, సమాజం పట్ల బాధ్యతా భావాన్ని ఆయనను నిరంతర, నిత్య నూతన కృషి వైపు నడిపించాయి.

### పోటీ పరీక్షల బోధకునిగా..

పోటీ పరీక్షల బోధనలోకి శ్రీనివాస చారిని సైకాలజీ లెక్చరర్ మధుబాబు తీసుకువచ్చారు. అభ్యాసం ఉన్నా అవకాశాలు లేని యువతకు విద్యారూపంలో వెలుగు అందించాలనే సంకల్పం ఆ దశలోనే ఆయనలో నాటుకుపోయింది. అత్యంత క్లిష్టమైన తెలుగు వ్యాకరణం, సాహిత్య అంశాలు, పురాణాలు, ప్రాచీన కవిత్వం వంటి విషయాలనుసులభమైన కోడ్లతో,వినూత్న విశ్లేషణతో, పరీక్షా దృక్కోణంలో, జ్ఞాపకశక్తికి అనువుగా,విద్యార్థులకు అందించడమే ఆయన బోధనలోని ప్రత్యేకతదేశంలో జరిగిన తెలుగు పోటీ పరీక్షలప్రశ్నాపత్రాలను సంపూర్ణంగావిశ్లేషించి,తెలుగులో మొదటిసారి సంపూర్ణ గత ప్రశ్నాపత్ర విశ్లేషణ చేసిన వ్యక్తిగా శ్రీనివాసాచారి గుర్తింపు పొందారు.టిఆర్ఈఐఆర్ బి గురుకుల నియామకాలలో డిఎల్, జేఎల్, పిజిటి, టిజిటి పోస్టుల్లో ఎంపికైన అభ్యర్థుల్లో గణనీయ శాతం విద్యార్థులు ఆయన శిష్యులే అవడం గమనార్హం. ఆ విజేతల విజయాల్లో ఆయన మార్గదర్శకత, నిర్వహణ, బోధన కీలక పాత్రను పోషించాయి. కేవలం బోధించడం మాత్రమే కాకుండా నిరుద్యోగ యువత ఎదుర్కొనే ఆర్థిక, మానసిక కష్టాలను అర్థం చేసుకుంటూ, వారు తప్పనిసరిగా గెలవాలి అన్న నిబద్ధతతో ఆయన చేసే సేవకు అందివచ్చిన ఫలితాలే వారి ఆ విజయాలు. టిఆర్ఈఐఆర్ బి పోటీ పరీక్షల్లో మొదట పిజిటి తెలుగు,తర్వాత జేఎల్ (తెలుగు)లో రాష్ట్రంలో 3వ ర్యాంకు, మైనారిటీ గురుకులాల్లో ప్రథమ ర్యాంకు సాధించడం ఆయన కృషికి ప్రత్యక్ష నిదర్శనాలు. ప్రస్తుతం టిఎంఆర్ఇఐఎస్ హెచ్ఓ లో విషయ నిపుణుడిగా రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు బోధన ప్రమాణాలు పెంచడంలో ఆయన కీలక పాత్ర నిర్వహిస్తున్నారు.



### తెలుగు అభ్యాసం కోసం యూట్యూబ్ ఛానల్

తెలుగు నేర్చుకోవాలనుకునే విద్యార్థికైనా ఎక్కడైనా, ఎప్పుడైనా జ్ఞానం అందాలనే ఉద్దేశంతో ఆయన ఒక ప్రధాన వేదికను నిర్మించారు. అదే టిఎల్ జి స్టడీస్ యూట్యూబ్ ఛానల్.ప్రతి వీడియో తెలుగు వ్యాకరణం, సాహిత్యం, వ్యాసాలు, పోటీ పరీక్షా స్ట్రాటజీలుఅన్నింటినీ ఉచితంగా అందిస్తుంది.

### ఉపన్యాసకులకు ప్రాయోగిక శిక్షణ కార్యక్రమాలు

తెలుగు ఉపన్యాసకులకు ఎలా బోధించాలి? తరగతి గది ఎలా చురుకుగా ఉండాలి? విద్యార్థి కేంద్ర బోధన ఎలా అమలు చేయాలి?...ఈ ప్రశ్నలకు ప్రాయోగిక దృక్కోణంలో సమాధానాలు ఇచ్చే శిక్షణా కార్యక్రమాలను శ్రీనివాసాచారినిర్వహిస్తున్నారు.విద్యాసంస్థల్లో తెలుగు బోధనలో ప్రమాణాలు పెరగడానికి ఆయన తన వంతు సహకారాన్ని హితోధికంగా అందిస్తున్నారు.

### సాహిత్య సేవలు - పరిశోధన - రచనలు

30కి పైగా జాతీయ అంతర్జాతీయ వ్యాసాలు, తెలుగు అకాడమీ ప్రత్యేక గ్రంథాల్లో రచనలు, జానపదం, ప్రాచీన కవిత్వం, ఆధునిక కవిత్వం వంటి విభాగాల్లో ప్రత్యేక పరిశోధనలు.. ఇవన్నీ ఆయన సాహిత్య సమర్పణలకు నిదర్శనాలు.

### వ్యాస సంపుటాలకు సంపాదకత్వం...

తెలుగు సాహితీ వీచిక, శృంగార సుధా సముద్ర పూర్ణ చంద్రోదయం, వ్యాస తోరణము, వ్యాస వీచిక, సజీవ స్వరాలు, బిట్ బ్యాంకులు (విద్యార్థుల కోసం) రూపొందించిన సంపుటాలకు సంపాదకత్వం వహించారు.

### పురస్కారాలు- సత్కారాలు

ఉగాది పురస్కారం – 2013, మదర్ థెరిస్సా ఉత్తమ రచయిత – 2018, అంబేద్కర్ రత్న జాతీయ పురస్కారం – 2019,తెలుగు తేజము – 2019,ఉపాధ్యాయ రత్న – 2023, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు – 2025, విశ్వకర్మ విద్యా విభూషణ – 2025 వంటి ఎన్నెన్నో పురస్కారాలు శ్రీనివాసాచారికి లభించాయి. పలు ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక, పరిశోధన, శిక్షణ సంస్థల సత్కారాలను ఆయన అందుకున్నారు.

తన విశిష్ట సేవలతో విద్యార్థులు గెలుపొందితే తనకు దక్కే ఆనందం పురస్కారం కంటే ఎక్కువ అని ఆయన ప్రగాఢ నమ్మకం. కేవలం ఉపన్యాసకుడు గానే కాకుండానిరుద్యోగులకుప్రేరణగా,ఉపన్యాసకుల మార్గదర్శక దీప్తిగా, విద్యార్థుల ఆశావాహ భవిష్యత్తుకు వంతెనగా,తెలుగు భాషాఅభ్యుదయానికి అంకితభావంతో పనిచేసే శిక్షణకర్తగా ఆయన బహుముఖీనంగా ముందుకు సాగుతున్నారు ."గురువు జ్ఞానమే కాదు జీవితాలను మార్చే శక్తి కలవాడు" అన్న మాటను ఆదర్శంగా మార్చుకొని కృషి పథంలో ఆయన నిరంతరంగా ప్రయాణిస్తున్నారు.

డా. తిరునగరి శ్రీనివాస్
9441464764

# రూపాయి పతనం -జనజీవనంపై భారాలు



బ్రిటిష్ ఫౌండ్స్‌తో పోలిస్తే 9 శాతం భారత రూపాయి పడిపోయింది. జపనీస్ కరెన్సీతో పోలితే ఆరు శాతం పడిపోయింది. ఇంత భారీగా ఎందుకు రూపాయి పతనం అవుతోంది అన్నది కూడా చర్చగా ఉంది.

### రూపాయి పతనం ప్రభుత్వ వాదనలు:

రూపాయి పతనం చెందుతున్న కేంద్ర ప్రభుత్వం మాత్రం రివర్స్లో ఆలోచిస్తుంది. నిర్మలా సీతారామన్ రూపాయి బలహీనపడడం కాదు, డాలరే బలహీన పడుతుందని ప్రకటించింది. పైగా మన దేశ "ఎకానమీ ఫండమెంటల్స్" బలంగా బాగానే ఉన్నాయి. "గ్లోబల్ పరిస్థితుల" వలన రూపాయి పడిపోతున్నదని వాదిస్తున్నారు. అదే నిజమైతే గ్లోబల్ గానే డాలర్ పరిస్థితి బాగా లేదు. డాలర్ కూడా పతనం చెందుతుంది. మరి ఇలాంటి సందర్భంలో మన రూపాయి ఎందుకు పడిపోతుందో చెప్పకుండా దాట వేస్తున్నారు. నిజంగా గ్లోబల్ పరిస్థితులే కారణం అయితే జపనీస్ కరెన్సీ డాలర్ కంటే పెరుగుతుంది. యురోపియన్ కరెన్సీ పెరుగుతుంది. ప్రధానంగా మనం 40 దేశాలతో మేజర్ ట్రేడ్ చేస్తాం వరల్డ్ ఎకానమీలో డీ డాలరైజేషన్ ను అమెరికాను వణికిస్తుంటే, డాలర్ తో పోల్చినప్పుడు ఇతర దేశాల కరెన్సీ పెరుగుతుంటే, డాలర్ తగ్గుతుంటే ఇండియా రూపాయి మాత్రం ఎందుకు తగ్గుతుంది? దీనిని ప్రభుత్వం ప్రస్తావించడం లేదు. ప్రపంచ వ్యాప్తంగానే అమెరికా డాలర్ కు ప్రతికూలత ఉంది. అమెరికా స్టాక్ మార్కెట్ భారీగా పతనంలోకి వచ్చాయి. ఎఐ బబుల్ పతనం అవుతుందని వాల్ స్ట్రీట్ అంచనా వేస్తుంది. అమెరికా గవర్నమెంట్ సెక్యూరిటీస్ లో ఫారిన్ ఇన్వెస్ట్ మెంట్స్ తగ్గుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా డాలర్ ఎక్సెంజ్ హావా తగ్గుతుంది. డాలర్ ట్రేడ్ తగ్గుతుంది.

### అమెరికాకు మోకరిల్లుతున్న మోదీ:

ప్రపంచంలో దేశాలపై టారిప్స్ తో ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నాడు. చైనా, యూరోపియన్ దేశాలపై ట్రంప్ టారిప్స్ తో బెదిరింపులు చేసిన, చైనా కూడా టారిప్స్ తో రివర్స్ చేయడంలో బెంబేలెత్తి పోయాడు. కానీ భారత్ పట్ల మాత్రం ట్రంప్ తన దూకుడును ప్రదర్శిస్తున్న మోదీ మౌనంతో తన భక్తినీ చాటుతున్నాడు. 2013లో డాలర్తో పోలిస్తే రూపాయి విలువ రోజు రోజు పడిపోతుందని మన్మోహన్ బలహీన ప్రధాని అని, బిజెపి అధికారంలోకి వస్తే డాలర్ తో సమానంగా రూపాయి విలువ ఉంటుందని ఇంకా చెప్పాలంటే రూపాయికి, రెండు, మూడు డాలర్స్ వచ్చే రోజులు వస్తాయని ఊదరగొట్టాడు. అలాంటి ప్రచారంతో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చి నేడు రూపాయి ప్రమాదకరంగా బలహీన పడుతున్న మోదీ సర్కారు పెద్దగా చర్యలు చేపట్టలేదు.

2014 ఎన్నికల వరకు రూపాయి పతనాన్ని కాంగ్రెస్ పై దాడికి ఆయుధంగా వాడుకున్నారు. ఇప్పుడు తమ ప్రభుత్వ బాధ్యత కాదని అంటున్నారు. పైగా అమెరికాతో ఎలాంటి ట్రేడ్ డీల్ లేకుండానే అమెరికా కోరికలను తీర్చుతున్నారు. అమెరికా కోరుకున్న చర్యలన్నీ ఆమోదిస్తూనే అమెరికాకు మోకరిల్లుతున్నారు. 92 మిలియన్ డాలర్లు పెట్టి రక్షణ రంగంలో మిస్సైల్స్ కోసం ఒప్పందం చేసుకుంది. ఇప్పటికీ 61 సార్లు ట్రంప్ భారత్ ,పాకిస్తాన్ యుద్ధం నేనే ఆపానని చెప్పాడు. కనీసం ఖండించే ధైర్యం కూడా మోదీ చేయలేదు. అమెరికా పాకిస్తాన్ కు ఇస్తున్న యుద్ధ విమానాలనే మనకు అమ్మేందుకు ఒప్పందం చేసుకుంది. పాకిస్థాన్ పెహల్గామ్దాడికి ప్రతిదాడిలో మనపై అమెరికా ఇచ్చిన విమానాలనే మనపై దాడికి వాడింది.అవసరమైతే అమెరికా ఎనబుల్ చేసి ఆపరేట్ చేసే విమానాలకు 92 మిలియన్ డాలర్లతో రక్షణ ఒప్పందం మోదీ ట్రంప్ తో చేసుకున్నాడు. ఇవే కాకుండాఎల్ పి జి దిగుమతులను 6 % నుండి అమెరికా కోసం 10% పెంచారు. మన దేశంలో పత్తి రైతులు ఆగం అవుతున్న, రోడ్డెక్కి పత్తిని కొనుగోలు చేయాలని అన్న దాతలు ఆందోళనలు చెందుతున్న ఇంపోర్ట్ డ్యూటీని కాటన్ పై 11%కి తగ్గించాము. మనదేశానికి మన రైతుల నుండి కాకుండా అమెరికా ఆస్ట్రేలియా నుండి విదేశీ పత్తిని దిగుమతి చేసుకుంటున్నాం. టెస్లా కార్లకు అనుమతులు ఇచ్చి ముంబాయి, ఢిల్లీలో టెస్లా షోరూం లను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఇచ్చాం. ఆయిల్ కొనుగోలు లో 50% టారిప్స్ అమెరికాకు భయపడి రష్యా నుండి ఆయిల్ దిగుమతులను తగ్గించుకుంటున్నాము. 2017 నుండి రష్యా నుండి మనం 62% ఆయిల్ దిగుమతులు చేసుకుంటుంటే 2024 లో 32% ఆయిల్ రష్యా నుండి దిగుమతి చేసుకునే శాతానికి పడిపోయింది. పైగా అమెరికా నుండి ఆయిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకుని వచ్చాడు మోదీ. మన దేశం నుండి 3 లక్షల మంది విద్యార్థులు అమెరికా వెళ్లి చదువుకుంటున్నారు.చదువులు కోసం తమ ఆస్తులను డాలర్లుగా మార్చి అమెరికా కు వారి పిల్లలను పంపుతున్నారు. హెచ్ 1 బి వీసాల పేరుతో అమెరికాలో పని చేస్తూ వారి ఎకానమీ కోసం పని చేస్తున్నారు. ఇండో ఫసిఫిక్ ప్రాంతంలో ఇండియా పాత్రను పరిగణలోకి తీసుకుని ఇండియా మార్కెట్ వారి మార్కెట్ కోసం ఓపెన్ చేయాలని ట్రంప్ బెదిరింపులు చేస్తున్నాడు. ట్రేడ్ డీల్ లేకుండానే మోదీ అన్ని ముందే అమెరికాకు బార్లా తెరుస్తున్నారు. ఎగుమతులు చేస్తే డాలర్లు వస్తాయి. దిగుమతుల వల్ల డాలర్లు రావు, డాలర్స్ సంపాదిస్తున్న దానికి ఖర్చు పెడుతున్న దానికి ఇన్ బ్యాలెన్స్ వల్లన డిమాండ్ సప్లై మిచ్ మ్యాచ్ అయ్యి రూపాయి పతనం చెందుతుంది. ఈ అసమతుల్యత వల్ల కూడా రూపాయి పతనం అవుతోంది. మరో వైపు చూస్తే విదేశీ పెట్టుబడులు తగ్గిపోతున్నాయి.దీని కోసం చర్యలు తీసుకోకుండా ప్రజల భాగోద్వేగాలతో ఆడుకుంటున్నారు. మనదేశంలో 44 బిలియన్ డాలర్ల వరకూ విదేశీ పెట్టుబడులు ఇపుడు దారుణంగా పడిపోయాయి. డాలర్ల ఫ్లో కూడా తగ్గిపోయింది.

చమురు దిగుమతులపై ఆధారపడిన దేశానికి రూపాయి పడిపోవడం అతి పెద్ద దెబ్బ. డాలర్ విలువ పెరుగుతున్న ప్రతిసారీ, భారత్ చెల్లించాల్సిన ఇంధన బిల్లులు అమాంతం పెరుగుతాయి. దాని ప్రభావం పెట్రోల్, డీజిల్ ధరల రూపంలో ప్రజల జేబులకు నేరుగా తాకుతుంది. ట్రాన్స్పోర్ట్ ఖర్చు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం మరింత ముదురుతుంది. కూరగాయల నుంచి నిర్మాణ సామగ్రి వరకు అన్ని రంగాల ధరలు పైకెక్కుతాయి. రూపాయి పతనం ఒక సంఖ్య మార్పే కాదుదేశ ప్రజల ఎదుట కొత్త భారాల పర్వతం పెరగడమే.

రూపాయి పతనం ఎంతో మంది జీవితాలపై వ్యాపారాలపై ప్రభావం చూపిస్తోంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వస్తువుల భారంతో సామాన్యులకు జేబు గుల్ల అవుతుంది. దిగుమతుల మీద ఆధారపడిన వస్తువుల ఉత్పత్తి ఖర్చులు పెరుగుతాయి. దాని వల్లవాటి రేట్లు పెంచాల్సి వస్తుంది. రూపాయి పతనం వలన ల ద్రవ్యోల్బణం, దాంతో ధరల పెరుగుదలకు దారితీస్తుంది కొనుగోలు శక్తి తగ్గుతుంది. బలహీనమైన రూపాయి కారణంగా దిగుమతులు మరింత ఖరీదుగా మారుతున్నాయి. ఆ స్థాయిలో ఎగుమతులు లేకపోవడంతో లోటు భారీగా పెరుగుతోంది. దీనికితోడు ఉపాధి అవకాశాలు కుదించుకుపోవడం, తలసరి ఆదాయం పెరగకపోవడం, నిత్యావసర వస్తువుల ధరలు పైపైకే పోతుండటం, జీవన ప్రమాణాలు పడిపోవడం వంటి మోదీ ప్రభుత్వ విధానాల ఫలితాలు కూడా దేశీయ ఆర్థిక రంగాన్ని మరింత సంక్షోభం వైపు నెడుతున్నాయి. ఈ విధానాలను ప్రతిఘటించి, ప్రత్యామ్నాయం వైపు మళ్లడమే అన్ని సమస్యలకు పరిష్కారం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# వలస దేశాలపై నిషేధం

## వివేకాన్ని కోల్పోయిన ట్రంప్ దురహంకార ప్రకటన

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జారీ చేసిన 19 దేశాల పౌరులపై శాశ్వత వలస నిషేధం ప్రకటన, అమెరికన్ రాజకీయాలలోని ప్రాథమిక విలువలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ట్రంప్ చేసిన ఈ ప్రకటన, తీసుకున్న నిర్ణయం అమెరికా దేశ భద్రత కంటే,అతని మానసిక సంకుచిత, జాత్యహంకార రాజకీయ వైఖరిని వెల్లడి చేస్తుంది. విధాన సంస్కరణల కంటే వైరుధ్యాలను ప్రతిబింబిస్తుంది. ట్రంప్ తన ప్రకటనలో అఫ్ఘనిస్థాన్, సోమాలియా, ఇరాన్, వెనిజువెలా తదితర దేశాల పౌరులను సామూహికంగా క్రిమినల్స్ గా ముద్ర వేసిన విధానం ఆందోళనకు కారణమైంది. మొత్తం జనాభాను ఒకే కత్తితో కత్తిరించే ఈ పద్ధతి వివేకహీనమైనది,జాతి వివక్షతకు దారితీస్తుంది. నిజానికి, అమెరికాలోని చట్టం మరియు భద్రతా సంస్థలు వ్యక్తిగత నేరాలకు వ్యక్తిగతంగా జవాబు చెప్పే విధానాన్ని అనుసరిస్తాయి. అంతే కానీ, మొత్తం ఒక దేశ సామూహిక ప్రజానికానికి శిక్షను విధించటం సహేతుకం కాదు.ట్రంప్ విసరిన ఆరోపణలు రాజకీయాలను మరింతగా దిగజార్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. వలస విధానం ఒక సంక్లిష్టమైన విషయం, దీనికి సూక్ష్మమైన అవగాహన, సమతుల్య విధానం అవసరం.మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఒకే సంతకంతో వేలాది మందిని అమెరికా లోకి అనుమతించారన్న ఆరోపణ వాస్తవికతను మించిన రాజకీయ వ్యాఖ్యానంగా కనిస్తుంది. సాంస్కృతిక నాశనం గురించిన భయాలు కూడా అతిశయోక్తితో కూడుకున్నవి. అమెరికా ఎప్పటికీ వలసల దేశంగా ఉండి, వివిధ సంస్కృతులు దాని సామాజిక తనువులో కలిసిపోయే శక్తినే అమెరికా ప్రాధాన్యతగా మార్చుకుంది. ఈ సంస్కృతుల మధ్య సమన్వయ దృష్టే అమెరికన్ సమాజానికి బలాన్నిచ్చింది, అంతే కానీ అమెరికాను నాశనం చేయలేదు.

వలస దేశాల ప్రజల పై నియంత్రణలు విధించడం కూడా ఆర్థిక వాస్తవాలతో పొంతన లేనిది. అమెరికా ఆర్థిక వ్యవస్థ విదేశీ కార్మికులు, వ్యవసాయదారులు, ఇతర సాంకేతిక నిపుణులపై గణనీయంగా ఆధారపడి ఉంది. ఈ నిషేధం అనేక రంగాలలో కార్మిక శక్తిని తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. నేషనల్ గార్డ్స్ పై దాడి వంటి వ్యక్తిగత సంఘటనలను సామాన్యీకరించి(జనరలైజ్ చేసి), మొత్తం జనాభాపై నిషేధం విధించడం రాజకీయాలలో అత్యంత ప్రమాదకరమైన ధోరణి . భయాన్ని వ్యాప్తి చేయడానికి, వివేచనారహిత మద్దతు సంపాదించడానికి ఒక సాధనంగా మారుతోంది. ట్రంప్ వయసు మరియు ఆరోగ్య స్థితిపై న్యూయార్క్ టైమ్స్ కథనం ఈ చర్చకు మరొక కోణాన్ని జోడిస్తుంది. నాయకుడి శారీరక మరియు మానసిక సామర్థ్యం దేశం యొక్క భవిష్యత్తును నిర్ణయించే విధానాలపై ప్రభావం చూపే అంశంగా మారడం ఆందోళన కలిగించేదే.

గ్రీన్ కార్డు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలకు పిలిచి అరెస్టు చేసిన సంఘటనలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ చర్యలు న్యాయ వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలను ఎత్తిపడుతున్నాయి. ప్రతి వ్యక్తికి న్యాయం లభించే హక్కును అమెరికన్ రాజ్యాంగం హామీ ఇస్తుంది. వెనిజువెలాలో సైనిక చర్యలు చేపడతామని, భయపెట్టే మాటలు కూడా వివేచనా రహితమైనవి. అంతర్జాతీయ సంబంధాలు మరియు ద్వైపాక్షిక సహకారం లేని ఏకపక్ష చర్యలు. ఈ రోజుల్లో ప్రపంచ శాంతి, స్థిరత్వానికి ట్రంప్ లాంటి పిచ్చోడి చేతిలో రాయిలా ముప్పుగా మారింది.చివరకు, ఈ నిషేధం అమెరికా చరిత్రలోని అత్యంత ప్రాథమిక విలువలకు విరుద్ధంగా ఉంది – స్వేచ్ఛ, సమానత్వం మరియు అవకాశాల భూమి అనే భావన. వలసలే ఈ దేశాన్ని నిర్మించాయి. వలసలే ఈ దేశ భవిష్యత్తును రూపొందిస్తాయి. భయం విభజనపై ఆధారపడిన విధానాలు దీర్ఘకాలికంగా అమెరికా దేశానికి హాని చేస్తాయి.

ఈ నిర్ణయం యొక్క తుది ప్రభావం న్యాయపరమైన సవాళ్లు, రాజకీయ ఒత్తిళ్లు మరియు ప్రపంచవ్యాప్త ప్రతిస్పందనలపై ఆధారపడి ఉంటుంది. అయినప్పటికీ, ఒక విషయం స్పష్టంగా ఉంది: అమెరికా తన భవిష్యత్తు గురించి తీసుకునే నిర్ణయాలు దాని ప్రాథమిక విలువలకు అనుగుణంగా ఉండాలి. అంతే కానీ,ట్రంప్ లాంటి అధ్యక్షుడి యొక్క నిలకడలేని తాత్కాలిక రాజకీయ నాయకుని లాభాల కోసం కాదు. ప్రజాస్వామ్యం యొక్క ఈ మహా ప్రయోగంలో, భయం కంటే ఆశ, విభజన కంటే ఐక్యత, బహిష్కరణ కంటే సమైక్యతే విజయాన్ని సాధిస్తుంది.

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్. 9849328496

## జర్నలిస్టుల సంక్షేమమే టియుడబ్ల్యూజే యూనియన్ లక్ష్యం



**శామీర్‌పేట, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే యూనియన్ ధ్యేయమని టియూడబ్ల్యూజే యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీద బాలరాజు, ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డిలు అన్నారు. సోమవారం షామీర్పేట మండల కేంద్రంలో ప్రింట్ మీడియా సభ్యులకు టియుడబ్ల్యూజే గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి మాట్లాడుతూ టియుడబ్ల్యుజే యూనియన్ లో పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఆదరణ లభిస్తుందని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించుటకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండలం ప్రింట్ మీడియా అధ్యక్షుడు క్యాతం రవి, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభాకర్ యాదవ్, ఉపాధ్యక్షులు మంచాల శేఖర్, కోశాధికారి గిరిప్రసాద్, ముఖ్య సలహాదారులు దేశం కృష్ణ, నరసింహారావు, సింగిరెడ్డి వెంకటరెడ్డి, కార్యవర్గ సభ్యులు రవీందర్ గౌడ్, శ్రవణ్ కుమార్, యాదగిరి (చిన్న), సభ్యులు శ్రీనివాస్, బాలకృష్ణ, రవి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల మహా ధర్నాను విజయవంతం చేయండి

- టియుడబ్ల్యూజే - ఐజేయు
- కాప్రాలో పోస్టర్ ఆవిష్కరణ

**కాప్రా, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టీయూడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో డిసెంబర్ 3న రాష్ట్ర సమాచార శాఖ ఐజేయుకమిషనర్ కార్యాలయం ముందు చేపట్టనున్న జర్నలిస్టుల మహాధర్నాను విజయవంతం చేయాలని టియుడబ్ల్యూజే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రాంరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కాప్రా సర్కిల్ కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద డిసెంబర్ 3న తలపెట్టిన మహా ధర్నా కు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు అత్యంత నిరాధారణకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో జర్నలిస్టులకు అమలైన సంక్షేమ పథకాలను సైతం తెలంగాణ రాష్ట్రం వచ్చాక అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో



జర్నలిస్టులకు అమలైన హెల్త్ స్కీమును ప్రస్తుత ప్రభుత్వాలు తుంగలో తొక్కయని, టిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం అయ్యాయని అన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో పయనిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రెండేళ్లు గడిచిన జర్నలిస్టులకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు గుర్తింపు కార్డులకు సంబంధించి అక్రిడేషన్ పాలసీ తీసుకురావడంలో , ఆరోగ్య బీమా పథకం, వృత్తి కమిటీల పునరుద్ధరణ, జర్నలిస్టుల భద్రత ఇండ్లు ఇండ్ల స్థలాల మంజూరు, చిన్న మధ్యతరగతి పత్రికలను ఆదుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా నిర్లక్ష్యం వహించడంపై జర్నలిస్టులను ఆందోళనకు గురి చేస్తుందన్నారు. రెండేళ్లుగా సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని అనేక దఫాలుగా కలిసి జర్నలిస్టుల సమస్యలు విన్నవించిన ఎలాంటి ఫలితం లేకపోయిందన్నారు. దీని ఫలితంగానే జర్నలిస్టుల హక్కులను సాధించుకునేందుకు పోరాట బాట పట్టక తప్పలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా సంయుక్త కార్యదర్శి మహమ్మద్ అక్బర్, కార్యవర్గ సభ్యుడు ఏవి శ్రీధర్ రావు, జర్నలిస్టు యూనియన్ నాయకులు వేముల శంకర్, శనిగరం అశోక్, కే, సహదేవ చారి, కీర శ్రీనివాస్, కీర్తి శ్రీనివాస్, చుక్క రమేష్, గంగి కృష్ణ, దాస రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

- పాల్గొన్న పది రాష్ట్రాల సీనియర్ రవాణా, పోలీస్ అధికారులు

**ఖైరతాబాద్, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** అధ్యయనం ఒక నిరంతర ప్రక్రియ, అభ్యాసం జీవి తాంతం కొనసాగే ప్రయాణం, రోజురోజుకు పుట్టుకొ స్తున్న నూతన సాంకేతికతను అందుకోవడం వల న మాత్రమే ఇంజనీరింగ్ సవాళ్లను, నిర్వహణ నై పుణ్యాలను, వివిధ కేస్ స్టడీల అధ్యయనంతో నిర్ణ యాల తీసుకునే సామర్థ్యంతో పాటుగా సమయా నికి ముందే ప్రాజెక్టులు పూర్తి చేయడం జరుగుతుం దని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరె క్టర్ డాక్టర్ జి.రామేశ్వర రావు అన్నారు. సివిల్ ట్రాన్స్ పోర్టేషన్ ఇంజనీరింగ్, మేనేజిమెంట్ టెక్నాల జీ, క్వాలిటీ అండ్ ప్రొడక్టివిటీ డివిజన్స్ ఏర్పాటు చేసిన డిజిటల్ ట్రాన్సఫార్మేషన్ ఇన్ పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్, పంప్స్ ఆపరేషన్ ఫర్ ఆయిల్ అండ్ గ్యాస్ అప్లికేషన్స్, లీన్ సిక్స్ సిగ్మా గ్రీన్ బెల్ట్ ట్రైనింగ్ కార్యక్రమాలను రామేశ్వర్ రావు సోమవారం కాలేజీలోని కన్వెన్షన్ సెంటర్ లో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన అభ్యర్థులు, వివిధ డివిజన్ హెడ్స్ సమక్షంలో ప్రారంభించారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలోని పన్నెండు డివిజన్స్ ద్వారా గత నాలుగు దశాబ్దాలకు పైగా ఇస్తున్న శిక్షణతో ఇంజనీర్స్, సైంటిస్ట్స్, టెక్నో మేనేజర్స్ సిబ్బందిలో పెరిగిన నైపుణ్యాభివృద్ధితో ఉత్పా దకత పెరిగి సుస్థిర అభివృద్ధికి బాటలు వేస్తాయని అన్నారు. సివిల్ ట్రాన్స్ పోర్టేషన్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్



ఆర్.వెంకట రెడ్డి మాట్లాడుతూ ఐదురోజు లు కొనసాగే డిజిటల్ ట్రాన్సఫార్మేషన్ ఇన్ పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ శిక్షణ కోసం అస్సాం, ఒరిస్సా, మహా రాష్ట్ర, త్రిపుర, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, కేరళ, ఢిల్లీ రాష్ట్రాల సీనియర్ ట్రాన్స్ పోర్ట్ అధికారులు, పోలీస్ అధికారులు హాజరైన ఈ శిక్షణ కార్యక్రమం భారత ప్రభుత్వ మిసిస్ట్రీ ఆఫ్ ట్రాన్స్ పోర్ట్ అండ్ హై వేస్ ఆధ్వర్యంలో నిపుణు లైన సీనియర్ ఫ్యాకల్టీలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విచ్చేసిన షెల్ ఇండి యా టీమ్ లీడ్ చేసిన ఉన్నతాధికారి లక్ష్మి నారా యణను డైరెక్టర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజిమెంట్ టెక్నాలజీ హెడ్ డాక్టర్ యు.ఎస్.జ్యోతి, క్వాలిటీ ప్రొడక్టివిటీ హెడ్ ఈ. రామ కిషోర్, ఎస్కి చీఫ్, డిప్యూటీ చీఫ్ లక్ష్మి కాంత రావు, డాక్టర్ పి.రాజారావు, డాక్టర్ భరత్ తదితరు లు పాల్గొన్నారు.

## 1 కోటి 29 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఉప్పల్, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** చిల్కానగర్ డివిజన్ లో 1 కోటి 29 లక్షల రూపాయల వ్యయంతో పలు కాలనీలో బస్తీల్లో చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి,చిల్కానగర్ డివిజన్లోని పలు కాలనీలో బస్తీల్లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మరియు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.బాలాజీ ఎంక్లేవ్ మరియు నార్త్ కళ్యాణపురిలో నీ ఉద్యానవనాలలో వాకింగ్ ట్రాక్, వాచ్మెన్ రూమ్, చైన్ లింక్ ఫెన్సింగ్ , సీసీ కెమెరాలు, గజబు, బెంచీలు, మరియు గ్రీనరీ తో కూడిన చెట్ల మొక్కలు గార్డెనింగ్ మొదలగు వాటికి శంకుస్థాపన చేశారు.సాయిరాం నగర్ కాలనీలో బాక్స్ డ్రీమ్ మరమ్మతుకు శంకుస్థాపన చిల్కానగర్ బొడ్రాయి వెనకాల గల్లీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన.అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్లో దశలవారీగా అభివృద్ధి పనులను చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని చిల్కానగర్ డివిజన్ ప్రజలకు ఎమ్మెల్యే ఎలక్షన్ లో ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని కొనియాడారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్లో అభివృద్ధి పనులు ఒక యజ్ఞం లాగా చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని, చిల్కానగర్ డివిజన్ కి



అత్యధికంగా అభివృద్ధి పనులకు నిధులు సేకరించామని ఇప్పటికీ 105 కోట్ల రూపాయలు దాటాయని చిల్కానగర్ డివిజన్ ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తామని పెద్ద ఎత్తున నిధులు సేకరించే విషయంలో సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఈ వెన్నెల గౌడ్ ఏ ఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వారి కమిటీ సభ్యులు మహిళా నాయకురాలు, బస్తీ వాసులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



**రాజేంద్రనగర్, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సీనియర్ సిటిజన్స్, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసి పలు సమస్యలు, అభ్యర్థనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రతినిధులు కార్పొరేషన్‌లో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక భవనం ఏర్పాటు చేయాలని కోరగా, సమస్యను సానుకూలంగా పరిశీలించిన ఎమ్మెల్యే త్వరలోనే స్థలం గుర్తించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే కార్పొరేషన్ పరిధిలోని కాలనీలు, పాత గ్రామాల్లో భారీగా పెండింగ్‌లో ఉన్న వాటర్ బిల్లులపై 50% రాయితీ ఇవ్వాలనే వినతిని ఎమ్మెల్యే కి అందించారు. దీనిపై జల మండలి ఎండితో మాట్లాడి ప్రజలకు ఉపశమనంగా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.అదే విధంగా కిస్మత్పూర్ ప్రాంతంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న 155 ఎకరాల్లో కనీసం 5 ఎకరాలు కార్పొరేషన్‌కు కేటాయిస్తే, వాకింగ్ ట్రాక్, మినీ స్టేడియం, ఇతర క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేసుకునే వీలుంటుందని ప్రతినిధులు వివరించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకునేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు గోకరి శ్రీలత సురేష్ గౌడ్, సాగర్ గౌడ్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు శివరాం రెడ్డి, ఆనంద్ రెడ్డి, కామేశ్వరరావు, కృష్ణారావు, మల్లన్న, శ్యాములు గౌడ్, జానకి రాములు, ఎన్ఎస్ రామలింగం, బాపిరెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, ప్రసాద్ యాదవ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** ఒక కార్పొరేటర్ గా తన రాజకీయ భవిష్యత్తుకు ఓనమాలు అందించిన డివిజన్ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, ప్రతి కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం సాయి శక్తుల కృషి చేస్తానని మియా పొలిటిషన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీల గార్డెన్ కాలనీలో గల పలు సమస్యలు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కాలనీ వాసులతో కలసి ఉప్పలపాటి శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీల గార్డెన్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన కార్యక్రమాలపై సోమవారం కాలనీ అసోసియేషన్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొనడం జరిగిందని, తనదృష్టికి తీసుకువచ్చిన సమస్యలను, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీల గార్డెన్ కాలనీ అధ్యక్షులు ఫణికుమార్, అసోసియేషన్ సభ్యులు ప్రవీణ్ కుమార్, విశ్వనాథ్, జగదీష్, జెష్వంత్, ప్రసాద్, కేశవ్ ప్రసాద్, బుచయ్య, శ్వేత, శాంతి ప్రియ, చేతన్, గోపాల్, రాఘవ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని వికారాబాద్ మండలం పులు మద్ది గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వికరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం తనిఖీ చేశారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని, అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా



విధులు నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత నిర్ణయాలను అమలు చేయకూడదని అన్నారు. విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలని, నిర్నీత గడువు లోపల నామినేషన్ లు స్వీకరించేందుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలు తెలుపుతూ, వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ తెరిచి, అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. కలెక్టర్ తో పాటు ట్రైని కలెక్టర్ హార్స్ చౌదరి.ఎం పి డి ఓ నవీన్ కుమార్ఎం. ఆర్ ఓ లక్ష్మి నారాయణ. అధికారులు ఉన్నారు.

## గ్లోబల్ సమ్మిట్ పనులను వేగవంతం చేయాలి

- అధికారుల సమన్వయంతో పనిచేయాలి
- పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి
- ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ ఆథారిటీ కమిషనర్ శశాంక



**మహేశ్వరం, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** కందుకూరు మండలం ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8,9 తేదీలలో జరిగే గ్లోబల్ సమ్మిట్ పనులను వేగవంతం చేయాలని ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ ఆథారిటీ కమిషనర్ శశాంక అధికారులకు సూచించారు.సోమవారం రాచకొండ సీపీ సుధీర్ బాబు,అడిషనల్ డీజీ డి.ఎస్ చౌహన్ లతో,పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక మాట్లాడుతూ...వివిధ దేశాల నుండి వచ్చే అతిథులకు అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు జరగకుండా కేటాయించిన పనులను ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వహించాలన్నారు.విద్యుత్,ఇంటర్ నెట్ సరఫరా లో ఇటువంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు.రవాణా సౌకర్యం, త్రాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలాల ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు.మెడికల్ సిబ్బందితో అవసరమైన శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ సెక్రెటరీ నర్సింహ రెడ్డి, అధికారులు ప్రేమ్ రాజ్, అశోక్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ

**తాండూరు, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మరియు దిశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ర్యాలీని తాండూరులోని జిల్లా ఆసుపత్రి ఆవరణలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి స్వర్ణకుమారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ని జిల్లా ఆసుపత్రి నుంచి వినాయక చౌక్ కూడలి వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐ సి టి సి మరియు ఎఆర్టి సెంటర్ సిబ్బంది, దిశా స్వచ్ఛంద సంస్థ వాలంటీర్లు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహిస్తూ హెచ్ఐవి ఎయిడ్స్ అవగాహన ప్లే కార్డ్స్ పట్టుకొని ఎయిడ్స్ వ్యతిరేక, అవగాహన నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం జిల్లా ఆసుపత్రిలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వాలంటీర్లు, సాధారణ ప్రజలు , ఆశా కార్యకర్తలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి స్వర్ణ కుమారి తో పాటుగా, హెచ్ఐవి ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, తాండూరు పట్టణ ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ జయప్రసాద్,




తాండూరు జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వినయ్ కుమార్, ఎఆర్టీ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సమీయుల్లా ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు చేస్తారని, జిల్లాలో 5 ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్స్ ఉన్నాయని, జిల్లాలో రెండు హెచ్ఐవి ఎయిడ్స్ చికిత్స కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 3800 మంది హెచ్ఐవికి చికిత్స పొందుతున్నారని, గత సంవత్సరాలతో పోలిస్తే హెచ్ఐవి కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతుందని తెలిపారు. గర్భవతి అయిన ప్రతి స్త్రీకి హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని, ఈ సంవత్సరం తాండూర్ ఎం.సిహెచ్ సెంటర్ లో హెచ్ఐవి పాజిటివ్ ఉండి గర్భం దాల్చిన ఇద్దరికీ సురక్షితంగా ప్రసవం చేశామని తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ పనితీరు కనబరిచిన కుల్కచర్ల, పట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తాండూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రశంస పత్రాలు అందజేశారు. అదేవిధంగా హెచ్ఐవి ఎయిడ్స్ పై 10 ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన నిర్వహించి ఉత్తమ రచయితలకు ప్రశంసా పత్రము, బహుమానం అందించడం జరిగిందన్నారు. అంతేకాక హెచ్ఐవి ఎయిడ్స్ నిర్ధారణ, నివారణ, అవగాహన కొరకు ఉత్తమ పనితీరు కనబరిచిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వాలింటిర్లకు ప్రశంసా పత్రము మరియు జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో పై అధికారులతో పాటు జిల్లా మాస్ మీడియా అధికారి వి . శ్రీనివాసులు, దిశా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ డానియల్ , ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



**హయత్‌నగర్, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో డిసెంబర్ 2వ తేది నుండి 4వ తేది వరకు నిరసన, 5వ తేదీన కోఠిలోని మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్ కార్యాలయం వద్ద మహధర్నా కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని, వనస్థలిపురం మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ కి ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యం లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఐహెచ్ఎఫ్ఎంఎస్ ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నూతన టెండర్లను పిలిచి కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ అధ్యక్షురాలు బాగ్యమ్మ, ప్రధాన కార్యదర్శి శ్యామల, ఉపాధ్యక్షులు బి. కిరణ్, కే. స్టాలిన్, కోశాధికారి జ్యోతి, తదితరులు పాల్గోన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సమిష్టి కృషితో గెలుపొందాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి



**మెదక్, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ... సేవ చేస్తానని, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మరెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారంలోని బాబా ఫంక్షన్ హాల్లో బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామ్పల్లి గౌరిశంకర్ గుప్తా అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు ఉమ్మన్న దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో బీఆర్ఎస్కు మంచి పట్టు ఉన్నదని, పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా నిలబడితే గెలుస్తామని ఆశావవాహులు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. గ్రూపులు, వర్గాలకు తావు లేకుండా అందరు ఏకతాటిపైకి వచ్చి బీఆర్ఎస్ మద్దతుదారు లందరిని గెలుపించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయకుండా ప్రజలందరినీ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి గుర్తుచేయాలన్నారు. మహిళలకు బతుకమ్మ చీరలు కాకుండా ఇందిరమ్మ పేరిట ఇస్తున్నారని, అవి కూడా కోటి 30 లక్షల మందికి కాకుండా 50లక్షల మందికే ఇవ్వాలనుకున్నారని అన్నారు. వృద్ధుల దగ్గరకు వెళ్లినప్పుడు పింఛన్, యువకుల దగ్గరకు వెళ్లి రెండు లక్షల జాబ్ల గురించి, పెంచిన బస్సు చార్జీలు, కల్యాణలక్ష్మితో పాటు ఇవ్వని తులం బంగారం, మహిళలకు రూ.2500, రైతులకు రైతుబంధు, బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని జీవో తీసి నాటకమాడిన విష యాన్ని గుర్తు చేయాలన్నారు. ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్ ప్రభు త్వానికి పథకాలు గుర్తుకొస్తాయన్నారు. మనందరం కలసి సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకుని గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. జై తెలంగాణ నినాదంతో ఫంక్షన్ హాల్ ప్రాంగణమంతా హెూరెత్తింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ లోపాలను ఎత్తిచూపుతూ బిఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని, సమిష్టి కృషితో పార్టీ మద్దతు దారులను గెలిపించుకోవాలని మండల పార్టీ అధ్యక్షుడు గౌరిశంకర్ గుప్తా, మాజీ జెడ్పిటిసి మేఘమాల సంతోష్, ఎంపీపీ మంజుల కాశీనాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, సొసైటీ చైర్మన్లు చిన్నారం ప్రభాకర్, నాగూరి మనోహర్, మాజీ సర్పంచ్లు గోదావరి, నెల్లి కిష్టయ్య, చలం యాదగిరి, శ్రీనివాస్ నాయక్, ఎనగండ్ల సాయిబాబాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, రంగంపేట సొసైటీ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి, బాగా రెడ్డి, వేమారెడ్డి, దొడ్ల ఆంజనేయులు, నీరుడి లక్ష్మయ్య, యోహన్, పైతర చంద్రశేఖర్ రెడ్డి, మురళి గౌడ్, గౌరీ శంకర్, సిద్ధి రాములు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ పగడ్బందీగా నిర్వహించాలి

- డిఆర్డిఓ ఉమాదేవి



**వీపనగండ్ల, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎన్నికల శిక్షణ తరగతులు ఉపాధ్యాయులకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిఆర్డిఓ ఉమాదేవి, తహసిల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్ రావు, ఎం.ఈ.ఓ నరసింహ, వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్,పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి, శిక్షకులు జితేందర్ గౌడ్,జయంతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ ఉమాదేవి మాట్లాడుతూ ఎన్నికల సంఘం స్థానిక మూడో విడత నోటిఫికేషన్ విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించే మూడో విడత స్థానిక ఎన్నికల నిర్వహణ గురించి తగిన సలహాలు సూచనలు చేశారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రణాళిక బద్ధంగా నిష్పాక్షితంగా నిర్వహించాలని కోరారు. ఓటు వేసి వారి నుండి గుర్తింపు కార్డు తప్పకుండా సరి చూసుకోవాలని అన్నారు. పోలింగ్ బూత్ అధికారులు ఎన్నికల సంఘం నియమావళి నిబంధనలను పాటించాలని అన్నారు.

## ట్యాంక్‌బండ్ పై పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



**మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** పోలీస్ కిష్టయ్య మలి దశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ డిమాండ్ చేశారు. పోలీస్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆయనకు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి వాల్ పోస్టర్ వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. మహబూబ్నగర్ మండల కేంద్రాల్లో జిల్లా కేంద్రాల్లో అమర స్తూపాల వద్ద పోలీస్ కిష్టయ్య సంస్మరణ దిన వర్ధంతిని ఘనంగా నిర్వహించామామని పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని రాజధానిలోని ట్యాంక్బండ్ పై ఏర్పాటు చేయాలని పోలీస్ కిష్టయ్య వర్ధంతి రోజున తెలంగాణ అమరవీరుల దినోత్సవంగా నిర్వహించాలని కోరారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు టిఆర్ఎస్ నేతలు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 2వ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** సోమవారం హైదరాబాదు నుండి ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల జిల్లా కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ విడత నామినేషన్ల స్వీకరణ, వచ్చిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్ బ్యాలెట్ బాక్సులు, శాంతిభద్రతలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ, జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, నామినేషన్ల పరిశీలన కూడా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్,ఎస్.ఎస్.టి,ఎం.సి.సి ,ఎన్నికల వ్యయ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు జిల్లాలో ఎన్నికల నిర్వహణలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు రాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని, అవసరమైన బ్యాలెట్ బాక్సులను కేటాయించడం జరిగిందని అదేవిధంగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కూడా సమకూరుస్తున్నట్లు తెలియజేశారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు,మైక్రో అబ్జర్వర్ లను నియమించనున్నట్లు తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు ఎస్.పి.డి జానకి మాట్లాడుతూ ఎఫ్.ఎస్.టి.,ఎస్.ఎస్.టీ బృందాలు పర్యవేక్షణ చేస్తున్నట్లు,బైండోవర్ కేసులు 61 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు కాత్యాయని దేవి, ఎస్పీ డి జానకి,రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- బిజెపి సీనియర్ నాయకులు ప్రేమేందర్ రెడ్డి




**జహీరాబాద్, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపి లక్ష్యంగా బిజెపి శ్రేణులు కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గుజ్జల ప్రేమేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షులు, యువరైతు రమేష్ రెడ్డి బసంత్ పూర్ జన్మదిన వేడుకలకు ప్రేమేందర్ రెడ్డి ఈ సందర్భంగా జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న రమేష్ రెడ్డికి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో బిజెపి అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పైడి ఎల్లా రెడ్డి, శ్రీ గోపాల్ రెడ్డి, గొల్ల భాస్కర్,సుభాష్ రెడ్డిలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిదంగా పట్టణ మరియు జహీరాబాద్ నియోజక వర్గానికి చెందిన పలువురు బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దు



**పాపన్నపేట, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** పాపన్నపేట మండలంలో ఈ నెల 11న జరగబోయే మొదటి విడత స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఎన్నికలలో ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘించిన, అధికారుల విధులకు ఆటంకాలు కలిగించిన చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. యువత ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రజలు ఇరు పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలన్నారు. ఓటర్లను మభ్య పెట్టేందుకు అభ్యర్థులు డబ్బులు,మద్యం పంపిణీ చేయడం సరికాదన్నారు. ప్రజలు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కార్మికుల ఐక్యతతోనే సౌకర్యాలు

- సీఐటీయూ నిరంతరం కార్మికుల పక్షమే
- కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారమే సీఐటీయూ లక్ష్యం
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు




**జహీరాబాద్, డిసెంమర్ 1 (జనం సాక్షి) :** కార్మికుల ఐక్యతతోనే కార్మికులకు సకల సౌకర్యాలు లభిస్తాయని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు అన్నారు. సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్యఅతిథిగా చుక్క రాములు పాల్గొని మాట్లాడుతూ.. నిరంతరం సిఐటియు కార్మికుల పక్షమే ఉంటుందని కార్మికుల సమస్యలు పరిష్కారం, హక్కుల సాధనకు నిరంతరం పోరాటాలు ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. కార్మికులు ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. కార్మికుల ఉద్యమాలు పోరాటాల్లోకి రావాలని, కార్మిక చట్టాల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం జహీరాబాద్‌లోని బుచినెల్లి పారిశ్రామిక ప్రాంతంలో సీఐఈ పరిశ్రమంలో సిఐటియు ఆధ్వర్యంలో మంచి వేతన ఒప్పందం అయిన కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి హక్కుల సాధనకు పెద్ద ఎత్తున ఉద్యమాలు పోరాటాలకు సిద్ధం కావాలని అందుకు సిఐటియు నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతుందన్నారు. సిఐటియు కార్మికుల పక్షమే ఉంటుందని అందులో భాగంగానే సీఐఈ లో కూడా మంచి వేతనం ఒప్పందం చారిత్రాత్మక వేతన ఒప్పందం చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉమ్మడి పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. కార్మికుల హక్కులను కాపాడటమే సీఐటీయూ లక్ష్యమని, కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు యూనియన్ అధ్యక్షులు బీరం మల్లేష్, సిఐటియు నాయకులు మహిపాల్, రాజిరెడ్డి సందీప్ రెడ్డి నర్సయ్య నరేష్ నారాయణ మహేశ్వర్ రవి వహబొద్దిన తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి



**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబరు 1 (జనం సాక్షి) :** నామినేషన్ల ప్రక్రియ ను సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. జిల్లాలోని రామాయంపేట,నర్సింగి, నిజాంపేట్ ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయం

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** తెలంగాణను అభివృద్ధిలో దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా ఆత్మకూరు పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. రూ.15 కోట్ల వ్యయంతో ఆత్మకూరు నగర అభివృద్ధి పనులకు, రూ.15 కోట్ల వ్యయంతో అమరచింత నగర అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.22 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటరు భవన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పి. జె.పి క్యాంపు ఆవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలకాల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి కె. అరవింద్ ప్రసాద్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి పూల బోకె ఇచ్చి స్వాగతం పలికగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు సహచర మంత్రులు వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడలు మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, దేవరకద్ర శాసన సభ్యులు జి మధుసూదన్ రెడ్డి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, వనపర్తి జిల్లా ఎస్పీ డి. సునీత,ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్, ఇతర నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** ప్రజల సమస్యలకు పరిష్కరించడానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ప్రత్యక్షంగా ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు, ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి/గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫిర్యాదుదారుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా విని, సమస్యలు తలెత్తడానికి గల కారణాలపై సంబంధిత ఎస్‌హెచ్ఓ లతో ప్రత్యక్షంగా ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి కేసును పారదర్శకంగా దర్యాప్తు చేస్తూ.. బాధితులకు బాసటగా నిలవాలని ఎస్.హెచ్.ఓలకు సూచనలు చేశారు. జిల్లా ప్రజలు తమ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం దొరకనప్పుడు, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదు పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, సత్వర పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# నేషనల్ హైవే-65 పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- యన్‌హెచ్-65 పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష



**సంగారెడ్డి, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** జిల్లాలో ఎన్ హెచ్ -65 పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులకు ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారి-65 విస్తరణ, అభివృద్ధి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నేషనల్ హైవే అథారిటీ విభాగం (ఎన్‌హెచ్ఏఐ) విద్యుత్, ట్రాఫిక్, పోలీసు, తదితర అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ హెచ్ -65 పనులు జిల్లాలో కీలకమైనవని, ఏవిధమైన జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రాజెక్టు పనులను ముందుగానే సమగ్ర ప్రణాళికతో అమలు చేయాలని, ఆయా శాఖల మధ్య సమన్వయం అవసరమని తెలిపారు. హైవే పనుల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైన్ డిపార్ట్మెంట్స్ అన్ని సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. హైవే పనులను త్వరిత గతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులు ఈ సందర్భంగా చేపట్టిన పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులు, భూ సేకరణ, యుటిలిటీల మార్పిడి వంటి అంశాలను కలెక్టర్‌కు వివరించారు. ఆయా అంశాలకు సంబంధించి కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) మాధురి,అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు, నేషనల్ హైవే అథారిటీ ఎస్ ఈ ధర్మారెడ్డి, ఈఈ రమేష్, ఎగ్జిక్యూటివ్ కన్సల్టెంట్ శాస్త్రి, సంగారెడ్డి ఆర్ డి ఓ రాజేందర్,వక్స్ బోర్డ్, దేవాదాయ, విద్యుత్, ట్రాన్స్పోర్ట్ తదితర విభాగాల అధికారులు,సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత ప్రచారం కల్పించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**నిర్మల్ రూరల్,డిసెంబర్1(జనం సాక్షి) :** ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.డిసెంబర్ 01ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం నుండి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది.జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు.ఎయిడ్స్ వ్యాధి గ్రస్థుల సహాయర్థమై జిల్లాలో ఎయిడ్స్ నిర్ధారణ, కౌన్సిలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు.వ్యాధి అధికంగా ప్రబలే అవకాశం ఉన్న ప్రత్యేక వర్గాలను గుర్తించి ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధి గుర్తించిన బాధితులకు సత్వర చికిత్స అందించాలని తెలిపారు.జిల్లాలో ప్రసూతి మరణాల తగ్గింపులో కిందిస్థాయి సిబ్బంది మొదలుకొని అధికారులు చేపట్టిన చర్యలు అభినందనీయమని తెలిపారు.గతంలో ఉన్న ప్రసూతి మరణాల కేసులను అమ్మరక్షిత వంటి వినూత్న కార్యక్రమాల అమలుతో క్షేత్రస్థాయి సిబ్బంది చొరవతో ప్రసూతి మరణాలు గణనీయంగా తగ్గించగలిగినట్లు తెలిపారు.ముమ్మందు ప్రసూతి మరణాల రహిత జిల్లాగా నిర్మాణం తీర్చిదిద్దేలా మరింత పట్టుదలతో పనిచేయాలని తెలిపారు.ర్యాలీ సందర్భంగా కళాజాత బృందాలు డప్పు పాటలతో ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,డిఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్,డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక,డి సి హెచ్ఎస్ డాక్టర్ సురేష్,ఆర్ఎంఓడాక్టర్ రమేష్,డాక్టర్ విశ్వనాథ్,డాక్టర్ ప్రత్యూష,డీఈవో భోజన్న,ఆమాస్ మీడియా అధికారి భారే రవీందర్,డాప్యూ సూపర్వైజర్ అనిల్,ఐ సి టి సి కౌన్సిలర్లు,ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు, విద్యార్థులు,ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలి

- ప్రిన్సిపల్ జడ్జి నిర్మల గీతాంబా
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి




**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 1(జనంసాక్షి):** మానవ జీవన విధానంలో తప్పుడు పనులు చేయకుండా సక్రమమైన జీవనాన్ని అనుసరిస్తూ ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కాలేజ్ గేటు నుండి ఐఎంఏ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఐఎంఏ హాల్లో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ ప్రిన్సిపాల్ జడ్జి నిర్మల గీతాంబా , సెకండ్ అడిషనల్ జడ్జి/ డిస్టిక్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ శ్రీ సాయి కుమార్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించడం జరిగినది.ఐఎంఏ హాల్లో నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారదా వేదిక నలంకరించిన పెద్దలందరితో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పూర్వకాలంలో కుటుంబ వ్యవస్థ సమష్టిగా ఉండడం వలన ఆ కుటుంబంలోని సభ్యులు ఎలాంటి చెడు అలవాట్లకు గురికాకుండా చూసుకునేవారని తెలిపారు.ఆధునిక కాలంలో మానసిక ఒత్తిడికి గురి అవుతున్న వ్యక్తులు మత్తు పానీయాలకు డ్రగ్స్ కు అలవాటు పడి క్షనికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకొని ఎయిడ్స్ కు గురి అవుతున్నారని తెలిపారు. అందుకుగాను కుటుంబములోని పెద్దలు తప్పనిసరిగా వారి కుటుంబ సభ్యుల ప్రవర్తనను గమనించి వారిని సక్రమ మార్గంలో పెంచాలని, సమాజానికి హానికలుగకుండా బాధ్యత వహించాలని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజలలో అవగాహన కల్పించి వ్యాధి లక్షణాలు ఉన్నవారికి తగిన పరీక్షలు చికిత్సలు అందించి వారిని సమాజంలో మంచి పౌరులుగా జీవించడానికి అందరూ సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా ఎయిడ్స్ నియంత్రణ కొరకు ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉద్యోగస్తులకు ఎన్జీవో సంఘాల సభ్యులకు ప్రశంసా పత్రాలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలోజిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ హరి చందర్ రెడ్డి ఎంజీఎం సూపరింటెండెంట్, డాక్టర్ లక్ష్మీదేవి సి కె ఎం ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ సూర్య ప్రకాష్ సీనియర్ వైద్యాధికారి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ మోహన్ సింగ్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఉదయ్ రాజ్, డాక్టర్ వంశీకృష్ణ, ఐఎంఏ జనరల్ సెక్రెటరీ డాక్టర్ అజీజ్ అహ్మద్,పల్లె దావఖాన వైద్యాధికారులు, డిప్యూటీ డెమో, సిబ్బంది, వరంగల్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది డి పి ఎం సుధాకర్ డిఐఎస్ రామకృష్ణ ఎన్జీవోస్ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, వర్ద్ ట్రక్కర్స్, వర్ద్ మైగ్రేట్స్, ఆర్ డి ఎం ఎం, మారి వరంగల్, మారి టు ,కరుణమిత్ర పీపుల్స్ సొసైటీ, లింకు వర్కర్స్, వన్ స్టాప్ సెంటర్, ఎంజీఎం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, డిసెంబర్ 1 (జనం సాక్షి):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం సంగెం మండలం బాలు నాయక్ తండా గ్రామం నుండి బిఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు వాంకుడోత్ తిరుపతి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు బానోతు శ్రీను, బానోతు బాలు గారు పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని, పాత కొత్త తేడా లేకుండా అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. కష్టపడ్డ ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీలోకి చేరిన వారిలో బానోతు వీరు, బానోతు రాజు, బుజేందర్, వెంకటేష్, గోపి, బద్రు, మోహన్ దాదాపు 30 మంది కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.

# హెచ్ఐవీపై చైతన్యం చేయాలి

- జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పట్టాభి రామారావు డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య
- ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీ




**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 1 (జనంసాక్షి) :** ప్రజలలో హెచ్ఐవి పై నిరంతరంగా అవగాహన కల్పిస్తూ అపోహలను తొలగిస్తూ చైతన్యవంతులను చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హనుమకొండ ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి డాక్టర్ కె పట్టాభి రామారావు అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లాలో ప్రపంచ ఎయిడ్స్ దినం కార్యక్రమం లో భాగంగా ఉదయం భద్రకాళి ఆర్చి నుండి ఎన్నారై ఆడిటోరియం వరకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు , నర్సింగ్ విద్యార్థులచే నిర్వహించిన అవగాహన ర్యాలీని డిఎంహెచ్వో డాక్టర్ ఏ అప్పయ్య తో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కాకతీయ మెడికల్ కాలేజ్ ఎన్నారై ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశానికి ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి డాక్టర్ కె పట్టాభి రామారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1988 నుండి కొంతకాలం హెచ్ఐవి గురించి మాట్లాడాలంటే భయపడే సమయంలో, హెచ్ఐవికి మందు లేదని ,మానసికంగా కుంగుబాటు వల్ల తొందరగా చనిపోయేటువంటి ఆ దశలో నివారణ మాత్రమే దీనికి మందు అనే లక్ష్యంతో "నిశ్శబ్దాన్ని చేదిద్దాం "అనే నినాదంతో ఒక యుద్ధంలా అందరూ శ్రమించడం జరిగిందని అందువల్ల ఆ రోజు గుసగుసలాడే దశ నుండి నేడు ఒకరితో ఒకరు చర్చించుకోవడం, చికిత్సకు ముందుకు రావడం, ఒకవేళ పాజిటివ్ అయితే చికిత్స తీసుకోవడం, సమాజంలో హెచ్ఐవి పాజిటివ్ ఉన్న వారి పట్ల స్టిగ్మా తగ్గే దశకు చేరడంజరిగిందని అన్నారు, డీ ఎం హెచ్ ఓ డాక్టర్ ఏ అప్పయ్య మాట్లాడుతూ అవగాహన కలిగిస్తూనే తొందరగా వ్యాధిని గుర్తించడం , చికిత్సను అందించి పూర్తిగా కొనసాగించడం, వారిని సమానంగా ఆదరించడం అందరి బాధ్యత అన్నారు. అనంతరంఎంజీఎం ఆస్పత్రి సూపర్ ఇంటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్ర రెడ్డి, జిఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ చంద్ర , టీబీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి వివిధ అంశాలపై ప్రసంగించడం జరిగిందిఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్,డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి, కేఎంసివైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ చంద్ర, జిఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, టీబీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి, అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ టి మదన్ మోహన్ రావు , తదితరులు వైద్యులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 1 (జనంసాక్షి) :** ధర్మసాగర్ క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు.నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను కలెక్టర్ పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ధర్మసాగర్, రాపాకపల్లి గ్రామాలకు సంబంధించి సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లను స్వీకరిస్తున్న కౌంటర్లను కలెక్టర్ పరిశీలించి ఇప్పటివరకు ఎన్ని నామినేషన్లు వచ్చాయని, నిన్న ఆదివారం రోజున సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు వచ్చాయని రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎలక్షన్ నోటీసు, ఎలక్టోరల్, రిజర్వేషన్ల జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయంలో పెట్టారా అని ఎంపీడీవో అనిల్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అతికించిన ఎలక్షన్ నోటీసు, ఎలక్టోరల్ రోల్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవో అనిల్ కుమార్ లతో కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు స్థానాలకు వచ్చిన నామినేషన్లకు విడివిడిగా ఫైళ్ళను పెట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, స్థానిక తహసిల్దార్ సదానందం, ఎంపీవో సయ్యద్ అఫ్జల్ , రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోపు శరవేగంగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి-తాడ్వాయి, డిసెంబర్ 01(జనంసాక్షి) :** శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులు నిర్ణీత గడువు లోపు శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్, ఆర్డీవో వెంకటేష్ తో కలసి శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ విఐపి, వివిఐపి పార్కింగ్ స్థలాలను రహదారులను, గద్దెల ప్రాంగణ అభివృద్ధి పనులు, రెడ్డిగూడెం అంతర్గత రహదారులను వాటి పనుల పురోగతిని ఆర్డీవో వెంకటేష్ ను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోపు పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

- అడిషనల్ సివిల్ జూనియర్ జడ్జి అఖిల



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దామని భూపాలపల్లి అడిషనల్ సివిల్ జూనియర్ జడ్జి జి అఖిల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చల్లా మధుసూదన్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జడ్జి అఖిల, డిఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అడిషనల్ సివిల్ జూనియర్ జడ్జి అఖిల మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ రోగులకు ఎఆర్టి మందులతో పాటు వారి జీవన విధానంలో మార్పు తీసుకొని రావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చల్ల మధుసూదన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ సెంటర్లతో పాటు గ్రామాల్లో కూడా హెచ్ఐవి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. గర్భిణీలకు అన్ని రకాల రక్త పరీక్షల ప్రొఫైల్ నిర్వహించడం జరుగుతుందని వివరించారు. త్వరలో భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐసీటీసీ, ఏఆర్టి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జిల్లా డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ కె.శ్రీదేవి మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను విస్తృతంగా నిర్వహించడానికి ప్రణాళిక బద్ధంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మాత శిశు సంరక్షణ కోసం, గర్భిణి హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రసవాలు చేపడుతున్నామని వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. పులి రాజాకు ఎయిడ్స్ అనే నినాదం గతంలో ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధి నివారణకు విస్తృతంగా ప్రచారం చేపట్టినట్లు వివరించారు. ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ కార్యక్రమాలతో పాటు అన్ని సబ్ సెంటర్లలో కూడా అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్ష లతోపాటు హెచ్ఐవి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని నివేదిక ద్వారా తెలియజేశారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, దిశ డీఎండిఓ సాయికుమార్, ఐసిటిసి కౌన్సిలర్ గాదె రమేష్, మారి స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ సదానందం, ట్రాన్స్ జెండర్ జిల్లా టీం లీడర్ గౌరీ, జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ముళ్ల పొదలతో మూసుకుపోతున్న రహదారి

**మల్హర్,డిసెంబర్ 01(జనం సాక్షి) :** మండల కేంద్రమైన తాడిచెర్ల లోని పెద్దమ్మ గుడి నుండి బిసి కాలనీ వరకు ఉన్న ప్రధాన రహదారి పై ఇరువైపుల తుమ్మలు ఏపుగా పెరిగి రహదారి ముసుకుపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ రహదారి గుండా నిత్యం ఏఎమ్మార్ కంపెనీ లో పని చేసే కార్మికులతో పాటు తోల్లపాయ, కరకల్ల సదరు, కాపురం శివారు రైతులు సైతం తమ పంట పొలాలకు ఈ రహదారి నుండే వెళ్తారు. ఇరువైపులా రోడ్డు కు అడ్డంగా తుమ్మలు పెరిగి వాహనదారులు, రైతుల ఎడ్లబండ్లు వెళ్లక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పలువురు రైతులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు. రైతులు, ఏఎమ్మార్ కార్మికుల శ్రేయస్సు కోసం రోడ్డుకు ఇరువైపుల ఉన్న తుమ్మ చెట్లు తొలగించేందుకు సంబందిత అధికారులతో పాటు ఏఎమ్మార్, అధికారులు సైతం చొరవ చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, డిసెంబర్ 1, (జనంసాక్షి) :** పంచాయతీ ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, నోడల్ అధికారి శంకర్ లతో కలిసి 1వ విడత, 3వ విడత స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బ్యాలెట్ నిర్వహణ, పోలింగ్, కౌంటింగ్ అంశాలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ అనంతరం పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలు, ఏర్పాట్ల పరిశీలన, బ్యాలెట్ పేపర్ల నిర్వహణ, పోలింగ్ రోజున అవసరమైన ఏర్పాట్లు, కౌంటింగ్ కేంద్రాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ, అధికారులు, సిబ్బందికి ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థుల ఎంపిక, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, పోలింగ్, కౌంటింగ్ సమయంలో పాటించవలసిన నియమాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ అనంతరం స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారుల బాధ్యత ఉంటుందని, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ సమయంలో ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అనుమానాలు, అపోహలు ఉన్నా శిక్షణ సమయంలో నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు హరి ప్రసాద్, మధు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పులి కదలికలపై అధికారుల డప్పు చాటింపు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 1 (జనం సాక్షి) :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం కృష్ణ పల్లి గ్రామ అటవీ పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తుంది. ఈ మేరకు సోమవారం అటవీశాఖ అధికారులు సమీప గ్రామాల్లో డప్పు చాటింపు చేయించారు. ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పూర్తి చేసుకొని తిరిగి ఇళ్లకు చేరుకోవాలని అధికారులు డప్పు చాటింపు చేయించారు. పశువుల కాపర్లు అడవుల్లోకి వెళ్లాలని సూచించారు. పు లుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా వేసి ఉంచుతున్నట్లు తెలిపారు. పులులకు ఎవరు ఎలాంటి హాని కలిగించరని ప్రజలకు విన్నవించారు.

# ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించాలి

**● కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికలలో రిటర్నింగ్ ఆఫీసర్లు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ఫేస్ టూ రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని రిటర్నింగ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు రిటర్నింగ్ ఆఫీసర్ కు పూర్తి బాధ్యత ఉంటుందని అన్నారు.అభ్యర్థి రోజు వారి ఎన్నికల ఖర్చు వివరాలను తనిఖీ చేయడం, వివరాలు ఇవ్వడంలో విఫలమైతే వారికి నోటీసులు జారీ చేసే అధికారం ఉంటుందన్నారు. మండల కేంద్రం నుండి పోలింగ్ మెటీరియల్ సర్పంచ్, వార్డుల పోలింగ్ కేంద్రానికి, పిఓకి అందజేయాలని అన్నారు.సంబంధించిన గ్రామపంచాయతీలో పోలింగ్ స్టేషన్ ఏర్పాట్లు, ఇతర పోలింగ్ ఏర్పాట్లు పరిశీలించాలని తెలిపారు.ఓటర్లకు బిఎల్ఓ ద్వారా ఫోటో ఓటర్ స్లిప్స్ పంపిణీ చేయాలని పేర్కొన్నారు.పోలింగ్ సిబ్బందిని పోలింగ్ స్టేషన్ కు పంపించడం సామాగ్రి సరఫరా, పోలింగ్ సమర్థవంతంగా పర్యవేక్షించడం, పై అధికారులకు నివేదికలు పంపించాలని తెలిపారు.పోలింగ్ జరిగేటప్పుడు ఏదైనా అనుకోని సమస్య ఎదురైతే వాటిని పరిష్కరించాలని అన్నారు. కౌంటింగ్ ప్రదేశం, పోలీస్ సిబ్బంది, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు, ఫలితాలు ప్రకటించుట, ఉప సర్పంచ్ ఎన్నిక, ధ్రువపత్రాల పంపిణీ, వ్యయాన్ని పర్యవేక్షించటం, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ సంబంధిత విధులు రిటర్నింగ్ ఆఫీసర్లు సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. పూర్తిగా చెక్ లిస్ట్ ప్రకారం బాధ్యతలు నిర్వహించాలని, ఎలాంటి పొరపాటు జరిగినచో ఎన్నికలపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని కోల్పోవడం జరుగుతుందని అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా, బాధ్యతయుతంగా ఎన్నికల విధులు నిర్వహించి సూర్యాపేట జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయడం అందరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్డిఏ పిడి వివి.అప్పారావు, డీఎఫ్ఓ సతీష్, ట్రైనర్లు రమేష్, వెంకటేశ్వర్లు,రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ కెనాల్ వద్ద కరెంట్ షాక్ తగిలి కార్మికుడి మృతి



**అశ్వారావుపేట, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పరిధిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలువలో రాళ్లు తొలగించే పనిలో నిమగ్నమై ఉన్న కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. సీతారామ ప్రాజెక్ట్ సూపర్వైజర్ ఇందుకూరి కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం, నాగుపల్లి గ్రామ సమీపంలోని కాలువలో డ్రిల్లింగ్ మెషిన్ సహాయంతో రాళ్ల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో డ్రిల్లింగ్ మెషిన్ పనిచేసే సమయంలో అనుకోకుండా పైన వెళ్లే 11 కేవీ విద్యుత్ సరఫరా లైన్‌ను తాకింది. దాంతో మెషిన్‌కు విద్యుత్ ప్రవాహం చేరి, పని చేస్తున్న కార్మికుడు తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే క్షణాల్లోనే ప్రాణాలు విడిచాడు. మరణించిన వ్యక్తిని రామ్‌సింగ్ గోండ్ (25) గా గుర్తించారు. ఇతను మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని షహడాల్ జిల్లా, జహాసింగ్నగర్ పరిధిలోని కుసరియాటోలా గ్రామానికి చెందినవాడు. వృత్తిరీత్యా డ్రిల్లింగ్ మెషిన్ ఆపరేటర్‌గా పని చేస్తూ ప్రాజెక్ట్‌లో కూలీగా చేరాడు. రాళ్ల తొలగింపు కోసం డ్రిల్లింగ్ చేస్తుండగా ఈ విషాదం జరిగింది. రామ్‌సింగ్ మరణ వార్త తెలుసుకున్న సహచర కార్మికులు, ప్రాజెక్ట్ సిబ్బంది తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రాజెక్ట్ ప్రాంతంలో కొంతసేపు ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విద్యుత్ వైర్ల భద్రత, ప్రాజెక్ట్ ప్రాంతంలో అప్రమత్త చర్యలు, కార్మికుల రక్షణ పరికరాల కొరత వంటి అంశాలపై కూడా పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. పనిచేసే స్థలం వద్ద సరైన భద్రతా చర్యలు లేకపోవడం ఈ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అకస్మాత్తుగా జరిగిన ఈ ప్రమాద ఘటనతో కుటుంబ సభ్యులు, సహచరులు శోకసంద్రంలో మునిగిపోయారు. రామ్‌సింగ్ గోండ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆపై మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు స్థానిక పోలీస్ అధికారులు తెలిపారు.


# మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు గానుగ ప్రారంభించిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 2025-26 సీజన్ చెరకు గానుగ సోమవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు, కర్మాగార వ్యవస్థాపకులు నామ నాగేశ్వరరావు, చిన్నమ్మ దంపతులు ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని చెరకు గానుగ ప్రారంభించారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ కర్మాగారం కొన్నప్పటి నుండి ఆర్థికంగా భారీ నష్టాలు వస్తున్నప్పటికీ ఒక రైతు బిడ్డగా రైతుల కష్టాలు తెలిసిన వాడిగా రైతన్నలకు అండగా ఉంటూ రైతు శ్రేయస్సు దృష్ట్యా కర్మాగారాన్ని నడిపిస్తున్నాము అని తెలిపారు. దేశంలోనే తొలి సారిగా రైతు సోదరుల కోరిక మేరకు టన్ను చెరుకు సరఫరా చేసిన రైతులకు అరకిలో పంచదార 2026-27 గానుగ సీజన్లో ఉచితంగా ఇస్తామని నామ ప్రకటించారు. రైతు సోదరులందరూ చెరకు విరివిగా సాగు చేసి కర్మాగారం అభివృద్ధికి తోడ్పడటంతో పాటు రైతు సోదరులు అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నామన్నారు. రైతులు అభివృద్ధి తనకు ముఖ్యమని, రైతులతోనే కర్మాగారం ముందుకు సాగుతుందని నామ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఏ చెక్కర కర్మాగారం ఇవ్వని విధంగా టన్నుకు అత్యధిక మద్దతు ధర ఇవ్వడంతో పాటు, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీకి కంటే మధుకాన్ చెక్కర కర్మాగారం అధిక సబ్సిడీ ఇవ్వడం విశేషంగా చెప్పుకోవచ్చు. దేశీయంగా అనేక రాష్ట్రాల్లో చెక్కర పరిశ్రమలు మూతబడుతున్నప్పటికీ తెలంగాణ బిడ్డగా చెరకు రైతుల సంక్షేమం కొరకు కర్మాగారాన్ని నడిపిస్తూ కృషి చేస్తున్న నామను రైతన్నలు పెద్ద ఎత్తున అభినందించారు.ఈ కార్యక్రమం కెన్ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్ రావు, ఏవిపి వై. కోటయ్య, డీజీఎం కేన్ అప్పారావు, ఏజీఎం హెచ్ఆర్ నరేష్, విభాగాధిపతులు, ఫ్యాక్టరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## బంగారిగడ్డ, చొప్పరి వారి గూడెం గ్రామపంచాయతీల సర్పంచులు ఏకగ్రీవం





**చండూరు, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** చండూరు మండలం బంగారిగడ్డ గ్రామ సర్పంచ్ గా మహమ్మద్ సమీనా ఖాసీం ను,చొప్పరి వారి గూడెం గ్రామ సర్పంచ్ గా జాల వెంకన్న ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వివరాల్లోకి వెళ్తే నల్గొండ జిల్లాలోని బంగారిగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి 11 మంది అభ్యర్థు లు 16 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, ఎన్నికల కంటే గ్రామాభివృద్ధే ముఖ్యమని భావించిన గ్రామస్థులు సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేయాలని నిర్ణయించారు. దీనిపై చర్చించేందుకు గ్రామస్థులంతా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా, ముగ్గురు అభ్యర్థులు గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి, ఇతర పనులకు తాము నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. దీంతో గ్రామ పెద్దలు వారి మధ్య వేలం నిర్వహించారు. ఈ వేలంలో మహమ్మద్ సమీనా ఖాసీం అనే అభ్యర్థి గ్రామాభివృద్ధికి రూ.73 లక్షలు ఇస్తానని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆమె ఆఫర్‌కు మిగిలిన అభ్యర్థులందరూ అంగీక రించి, తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటామని ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు.దీంతో బంగారిగడ్డ సర్పంచ్ స్థానం ఏకగ్రీవం అయింది. అదేవిధంగా చొప్పరి వారి గూడెం గ్రామ సర్పంచి గా జాల వెంకన్న ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన సంతోషించి గ్రామాభివృద్ధికి తనవంతుగా రూ:18.16 లక్షలు కేటాయిస్తానని తెలిపారు.దీనిపై ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.

## రామన్నపేట క్లస్టర్‌ను పరిశీలించిన ఆర్డీవో



**రామన్నపేట, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** పట్టణ కేంద్రంలో రామన్నపేట క్లస్టర్ లో గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను ఆర్డీవో శేఖర్ రెడ్డి పరిశీలించారు. సర్పంచ్, వార్డ్ సభ్యుల స్థానాలకు నామినేషన్ దాఖలవుతున్న తీరును ఆయన పరిశీలించి, అనుసరిస్తున్న ప్రక్రియను రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట తహసిల్దార్ లాల్ బహుదూర్ ఉన్నారు.

## ఉపాధిహామీ పథకంలో పనితీరు మెరుగు



**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** మండలంలో ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జి. సురేష్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సుమారు రూ. 4 కోట్ల విలువైన పనులపై సోషల్ ఆడిట్ బృందాలు గత పది రోజులుగా గ్రామస్థాయిలో తనిఖీలు నిర్వహించాయి. ఇందులో రూ. 2.50 కోట్లు వేతనాలు, రూ. 1.50 కోట్లు మెటీరియల్ ఖర్చులు రికార్డులకు అనుగుణంగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఈ నివేదికను ప్రజావేదికలో అధికారులు, సిబ్బంది, గ్రామస్థుల సమక్షంలో చర్చించారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారి జి. సురేష్ మాట్లాడుతూ పనులు మరియు ఖర్చుల విషయంలో ఎలాంటి తేడాలు లేకపోవడం సిబ్బంది నిబద్ధతకు నిదర్శనమని అభినందించారు. గత ఆడిట్‌తో పోలిస్తే ఈసారి పనితీరు మెరుగైందని తెలిపారు. ఇకముందు కూడా పథకాన్ని పారదర్శకతతో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్. భాస్కర్, ఏపీవో పి.వి.జి. కృష్ణమూర్తి, అంబుడ్స్మన్ వీరమల్లు, అసిస్టెంట్ మేనేజర్ ఆదిత్య వర్ధన్, సీనియర్ క్యూసి ఫసియుద్దీన్, సోషల్ ఆడిట్ ఎస్టీఎం అంజా గౌడ్, ఎస్ఆర్పీ నర్సయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు సి.హెచ్. కృష్ణయ్య, ఇమ్మడి మాధవి, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు మరియు సోషల్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికలపై అవగాహన



**హాలియా, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర్ రాజు, హాలియా సీఐ డి. సతీష్ రెడ్డి, ఎస్ఐ బి. సాయి ప్రశాంత్, హాలియా పోలీసు స్టేషన్ సిబ్బంది పులిమామిడి గ్రామంలోని జడ్పీ హెచ్ ఎస్ పులిమామిడి ప్రాంగణంలో సోమవారం గ్రామ పంచాయతీ ఎన్నికల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరగాలని గ్రామస్థులకు సూచించారు. ఓటు పవిత్రమైన ప్రజాస్వామ్య హక్కు అని, ఎలాంటి బెదిరింపులు, హింస, డబ్బు లేదా మద్యం ప్రలోభాలు చూపడం నేరమని వివరించారు. ఎన్నికల సందర్భంగా చట్ట-వ్యవస్థకు భంగం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, కుల-మత విభేదాలు రెచ్చగొట్టే ప్రచారం చేయరాదని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు పోలీసులకు సహకరించి శాంతియుత ఎన్నికల నిర్వహణకు ముందుకు రావాలని అధికారులు కోరారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**దేవరకొండ, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** ఈ నెల 6న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా, దేవరకొండ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనే నిమిత్తం దేవరకొండకు వస్తున్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ లు సోమవారం పరిశీలించారు.ముందుగా జిల్లా కలెక్టర్ ఆర్ డి ఓ కార్యాలయంలో అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న పనులు, హెలిపాడ్, బహిరంగ సభ, తదితర అంశాలపై ఆమె చర్చించారు. అనంతరం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంకెఆర్ కాలేజ్ పరిసరాలు, అలాగే ముదిగొండ రోడ్ లో హెలిప్యాడ్, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు,పబ్లిక్ మీటింగ్ స్థలాలను పరిశీలించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అదనపు ఎస్ పి వెంకటేశ్వర్లు, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, డి ఎస్ పి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బి ఈఈ శ్రీధర్ రెడ్డి ,ట్రాన్స్కో ,జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, తదితర శాఖల అధికారులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోచంపల్లి మండలం పిలాయిపల్లి క్లస్టర్‌లో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సోమవారం పరిశీలించారు. క్లస్టర్ పరిధిలో గల 2 గ్రామాల్లో జరుగుతున్న ఏర్పాట్లను ఆరా తీశారు. ఇప్పటి వరకు మొత్తం 7 సర్పంచ్, 26 వార్డు మెంబెర్ నామినేషన్లు స్వీకరించామని క్లస్టర్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రతి గ్రామంలో నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన తర్వాత కొత్తగా తెరవాల్సిన బ్యాంకు ఖాతాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ముందుగానే లీడ్ బ్యాంకు అధికారులను అప్రమత్తం చేసామని, అవసరమైన చోట అదనపు కౌంటర్లు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు అతిక్రమించొద్దు



**పెన్‌పహాడ్, డిసెంబర్ 1 (జనం సాక్షి) :** ఎన్నికల నిబంధనలను ఓటర్లు తప్పక పాటించాలని ఎస్పీ నరసింహ అన్నారు.రెండో విడతలో ఎన్నికలు జరగనున్న పెనపహాడ్ మండల పరిధిలో నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్నది.సోమవారం ఎస్పీ నరసింహ మండల కేంద్రంలో,గాజుల మల్కాపురం,చీదేళ్ళ గ్రామాలలో ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద నామినేషన్ల ప్రక్రియను, పోలీసు బందోబస్తు పరిశీలించారు.అనంతరం గ్రామ ప్రజలతో, ఎన్నికలలో నామినేషన్ వేసిన అభ్యర్థులతో మాట్లాడి ఎన్నికల నియమావళి పట్ల, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళి సందర్భంగా సమస్యాత్మక గ్రామాలను సందర్శించి ప్రజలకు ఎన్నికల నియమావళి గురించి వివరిస్తున్నామని, ప్రతి ఒక్కరు ఎన్నికల నియమాలికి లోబడి నడుచుకోవాలని కోరారు. గ్రామంలో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని పోలీస్ సిబ్బందికి,ఎన్నికల నిర్వహణ సిబ్బందికి సహకరించాలని కోరారు.సమస్యలు సృష్టించకుండా ఉండడానికి సత్ప్రవర్తనతో ఉండడానికి గాను గుర్తించిన వ్యక్తులను బైండోవర్ చేస్తున్నామని అన్నారు.బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే అలాంటి వారిపై పూచికత్తూ నగదును రెండు లక్షల నుండి ఐదు లక్షల వరకు కట్టించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా వారి ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.ఎన్నికలలో నిలబడుతున్న అభ్యర్థులు ప్రజల మనసుని చురగొనాలని ఎట్టి పరిస్థితుల్లో ప్రలోభాలకు గురి చేయవద్దని డబ్బు, మద్యం,ఇతర బహుమతులు అంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు.బరిలో నిలబడేది సొంత గ్రామం వారే కాబట్టి అందరూ కలిసిమెలిసి ఉండాలని వ్యక్తిగత విమర్శలు చేసుకోవద్దని సూచించారు. ఎన్నికల రోజు ముందు 44 గంటల నిబంధనలు అమలులో ఉంటాయని ఈ సమయంలో ప్రచారం నిర్వహించవద్దని, ప్రజలు గుంపులుగా చేరవద్దని కోరారు.ఎస్పీ వెంట డిఎస్పి ప్రసన్నకుమార్,సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు,స్థానిక ఎస్సై గోపికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

**● కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు, ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. సోమవారం మోతె గ్రామ పంచాయతీ,రాఘవ పురం, చివ్వెంల మండలం బండమీది చందుపట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పర్యవేక్షించి ఆర్ఓలకు పలు సూచనలు చేశారు.ప్రస్తుతం జిల్లాలోని 8 మండలాల్లో రెండో విడత కింద 181గ్రామ సర్పంచ్,1628 వార్డ్ సభ్యులకు 49 నామినేషన్ కేంద్రాలలో నామినేషన్ స్వీకరించటం జరుగుతుందని తెలిపారు.నేడు రెండో విడత నామినేషన్లకు చివరి రోజు అని, ఆలస్యంగా రాకుండా ముందుగా నామినేషన్ వేసుకోవటానికి అభ్యర్థులు ప్రయత్నించాలని అన్నారు. సాయంత్రం 5 లోపు నామినేషన్ కేంద్రంలో ఉన్న వారికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు టోకెన్స్ ఇచ్చి నామినేషన్లు స్వీకరించటం జరుగుతుందని తెలిపారు.పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాలని, ఒకవేళ కొత్త బ్యాంకు అకౌంట్ లేకపోయిన నామినేషన్ వేసి స్క్రూట్ ని లోపు బ్యాంకు అకౌంట్ వివరాలు సమర్పించాలని సూచించారు.మూడవ విడతలో నామినేషన్ వేయాలనుకునే వారు ముందుగానే నూతన బ్యాంకు అకౌంట్ తీసుకోవటానికి ప్రయత్నిస్తే నామినేషన్ ప్రక్రియ సులభంగా పూర్తి అవుతుందని అన్నారు.మొదటి విడత కింద స్వీకరించిన నామినేషన్ల స్క్రూట్ని పూర్తి అయిందని, స్క్రూట్ని లో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓకు అప్పీల్ చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకన్న, చంద్రశేఖర్, ఎంపిడిఓలు ఆంజనేయులు, సంతోష్ కుమార్, ఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.




**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 6.30 | వరంగల్ ₹ 6.32

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్
₹ 1,19,000 (22 క్యారెట్లు) | ₹ 1,29,820 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,92,000

## నోటీసులా... నోటీసులే..!

రోజూ ఇన్‌కంట్యాక్స్ వారి వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ పర్సనల్ అకౌంటులో లాగిన్ అయ్యి మీ వివరాలు చూసుకోవడం అలవాటు చేసుకోండి. మీ ఆడిటర్ నుంచి మీ లాగిన్ వివరాలు తీసుకోండి.ప్రతిసారి ఆడిటర్స్ దగ్గరకు పరిగెత్తకుండా మీరే లాగిన్ అవ్వొచ్చు. నోటీసు/సమాచారం ఇన్‌కమ్ ట్యాక్స్ సైట్‌లో లాగిన్ అయ్యి ... డాష్ బోర్డులోని పెండింగ్ యాక్షన్స్‌లో ఈ–ప్రొసీడింగ్స్‌ని క్లిక్ చేయండి. అందులో నోటీసులు ఉంటాయి. ఆ నోటీసుని చూడండి. దానిలో నోటీసులు ఉంటే డౌన్‌లోడ్ చేసుకోండి. అప్పుడు నోటీసులో ఏముందో అర్థమవుతుంది.నోటీసులెన్నో రకాలు, మరెన్నో అంశాలు డిఫెక్టివ్ నోటీసు అంటారు. బదులుగా సకాలంలో దీన్ని సర్దుబాటు చేసుకోవచ్చు. అలా సర్దుబాటు చేస్తే సరిపోతుంది. 143 (1) ప్రకారం ఒక స్టేట్‌మెంట్ పంపిస్తారు. ఆదాయంలో కానీ పన్ను భారం లెక్కింపులో కానీ వ్యత్యాసాలుంటే తెలియజేస్తారు. ఆదా యం 'కాలమ్' మీరు వేసింది. అధికారి అస్సె స్ చేసింది పక్కపక్కనే ఉంటాయి. ఒకదానితో మరొకదాన్ని పోల్చి చూసుకొండి.

# స్టాక్ మార్కెట్లు ఫ్లాట్..



**న్యూఢిల్లీ:**దేశీయస్టాక్ మార్కెట్లు సోమవారంఫ్లాట్ గా ముగి శాయి. ఉదయం రికార్డు గరిష్టాలను తాకిన స్టాక్సు చీలుతర్వాతస్వల్పనష్టాలతో ఫ్లాట్గాస్థిర పడ్డాయి. ఫారిన్ ఇన్ ఫ్లోలు మందగించడం , కీలక వాణిజ్య చర్చలపై దీర్ఘకాల అనిశ్చితి మధ్య రూపాయి కొత్త రికార్డు కనిష్టానికి పడిపోయింది . ఇది ఇన్వెస్టర్ల సెంటిమెంట్ ను తగ్గించింది .ముగింపు సమయానికిబీఎస్ఈ సెన్సెక్స్ 64.77 పాయింట్లు లేదా 0.08 శాతం నష్టపోయి 85,641.9 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 27.2 పాయింట్లు లేదా 0.1 శాతం నష్టపోయి 26,175.75 వద్ద ఉన్నాయి. ప్రారంభ డీల్స్ సెన్సెక్స్ 86,159 వద్ద రికార్డు స్థాయిని తాకగా, నిఫ్టీ 26,325.8 వద్ద రికార్డు స్థాయిని తాకింది.విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్ గా ముగియగానిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.25 శాతం పెరిగింది.రంగాల సూచీలలో నిఫ్టీ రియల్టీ 1 శాతానికి పైగా పడిపోగాహెల్త్కేర్, ఫార్మా, బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ, మీడియా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్సులను సరిం చాయి. దీనికి విరుద్ధంగా, నిఫ్టీ ఆటో, మెటల్, ఐటీ సూచీలుగ్రీన్లో స్థిరప డ్డాయి.సెన్సెక్స్లో బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, ట్రెంట్, మహీంద్రా అండ్ మ హీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారతీ ఎయిర్టెల్ టాప్ లూజర్లా ఉన్నాయి. టాటా పీవీ, మారుతి భారత్ ఎలక్ట్రానిక్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్సీఎల్ టెక్ టాప్ గెయినర్లుగా నిలిచాయి.

# పెట్టుబడితోనే వృద్ధి



**న్యూఢిల్లీ:** ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రాబడిని సమకూర్చుకోవాలని భావించే వారు.. తమ పోర్ట్‌ఫోలియో కోసం స్మాల్‌క్యాప్ ఫండ్స్‌ను తప్పకుండా పరిశీలించాలి. ఈక్విటీల్లో అత్యధిక రిస్క్ ఉండేది ఈ విభాగంలోనే. అదే సమయంలో అధిక రాబడులు కూడా ఇక్కడే సాధ్యం. కనుక దీర్ఘకాల లక్ష్యాల కోసం తమ మొత్తం పెట్టుబడుల్లో 20 శాతం వరకు స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయించుకోవచ్చు. ఈ విభాగంలో మంచి రాబడులను అందిస్తున్న పథకాల్లో ఎస్‌బీఐ స్మాల్‌క్యాప్ ఫండ్ కూడా ఒకటి.గత ఐదేళ్ల కాలంలో ఎస్‌బీఐ స్మాల్‌క్యాప్ ఫండ్ పెట్టుబడిపై 285 శాతం రాబడిని అందించింది. ఈ కాలంలో నిఫ్టీ 50 రాబడి 164%. అంటే వార్షిక కాంపౌండెడ్ రాబడి 28.44 శాతం. గత ఏడాది కాలంలో రాబడి ఒక శాతంగా ఉంది. గత ఏడాది కాలంగా మార్కెట్లు దిద్దుబాటు దశలో ఉండడం తెలిసిందే. ఇక మూడేళ్ల కాలంలో వార్షిక రాబడి 15 శాతం వరకు ఉండడాన్ని గమనించొచ్చు.ఈ పథకం ఆరంభం నుంచి ఇప్పటి వరకు పనితీరును గమనిస్తే వార్షిక రాబడి 19.35 శాతం చొప్పున ఉంది. రాబడుల్లో స్థిరత్వాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఇక ఈ పథకంలో సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసినట్టయితే ఏడాది కాలంలో సిప్ పెట్టుబడులపై 6.88 శాతం నష్టాలు కనిపిస్తున్నాయి. మూడేళ్ల కాలాన్ని పరిశీలిస్తే వార్షిక రాబడి 18.49 శాతం చొప్పున ఉంది. ఐదేళ్ల కాలంలో అయితే వార్షిక రాబడి ఏకంగా 55.78 శాతంగా ఉండడం గమనించొచ్చు. ఇక 10 ఏళ్లలో సిప్ రాబడి 164% ఉంది. కనుక సిప్ ప్లాన్ రూపంలో పెట్టుబడులతో రిస్కును అధిగమించడంతోపాటు.. మెరుగైన రాబడుల ను సమకూర్చుకోవచ్చని డేటా తెలియజేస్తోంది.దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు సంపద సమకూర్చడం ఈ పథకం పెట్టుబడుల విధానంలో భాగం. చిన్న కంపెనీలు ఆర్థిక సంక్షోభ సమయాల్లో పెద్ద కంపెనీలతో పోల్చి చూస్తే కుదేలవుతుంటాయి. కనుక ఆ సమయంలో స్మాల్‌క్యాప్ పెట్టుబడుల విలువ పడిపోతుంటుంది. ఆందోళన చెందకుండా, స్థిరంగా ఆ పెట్టుబడిని తిరిగి గణనీయంగా వృద్ధి చెందే వరకు వేచి చూడగలిగే వారికే స్మాల్‌క్యాప్ పెట్టుబడులు అనుకూలం.పోర్ట్‌ఫోలియో: ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం 36,945 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 93.27 శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 2.57 శాతం పెట్టుబడులు డెట్ సాధనాల్లో ఉన్నాయి. 4.16 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడులను పరిశీలించగా, 36.34 శాతం మేర స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయగా, మిగిలిన మొత్తం మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఉన్నట్టు తెలుస్తోంది. పేరుకు స్మాల్‌క్యాప్ ఫండ్ అయినప్పటికీ.. మిడ్‌క్యాప్‌లో ఎక్స్‌పోజర్ ఎక్కువగా ఉంది. దీనికి కారణం స్వల్పకాలంలో రాబడుల అవకాశాల తోపాటు.. ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేసిన తర్వాతి కాలంలో కొన్ని కంపెనీలు వృద్ధితో మధ్యస్థ కంపెనీలుగా అవతరించినట్టు తెలుస్తోంది. ఈక్విటీల్లో అత్యధికంగా 26.55 శాతం ఇండ్రస్టియల్స్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. కన్స్యూమర్ కంపెనీలకు 20.56 శాతం, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 15.9 శాతం చొప్పున కేటాయింపులు చేసింది.

### జెన్ జెడ్ ఇన్వెస్టర్లకు

# బీమా.. డైలమా



**న్యూఢిల్లీ:**పూర్తిగా డిజిటల్ శకంలో పెరుగుతున్న జెన్ జెడ్ తొలి తరం ఇన్వెస్టర్లు.. డబ్బు, లైఫ్‌స్టయిల్, విశ్వసనీయతకు సంబంధించిన అభిప్రాయాలను తిరగరాస్తున్నారు.వారు ఆర్థిక విషయాల్లో జాగ్రత్తగా ఉంటున్నారు. ఎంచుకునే ప్రతి దాన్నుంచి గరిష్ట విలువను పొందడంపై దృష్టి పెడుతున్నారు. తాము ఉపయోగించే ప్రతి ప్రొడక్టు, సర్వీసు సరళంగా, వేగవంతంగా ఉండాలని కోరుకుంటున్నారు. దీనితో వారికి అనుగుణమైన ప్రోడక్టులను అందించే విషయంలో ఈ పరిణామం, బీమా సంస్థలకు ఒక పెద్ద డైలమాగా మారింది. వారి వాస్తవ అవసరాలు, అందుబాటులో ఉన్న సాధనాల మధ్య అంతరాలను భర్తీ చేసేలా కొత్త సొల్యూషన్స్‌ని కనుగొనాల్సిన పరిస్థితి నెలకొంది.జెన్ జెడ్ తరం వారు ఆర్థిక ప్రణాళికలపై ఆసక్తిగానే ఉన్నప్పటికీ బీమాను ఇంకా పూర్తి స్థాయిలో పరిశీలించడం లేదు. ఇటీవలి హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో నివేదిక ప్రకారం 61 శాతం యువత హెల్త్ ఇన్సూరెన్స్‌పై ఆసక్తి చూపగా, 37 శాతం మంది క్యాష్‌లెస్ హాస్పిటల్ నెట్‌వర్క్ లభ్యతకు ప్రాధాన్యమిచ్చారు. బీమాకు ప్రాధాన్యమిస్తున్నప్పటికీ కేవలం సంప్రదాయ ఫీచర్లకే పరిమితం కాకుండా సౌకర్యం, తమకు ఎంత వరకు ఉపయోగకరంగా ఉంటుందనే కోణాల్లో కూడా ఇన్సూరెన్స్‌ని చూస్తున్నారని దీని ద్వారా తెలుస్తోంది.జెన్ జెడ్ తరం టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ లాంటి అంశాలపై గణనీయంగా ఖర్చు చేస్తోంది. తమ లైఫ్‌స్టయిల్‌కి అనుగుణంగా, పారదర్శకమైన, సరళమైన ట్రావెల్, హెల్త్ పాలసీలను, గ్యాడ్జెట్స్‌ను కొనుగోలు చేసేందుకు వారు సిద్ధంగా ఉంటున్నారు. దానికి తగ్గట్లుగా వారికి అర్థమయ్యే రీతిలో బీమాను వివరించి, తగు పాలసీలను అందచేయగలిగితే ఇన్సూరెన్స్ ప్రయోజనాలను జెన్ జడ్ తరంవారికి మరింతగా చేరువ చేసేందుకు వీలవుతుంది.

ఏం కోరుకుంటున్నారు..

సరళత్వం: అర్థం కాని సంక్లిష్టమైన పదాలు, సుదీర్ఘంగా ఉండే పాలసీ డాక్యుమెంట్లను వారు ఇష్టపడటం లేదు. సాదా సీదాగా అర్థమయ్యే భాషను, డిజిటల్ సాధనాలను, స్పష్టతను కోరుకుంటున్నారు.వారు సంప్రదాయ పద్ధతుల్లో గిరిగీసుకుని ఉండటం లేదు. ఫ్రీల్యాన్స్ కెరియర్లు మొదలుకుని ఇతరత్రా పార్ట్‌టైమ్ పనులు కూడా చేస్తున్నారు. కాబట్టి పే–యాజ్–యు–డ్రైవ్ కార్ ఇన్సూ రెన్స్, అవసరాలకు తగ్గట్లు యాడ్–ఆన్‌లను చేర్చేందుకు వీలుండే హెల్త్ పాలసీలు, స్వల్పకాలిక కవరేజీల్లాంటి ప్రోడక్టులను వారు ఇష్టపడుతున్నారు.డిజిటల్ ఫస్ట్: ఫోన్‌తో చెల్లింపులు జరిపినట్లు లేదా ఫుడ్ డెలివరీ యాప్ ద్వారా ఆర్డరు పెట్టినట్లు పాలసీ కొనుగోలు అనుభూతి కూడా సులభతరమైన విధంగా, వేగవంతంగా, మొబైల్ – ఫస్ట్ తరహాలో ఉండాలనుకుంటున్నారు.

పారదర్శకత: నైతిక విలువలు, పారదర్శక విధానాలను పాటించే బ్రాండ్స్ వైపు జెన్ జెడ్ తరం మొగ్గు చూపుతున్నారు. సమాజం, పర్యావరణంపట్ల బాధ్యతాయుతంగా ఉండే సొల్యూషన్స్.. వారి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

# ఆశారాం బాపుకు ఝలక్ ?

### బెయిల్ రద్దు చేయాలని బాధితురాలి తరపు లాయర్ పిటిషన్



**న్యూఢిల్లీ:**ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపుకు సుప్రీంకోర్టు ఇచ్చి న బెయిల్ రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో బాధి తురాలి తరపు లాయర్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నారని దేశవ్యాప్తంగా పర్యటనలు చేస్తున్నాడని కోర్టుకు తెలిపారు. ఆశారాం బాపుకు అనారోగ్య కారణాలతో గత నెలలో కోర్టు బెయిల్ మంజూరు చేసింది.వివాదాస్పద మత గురువు ఆశారం బాపు మరోసారి చిక్కుల్లో పడ్డాడు. తనకు వయసు రీత్యా తీవ్రమైన ఆరోగ్య సమస్యలున్నాయని కనుక మెరుగైన చికిత్స కోసం తనకు బెయిల్ మంజూరు చేయాలని ఆశారం బాపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. అంతే కాకుండా ప్రస్తుతం ఆయన వయస్సు 86 సంవత్సరాలని వయస్సు రీత్యా వచ్చే సమస్యలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. వీటిని పరిగణలోకి తీసుకున్న కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు అక్టోబర్ లో ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.అయితే బాధితురాలి తరపు న్యాయవాది ప్రస్తుతం ఆశారాం బాపు ఆరోగ్యంగానే ఉన్నారని కోర్టుకు తెలిపారు. ఆశారం బాపు ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నారు. ఆయన అహ్మదాబాద్, ఇండోర్, జోధ్‌పూర్ నగరాలు ప్రయా ణం చేశారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు అలా దేశవ్యాప్త పర్యటనలు చేయలేరని పేర్కొన్నారు. దీనిని పరిగణలోకి తీసుకొని కోర్టు ఆశారం బాపుకిచ్చిన బెయిల్ రద్దు చేయాలని కోరారు. కాగా 2013 ఆగస్టు 15న ఆశారం బాపు దగ్గర్లోని తన ఆశ్రమం లో తనపై అత్యాచారం చేశారని 16 ఏళ్ల బాలిక దీంతో ఆశారం బాపుని అరెస్టు చేసి జోద్ పూర్ సెంట్రల్ జైలుకి తరలించారు. రెండు నెలల తరువాత గుజరాత్ లోని సూరత్ ఆశ్రమంలో ఆశారాం బాపు తన కుమారుడు తమపై అత్యాచారం చేసారని ఇద్దరు అక్కాచెల్లెల్లు కేసు నమోదు చేశారు. వీటిపై విచారణ జరిపిన జోద్ పూర్ కోర్టు 2018 ఏప్రిల్ 25న ఆశారాం బాపుకు జీవిత ఖైదు విధించింది. ఈ నేపథ్యంలో 12 సంవత్సరాల తరువాత తొలిసారిగా గత అక్టోబర్‌లో ఆశారాం బాపుకు తొలిసారిగా ఈ ఏడాది ప్రారంభంలో బెయిల్ వచ్చింది.

# అమెరికా ఆదేశాలు చెల్లవు

### గగనతలం మూసివేత.. అసలు ఆ హక్కు ఎవరిది?



వెనిజులా అమెరికా మధ్య ఉద్రిక్తతల్లో కీలక పరిణామం ఒకటి చోటు చేసుకుంది. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోతో ఫోన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడాడని..అది హాట్‌హాట్‌గా సాగిందని.. పరిస్థితి మరింత తీవ్రతరం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు ఇస్తున్నాయి. ఈ తరుణంలో.. గగనతలం మూసివేత అనేది పెద్ద చర్చనీయాంశంగా మారింది..వెనిజులా గగనతలం మూసివేయమని ట్రంప్ ప్రకటించారు. అయితే దీనిని వెనిజులా తీవ్రంగా ఖండించింది. ఇది చెల్లదని.. ట్రంప్ ప్రకటన తమ దేశ సార్వభౌమాధికారంపై దాడేనని అభివర్ణించింది. అసలు గగనతలంపై నిషేధం విధించే అధికారం ఎవరికి ఉంటుంది?.. ఎవరు ఎవరిపై విధిస్తారు? దానికంటూ ఏమైనా ప్రత్యేక మార్గదర్శకాలు ఉన్నాయా? .. ఈ నిర్ణయంతో కలిగే నష్టాలేంటి?.. పరిశీలిస్తే..గగనతలం మూసివేత అంటే.. ఒక దేశం తన భూభాగం పై ఉన్న ఆకాశాన్ని (%ఖుఱతీంజుఖుఎవ%) ఇతర దేశాల విమానాలకు పూర్తిగా లేదంటే కొంతవరకు నిషేధించడం. అది పరిస్థితులను బట్టి ఆ దేశం తీసుకుంటుంది. ఒక దేశం భద్రతా కారణాలు, యుద్ధ పరిస్థితులు, రాజకీయ నిరసనల కారణంగా గగనతలాన్ని మూసేసుకోవచ్చు. అప్పుడు ఆ దేశం మీదుగా ఇతర దేశాలకు సంబంధించిన విమానాలేవీ ప్రయాణించకూడదు. కానీ, ట్రంప్ అందుకు భిన్నంగా ఇతర దేశాన్ని(వెనిజులా) ఎయిర్‌స్పేస్‌ని మూసేయాలని ఆదేశించారు. ఒక దేశం మరొక దేశం గగనతలాన్ని మూసివేయమని చెప్పే హక్కు లేదు. దీంతో ఇది చెల్లదని.. కేవలం రాజకీయ ఉద్రిక్తతల్లో భాగమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ట్రంప్ గగనతలం మూసివేతకు చూపిస్తున్న కారణాలు అనేకం ఉన్నాయి. వెనిజులా గగనతలం ద్వారా నార్కో–టెర్రరిస్ట్ గ్రూపులు డ్రగ్ స్మగ్లింగ్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారాయన. డ్రగ్ ట్రాఫికింగ్‌తో పాటు మానవ అక్రమ రవాణా అరికట్టడం కోసమేనని చెబుతున్నారు. వెనిజులా గగనతలాన్ని పూర్తిగా మూసివేయాలని ఎయిరలైన్స్, పైలట్స్, డ్రగ్ డీలర్స్, హ్యూమన్ ట్రాఫికర్స్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా కరేబియన్ ప్రాంతంలో భారీ సైనిక దళాలను (ప్రపంచంలోనే అతిపెద్ద ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ సహా) మోహరింపజేశారు. ప్రతి దేశానికి తన ఆకాశంపై సార్వభౌమాధికార హక్కు ఉంటుంది. చికాగో కన్వెన్షన్ (1944) అంతర్జాతీయ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ ఆధారంగా రూపొందిన ఒప్పందం ఈ విషయంలో ప్రస్తుతానికి అమల్లో ఉంటోంది. ఇందులో భాగంగా..

ఆర్టికల్ 1: ప్రతి దేశానికి తన భూభాగం పై గగనతలంపై పూర్తి సార్వభౌమాధికార హక్కు ఉంటుంది.

ఆర్టికల్ 9: ఒక దేశం భద్రతా కారణాలు, యుద్ధ పరిస్థితులు, అత్యవసర పరిస్థితులు ఉన్నప్పుడు గగనతలాన్ని తాత్కాలికంగా మూసివేయవచ్చు.

ఆర్టికల్ 89: యుద్ధం లేదా జాతీయ అత్యవసర పరిస్థితుల్లో, దేశాలు %×జూూ% నిబంధనలను పక్కన పెట్టి తమ గగనతలాన్ని నియంత్రించవచ్చు.

గతంలో..

తమ జాతీయ భద్రతా కారణాల వల్ల గగనతలాన్ని మూసివేయడం సమర్థిస్తాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో తరచూ ఇది చూసిందే. అలాగే.. రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సమయంలో యూరప్ దేశాలు రష్యా విమానాలకు గగనతలాన్ని మూసివేశాయి. మొన్నీమధ్యే ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్–పాక్ నడుమ కూడా ఎయిరోస్పేస్ మూసివేత కనిపించింది. అయితే.. గగనతలం మూసివేతను తాత్కాలిక, అవసరమైన చర్యగా మాత్రమే ఐక్యరాజ్య సమితి లాంటి అంతర్జాతీయ సంస్థలు సమర్థిస్తాయి. విమర్శకులు మాత్రం దీన్ని రాజకీయ ఒత్తిడి సాధనంగా ఉపయోగించడం అంతర్జాతీయ చట్టానికి విరుద్ధమని అంటుంటారు. తమ గగన తలం నుంచి విమానాలు ప్రయాణించకూడదని ఒక దేశం ఆంక్షలు విధించడం లాంటిదే ఈ నిర్ణయం. దీంతో అంతర్జాతీయ విమానాలు ఆ దేశం మీదుగా ప్రయాణించడానికి వీలుండదు. అవి మార్గం మార్చుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రయాణాలకు సమయం.. ఇంధన ఖర్చు పెరుగుతాయి. ఫ్లైట్ షెడ్యూల్స్ ఆలస్యం అవుతాయి. అంతర్జాతీయ కనెక్టివిటీలో అంతరాయంతో ప్రయాణికులు ఇబ్బంది పడొచ్చు. అలాగే.. ఆర్థిక నష్టాలకూ అవకాశం ఉంది. ఈ నిర్ణయం వల్ల వాణిజ్యం, పర్యాటకం దెబ్బతింటాయి.ఎయిర్‌లైన్స్ ఆదాయం తగ్గుతుంది. కొన్నిసార్లు ఇది యుద్ధ ముప్పుగా కూడా మారొచ్చు.గగనతలం మూసివేత అనేది ఒక దేశం తన సార్వభౌమాధికారాన్ని వినియోగించే చర్య. ఇందుకు చికాగో కన్వెన్షన్ రూల్స్ ఉన్నాయి. కానీ అమెరికా–వెనిజులా ఉద్రిక్తతల్లో ఇది అంతర్జాతీయ చట్టానికి విరుద్ధం. అధికారిక రూల్స్ ప్రకారం చెల్లుబాటు కాదు. దీని వల్ల విమానయాన రంగం, ఆర్థిక వ్యవస్థ, ప్రజల జీవితం అన్నీ ప్రభావితం అవుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# సూట్‌కేస్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్ మృతదేహం



**వియన్నా / స్లోవేనియా:** వారం రోజులుగా అదృశ్యమైన ఆస్ట్రియన్ బ్యూటీ ఇన్‌ఫ్లుయెన్సర్ స్టెఫానీ పైపర్ (31) విగతజీవిగా కనిపించింది. స్లోవేనియన్ అడవిలో ఒక సూట్‌కేస్‌లో ఆమె మృతదేహం లభ్యమైంది.దీనికి ముందు స్టెఫానీ పైపర్ మాజీ ప్రియుడు తన నేరాన్ని అంగీకరించి, పోలీసులను స్టెఫానీ మృతదేహాన్ని దాచిన ప్రదేశానికి తీసుకెళ్లినట్లు ఆస్ట్రియన్ అధికారులు తెలిపారు. పైపర్ కనిపించకుండా పోవడంతో కలకలం చెలరేగింది. క్రిస్మస్ పార్టీ తర్వాత స్నేహితులు ఆమెను చివరిసారిగా చూశారు. స్థానిక నివేదికల ప్రకారం పార్టీ ముగిశాక పైపర్ తన ఇంటికి చేరుకున్నట్లు స్నేహితులకు వాట్సాప్ సందేశం పంపింది. ఆ తర్వాత తన ఇంటి మెట్ల మార్గంలో ఎవరో తనను అనుసరిస్తున్నట్లు మరో సందేశాన్ని పంపింది. ఆస్ట్రియన్ వార్తాపత్రిక క్రోనెన్ జైటంగ్ నివేదిక ప్రకారం ఆమె మాజీ ప్రియుడు ఆమెను గొంతు కోసి చంపి, ఆపై మృతదేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి అడవిలో పడేశాడని పోలీసుల ముందు వెల్లడించాడు. పీపుల్ మ్యాగజైన్ నివేదిక ప్రకారం ఆమె అదృశ్యమైన రోజున ఆమె మాజీ ప్రియుడిని భవనంలో చూసినట్లు స్థానికులు తెలిపారు.

# ఎయిర్‌పోర్టుల్లో జీపీఎస్ స్పూఫింగ్ నిజమే

సంబంధిత విభాగానికి తెలియజేయాలని విమానయాన సంస్థలు, పైలట్లు, ఏటీసీలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సూచించిన సంగతి తెలిసిందే. ఈ సూచనల అనంతరం కోల్‌కతా, అమృత్‌సర్, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి విమానాశ్రయాల నుంచి నివేదికలు వస్తున్నాయని మంత్రి వెల్లడించారు. దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొన్ని విమానాలు శాటిలైట్ ఆధారిత ల్యాండింగ్ ప్రక్రియను ఉపయోగించినప్పుడు ఈ స్పూఫింగ్‌కు గురైనట్లు తెలిసిందన్నారు. వెంటనే ఆ విమానాల్లో ప్రత్యామ్నాయ ప్రక్రియలు యాక్టివేట్ అయ్యాయని వెల్లడించారు. సంప్రదాయ పద్ధతులతో ల్యాండ్ అయిన విమానాలు ప్రభావితంకాలేదని చెప్పారు. దిల్లీతో పాటు కోల్‌కతా, అమృత్‌సర్, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి విమానాశ్రయాల్లో జీఎన్ఎస్ఎస్ జోక్యం ఉన్నట్లు విమానయాన శాఖ వెల్లడించింది.

జీపీఎస్ స్పూఫింగ్ అంటే..?

నావిగేషన్ వ్యవస్థను ప్రభావితం చేసి నకిలీ జీపీఎస్ ద్వారా విమానాలను దారి మళ్లించే ప్రక్రియను జీపీఎస్ సిగ్నల్ స్పూఫింగ్ గా వ్యవహరిస్తారు. నిజమైన శాటిలైట్ సిగ్నల్స్‌ను అడ్డుకొని ఆ స్థానంలో నకిలీ సంకేతాలను పంపి జీపీఎస్ రిసీవర్‌ను తప్పుదోవ పట్టిస్తాయి. ఫలితంగా.. ప్రస్తుతమున్న ప్రదేశం, సమయాన్ని తప్పుగా చూపించేలా చేస్తాయి.

# షాకిస్తున్న కేరళ 'హెచ్‌ఐవీ'..

### • నెలకు 100 కొత్త కేసులు నమోదు

తిరువనంతపురం: దేశంలోనే అత్యుత్తమ ఆరోగ్య సంరక్షణ ప్రమాణాలు, అధిక నాణ్యత గల ఆసుపత్రులు, అగ్రశ్రేణి అక్షరాస్యత రేటుతో ఆరోగ్య రంగంలో అగ్రగామిగా నిలిచిన కేరళ ఇప్పుడు హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్ (హెచ్‌ఐవీ)పెరుగుదలను చవిచూస్తోంది.ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్‌ఐవీ నిర్మూలన లక్ష్యానికి చేరుకోవాలని చూస్తున్న తరుణంలో.. కేరళలో మాత్రం ప్రతి నెలా సగటున 100 కొత్త హెచ్‌ఐవీ కేసులు నమోదుకావడం ఆందోళన కలిగిస్తోంది.కేరళలో ముఖ్యంగా 15 నుండి 24 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతలో హెచ్‌ఐవీ వ్యాప్తి కనిపిస్తోంది. ఇది కేరళలోని ఆరోగ్య నమూనాకు సవాలు విసురుతోంది. కేరళలో మొత్తం హెచ్‌ఐవీ కేసుల సంఖ్య జాతీయ సగటు (0.20%) కంటే తక్కువగా (0.07%) ఉన్నప్పటికీ, కొన్ని జిల్లాల్లో కేసులు భారీగా పెరుగుతున్నాయి. గత మూడు ఏళ్లలో ఎర్నాకుళం జిల్లాలో అత్యధికంగా 850 కేసులు నమోదయ్యాయి. దీనికి ప్రధానంగా వలస కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉండటం, వారిలో మాదకద్రవ్యాల వాడకం వంటివి కారణాలుగా నిలుస్తున్నాయి.కేరళలో ఎర్నాకుళం తర్వాత తిరువనంతపురం (555), త్రిస్సూర్ (518) జిల్లాల్లో అధిక కేసులు నమోదయ్యాయి. కొత్త కేసులలో 3,393 మంది పురుషులు, 1,065 మంది మహిళలు, 19 మంది ట్రాన్స్‌జెండర్, 90 మంది గర్భిణులు ఉన్నారు. ఇది వ్యాధి అన్ని సమూహాలలో వ్యాపిస్తున్న విషయాన్ని తెలియజేస్తుంది. కేరళ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (కేఎస్‌ఏసీఎస్) హెచ్‌ఐవీ కేసుల పెరుగుదలకు ముఖ్య కారణాలను తెలిపింది. ఇవి యువతలో ఎక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొంది.

**అసురక్షిత సంభోగం**

ఇది ఇన్ఫెక్షన్ వ్యాప్తికి గల ప్రధాన కారణాలలో ఒకటి. డేటింగ్ యాప్‌ల ద్వారా పరిచయాలు పెరిగి, నేపథ్యం తెలియని వ్యక్తులతో కండోమ్ వాడకుండా, సంభోగంలో పాల్గొనడం ఆందోళనకర పరిస్థితులకు దారితీస్తుంది.

**ఇంజెక్టబుల్ డ్రగ్స్ వాడకం:**డ్రగ్స్ ఇంజెక్ట్ చేయడానికి ఒకే సిరంజిలను వాడటం. ఇది మలప్పురం తదితర జిల్లాల్లో కూడా కేసుల పెరుగుదలకు దారితీసింది.

**కలుషితమైన టాటూ సూదుల వాడకం:**సరైన పరిశుభ్రత పాటించని టాటూ కేంద్రాలలో కలుషితమైన సూదుల ద్వారా కూడా హెచ్‌ఐవీ వ్యాప్తి చెందుతోంది.

**వలస కార్మికులు:**

ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మికులు, వారిలో కొంతమంది డ్రగ్స్ వాడకం వల్ల కూడా కేసులు పెరుగుతున్నాయి.

నివారణ– నియంత్రణ చర్యలు

ఈ పెరుగుతున్న కేసులను అరికట్టేందుకు సత్వర చర్యలు అవసరం. ఇందుకోసం కేఎస్‌ఏసీఎస్ కొన్ని పరిష్కార మార్గాలను సూచించింది.

ముందస్తు పరీక్ష–చికిత్స

వైరస్ బారిన పడే అవకాశం ఉన్నవారికి త్వరగా పరీక్షలు నిర్వహించి, చికిత్స ప్రారంభించాలి.

గర్భిణులకు పరీక్షలు

తల్లి నుండి బిడ్డకు వైరస్ సంక్రమించకుండా నిరోధించేందుకు గర్భం దాల్చిన మూడు నెలల్లోపు సిఫిలిస్, హెచ్‌ఐవీ పరీక్షలను తప్పనిసరి చేయాలి.

చికిత్స కొనసాగింపు

ఇన్ఫెక్షన్ గుర్తించిన తర్వాత యాంటీరెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ)ని క్రమం తప్పకుండా కొనసాగించాలి.



ఇక కామారెడ్డి జిల్లా విషయానికి వస్తే, కామారెడ్డి స్థానంలో బిజెపి, బాన్సువాడలో బి ఆర్ ఎస్, ఎల్లారెడ్డి, జుక్కల్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ నుంచి గెలుపొందినప్పటికీ, ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో మూడు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండగా, బిఆర్ఎస్ పార్టీకి మాజీలే పెద్దదిక్కుగా మారారు.ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలకు ఈ పంచాయతీ ఎన్నికలు కీలకంగా మారాయి. తమ బలాన్ని నిరూపించుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి జిల్లాలో బీజేపీ ఉనికి చాటేందుకు ఆ పార్టీ నాయకుల సమిష్టి సహకారంతో ముందుకు సాగుతున్నారు. అయితే ముగ్గురు ఎమ్మెల్యేలు తమ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తుండగా, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆదిక్యత సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# పవర్ కోసం

## పంచాయతీల్లో పవర్ కోసం పార్టీల హోరాహోరి పోరు

- వేడెక్కిన గ్రామాలు.. వ్యూహాలు సిద్ధం
- గెలుపు గుర్రాల ఎంపికకు రాత్రింబవళ్లు సమావేశాలు
- కుల సమీకరణలు.. జంప్ జిలానీలకు ఆహ్వానాలు
- పోలింగ్‌కు జిల్లా యంత్రాంగం అంతా సన్నద్ధం
- తొలి విడత నుంచే ప్రతిష్టలు.. ఫలితాలపై అందరి చూపు

**నిజామాబాద్ ప్రతినిధి (జనం సాక్షి):** ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలవగా, ప్రధాన రాజకీయ పార్టీలు పవర్ దక్కించుకోవడంపై దృష్టి పెట్టాయి. ఆయా గ్రామాల్లో స్థానిక అంశాలతో పాటు కుల,రాజకీయ సమీకరణలు చేస్తూ గెలుపు గుర్రాలను బరిలో నిలుపుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో పవర్ నిలబెట్టుకుంటే ఆ తర్వాత రానున్న జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లోనూ జనం నాడి పట్టవచ్చనే అంచనాలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెజారిటీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో పార్టీ మద్దతు తెలిపే అభ్యర్థులను గెలిపించుకునేందుకు సమాలోచనలు చేస్తున్నారు. తొలి దశ నామినేషన్ల పర్వం ముగియగా, ఆశావహులు ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టారు. నిజామాబాద్ రెవిన్యూ డివిజన్ తో పాటు జక్రాన్ పల్లి మండల పరిధిలో ఆదివారం నుంచి అధికారులు రెండో విడత నామినేషన్లు స్వీకరిస్తున్నారు.పంచాయతీల్లో పవర్ దక్కించుకునేందుకు ప్రధాన పార్టీల నేతలు సన్నాహాలు చేస్తున్నారు.మెజార్టీ స్థానాలను దక్కించుకొని తమ పార్టీ ఉనికి చాటుకోవాలని తహతహలాడుతున్నారు.

గెలుపు గుర్రాలను వెతికి బరిలో నిలుపు తున్నారు. వాస్తవానికి పంచాయతీ ఎన్నికల్లో పార్టీల గుర్తులు లేకపోయినప్పటికీ, పరోక్షంగా పార్టీ అభ్యర్థులుగా ప్రకటిస్తూ మద్దతు తెలుపుతున్నారు.

నిజామాబాద్ జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండగా, అర్బన్, ఆర్మూర్ స్థానాల్లో బిజెపి,బాల్కొండ నుంచి బిఆర్ఎస్, బోధన్, నిజామాబాద్ రూరల్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిజామాబాద్ అర్బన్ మినహా మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. బోధన్, రూరల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి ఆయా గ్రామాల గ్రామ శాఖల నాయకులతో చర్చించి సర్పంచ్ అభ్యర్థులను బరిలో నిలిపి గెలుపే లక్ష్యంగా దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇక, ఆర్మూర్ లో బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పంచాయతీ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఆ పార్టీ గ్రామ శాఖల ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ గెలుపు గుర్రాలను బరిలో నిలుపుతున్నారు. అయితే కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ రెడ్డి, ఇతర నాయకులతో సంప్రదింపులు జరుపుతూ పార్టీ ప్రతిష్ట పెంచాలనే యోచనతో పావులు కదుపుతున్నారు. ఇదిలా ఉండగా, బాల్కొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మరోసారి తన సత్తా చాటేందుకు సమాయత్తమయ్యారు. అయితే బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సైతం బలంగా ఉండడంతో, అనేక గ్రామాల్లో కాంగ్రెస్, బి.ఆర్.ఎస్ పార్టీల మధ్య నువ్వా- నేనా అన్నట్లుగా పంచాయతీ పోరు సాగనుంది. రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ ఇన్చార్జి సునీల్ రెడ్డి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తమ అనుచరులను సర్పంచ్లుగా గెలిపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

### వ్యూహం ఫలించేనా?

ప్రధాన పార్టీల నాయకులు పంచాయతీ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ పార్టీ బలహీనంగా ఉన్న గ్రామాల్లో, ఇతర పార్టీల నుంచి మద్దతు ఆశించి భంగపడుతున్న వారిని మచ్చిక చేసుకుంటున్నారు. ఇతర పార్టీల నుంచి తమ పార్టీల్లోకి ఆహ్వానిస్తూ జంప్ జిలానీలకు గాలం వేస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కాంగ్రెస్, బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు కులాల వారీగా లెక్కలు తీస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల బాధ్యతలను ఆయా పార్టీల గ్రామ శాఖలు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు రోజువారి సమాచారాన్ని జిల్లా నాయకులకు చేరవేస్తున్నారు. మంగళవారంతో రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియనుంది. ఈ నేపథ్యంలో బోధన్, నిజామాబాద్ రెవిన్యూ డివిజన్ పరిధిలో ప్రచారపర్వం వేడెక్కనుంది. ఆర్మూర్ డివిజన్ లో మూడో విడతలు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహరచనలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతో హస్తం శ్రేణుల్లో అదే ఉత్సాహం కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను హస్తగతం చేసుకునేందుకు అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకున్నారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అధికార పార్టీ వైపే జిల్లా వాసులు మొగ్గుచూపే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

### పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు:

జిల్లాలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ రెవెన్యూ డివిజన్లలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 545 గ్రామ పంచాయతీల సర్పంచ్, 5022 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు, ఓ.పీ.ఓల ర్యాండమైజేషన్ జరిపారు. మూడో విడత నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత పారదర్శకంగా స్క్రూటీని జరిపి అభ్యర్థులకు గుర్తులు కేటాయించేందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. డిసెంబర్ 11 న తొలి విడత పంచాయతీ పోలింగ్ జరుగుతుండగా, ఈ ఎన్నికల ఫలితాలు ఆ తర్వాత జరగబోయే పోలింగ్ పై ప్రభావం చూపుతాయని అందరూ భావిస్తున్నారు. తొలి విడతలో బోధన్ రెవిన్యూ డివిజన్ పరిధిలో పోలింగ్ జరగనుండగా, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. ఆ తర్వాత డిసెంబర్ 14న రెండో విడత, 17న మూడవ విడత పోలింగ్ నిర్వహించ నున్నారు.

---

పారమిత విద్యాసంస్థలలో అంగరంగ

# వైభవంగ గీతా జయంతి వేడుకలు

**పారమిత పాఠశాలల చైర్మన్ డా.ఇ. ప్రసాదరావు**




**కరీంనగర్, డిసెంబర్ 01 (జనంసాక్షి) :** నగరంలోని పారమిత విద్యాసంస్థలలో గీతాజయంతి పురస్కరించుకొని గీతాజయంతి వేడుకలు నయనానందకరంగా, వీనుల విందుగా నిర్వహించారు. ఇట్టి వేడుకలను పారమిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సంధర్భంగా విద్యార్థులు చేసిన కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగ భగవద్గీతలోని శ్లోకాలను విద్యార్థులు ఆలపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, అదేవిధంగా భూలోకంలోకి భగవద్గీత ఆగమనం గురించి, మానవ సమాజం పై భగవద్గీత ప్రభావం గురించి విద్యార్థులు చక్కగా వివరించారు. ఈ సంధర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈ సంధర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ... నైతిక విలువలు పతనమౌతున్న నేటి సమాజంలో భగవద్గీత సారాన్ని, అందులోని నైతిక విలువలను చెప్పిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. భరత ఖండం పై జన్మించినందుకు మనమదరం ధన్యులము ఇట్టి జన్మ సార్ధకత చేసుకునేలా మహిమాన్వితమైన ఈ పవిత్ర గ్రంధాన్ని మన అందరి ఇళ్ళలో ఉండేలా మనమే ఒక నియమం ఏర్పరచుకొని రోజుకో పద్యం చొప్పున పఠించి అందులోని జ్ఞానాన్ని సంపాదించి, పది మందికి నైతిక విలువలను వివరిస్తూ ముందుకు సాగిపోవాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా.ఇ. ప్రసాదరావు కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులను అభినందించారు. పోషకులకు శ్రేయోభిలాషులకు గీతాజయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, ప్రాచీ, వినోద రావు, వి.యు. యం ప్రసాద్, హనుమంత రావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజి, కవిత, గోపి క్రిష్ణ, శ్రీకర్, శర్మిష్ఠ సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

---

# సైన్స్ మానవ క్షేమానికి ఉపయోగపడాలి

- పిల్లల్లో శాస్త్రవేత్తను బయటపెట్టండి : డీఈవో శ్రీరాం కొండయ్య
- ఆత్మనిర్భర్ భారత్ కోసం ప్రతి విద్యార్థి ఒక ప్రాజెక్టు
- వ్యవసాయంలో టెక్నాలజీ విప్లవం తీసుకొచ్చేలా చూడాలి
- 807 మోడల్స్‌తో అంగరంగ వైభవంగా ముగిసిన బాల వైజ్ఞానిక ప్రదర్శన



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 1 (జనం సాక్షి):** కొత్తపల్లి ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌లో గత మూడు రోజులుగా జరిగిన జిల్లా బాల వైజ్ఞానిక ప్రదర్శన-2025 ముగింపు ఉత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. సాంస్కృతిక కార్యక్రమాలతో కళకళలాడిన ఈ వేదికపై జిల్లా విద్యాధికారి శ్రీరాం కొండయ్య మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో ఒక శాస్త్రవేత్త దాగి ఉన్నాడని, ఆ శాస్త్రవేత్తను బయటకు తీసి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. శ్రమతోనే సాధన సాధ్యమని, సైన్స్ మానవ క్షేమానికి ఉపయోగపడాల్సిందే తప్ప వినాశనానికి కాదని స్పష్టం చేశారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ప్రతి విద్యార్థి ఒక ప్రాజెక్టుతో ముందుకు రావాలని, ఈ రోజు సమస్యలకు రేపటి పరిష్కారం చూపేలా ఆ ప్రాజెక్టులు రూపొందించాలని డీఈవో సూచించారు. మనది వ్యవసాయ ఆధారిత దేశమే కాబట్టి వ్యవసాయ రంగంలో టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. సూత్రాలు వల్లె వేయడం కంటే వాటిలోని లాజిక్‌ను అర్థం చేసుకోవడమే ముఖ్యమని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఐఐటీ, నీట్, నిట్ లక్ష్యాలకే పరిమితం కాకుండా గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. దేశంలో ఐఐఎస్సీ బెంగళూరు, ఐసీఏఆర్, ఏఎస్ఆర్, ఐఐఎస్ఇఆర్ వంటి అత్యుత్తమ పరిశోధనా సంస్థలు ఉన్నాయని, అక్కడ సీటు సాధించి దేశానికి సేవ చేయాలని ఆయన కోరారు.

జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల్లో మొత్తం 807 ఎగ్జిబిట్స్, 126 ఇన్‌స్పైర్ అవార్డు మోడల్స్ ప్రదర్శితమయ్యాయి. మొదటి రోజు 1600 మంది, రెండో రోజు 2652 మంది, మూడో రోజు 5357 మంది విద్యార్థులతో కలిపి 176 పాఠశాలల నుంచి వేలాది మంది సందర్శించారు. ఇన్‌స్పైర్-మనక్ కోసం 13 మంది విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అలాగే ప్రతి థీమ్‌లో ప్రథమ విజేతలను కూడా రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నారు.కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్.భగవంతయ్య, సెక్టోరల్ అధికారులు కర్ర అశోక్ రెడ్డి, ఆంజనేయులు, మిల్కూరి శ్రీనివాస్, కృపారాణి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వేణుగోపాల్, కొత్తపల్లి ఎంఈవో ఆనందం, ఏనుగు ప్రభాకర్ రెడ్డి, వివిధ మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

---

గోల్డ్‌మెడల్ సాధించిన కరాటే విద్యార్థులను

# అభినందించిన ఐఏఎస్ అధికారి నరహరి



**గోదావరిఖని, జనంసాక్షి :** జాతీయస్థాయిలో కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎస్‌జిఎఫ్ పోటీలలో స్టేట్ సెలక్షన్‌కు ఎంపికైన విద్యార్థులను సీనియర్ ఐఏఎస్ అధికారి,మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి అభినందించారు. బసంత్ నగర్‌లో పరికి పండ్ల నరహరి ఐఏఎస్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్, (స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్)లో కరాటే పోటీలలో స్టేట్ సెలక్షన్‌కు ఎంపికైన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి డ్రాగన్ షాడోకాన్ కరాటే క్లబ్ విద్యార్థి, టింగు జయ సాయి చరణ్‌ను మెడల్స్ వేసి అభినందించారు.మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు.ఇటీవల వరంగల్లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన, టింగు జయసాయి చరణ్‌ను, గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్ సాధించిన సహస్ర, ఆయాన్స్, టింగు సాయివైష్ణవి, తన్వి, కృష్ణ స్పందనకు మెడల్స్ వేసి అభినందించారు.మరింత ఉన్నతంగా ఎదగాలని ఆశీర్వదించారు, వీరికి శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ పసునూటి చందును ప్రత్యేక అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ తల్లిదండ్రులు, మధు శ్రీలక్ష్మి, యూసుఫ్, బొంకూరి పవన్‌కుమార్ సాయి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, మైస రాజేష్, యాసర్ల చిరంజీవి, పానుగంటి రాజలింగం, ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేష్‌బాబు,అడిషనల్ సీఈవో,మిట్టపల్లి రాజేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

---

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీపీ

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ



**మంథని, (జనంసాక్షి) :** రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ ఈరోజు మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంజపడుగు, రచ్చపల్లి గ్రామాల లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సోమవారం ప్రత్యక్షంగా సందర్శించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అక్కడి పరిసరాలను సమీక్షించి శాంతిభద్రతల పరంగా తీసుకోవాల్సిన పలు సూచనలను గుర్తించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా అవసరమైన అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. ప్రజలు భయభ్రాంతి లేకుండా తమ ఓటు హక్కును వినియోగించే వాతావరణం కల్పించడానికి, పోలింగ్ రోజు ఎలాంటి అక్రమాలు, ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఓటరు భయభ్రాంతులు లేకుండా ఓటు హక్కును స్వేచ్ఛ గా వినియోగించుకునేలా పోలీస్ తరుపున అన్ని భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని చట్టవ్యతిరేక చర్యలు ఎవరు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని కమిషనర్ గారు తెలిపారు. స్థానిక ప్రజలకు, అన్ని పార్టీల కార్యకర్తలకు శాంతి భద్రతలు, చట్టపరమైన నిబంధనలు, ప్రవర్తనా నియమావళిని పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపిఎం రమేష్, మంథని సిఐ బి రాజు, మంథని ఎస్ ఐ రమేష్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

---

# భారతీయులందరికీ ప్రాతస్మరణీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్

**జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్**



**బోధన్, డిసెంబర్ 1 (జనంసాక్షి) :** భారతీయులందరికీ ప్రాతస్మరణీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, కుల మత ప్రాంత భేదాలు లేకుండా మనమందరం భారతీయులం అనే ఐక్యత భావనను మనలో నింపడం కోసం తన యొక్క జీవితాన్ని అర్పించిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ ను భారతీయులందరూ మతాలకు అతీతంగా ప్రతి ఉదయం స్మరించుకోవాలని జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ వ్యాఖ్యానించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఐక్యత మార్చ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం బోధన్ పట్టణంలో మేరా యువ భారత్ మరియు ఏక చక్ర సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఐక్యత పాదయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆవిడ మాట్లాడుతూ, వివిధ సంస్థానాలుగా విభజించబడి ఉన్న భారతదేశాన్ని ఒకే దేశంగా అవతరింపచేయడం కోసం సుమారు 500 కు పైగా సంస్థానాధిపతులతో మాట్లాడి ఒప్పించి భారతదేశానికి ఐక్యత రూపాన్ని ప్రసాదించిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని తెలిపారు. ఉదయం అంబేద్కర్ చౌక్ వద్దగల 101 అడుగుల జాతీయ జెండా వద్ద శైలి బెల్లాల్ జెండా ఊపి ఐక్యత పాదయాత్రను ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు ఐక్యత పాదయాత్ర కొనసాగింది దారి పొడవున జాతీయ జెండాలు చేతబట్టిన యువతీ యువకులు భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలు చేస్తూ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఏక చక్ర సేవా సమితి అధ్యక్షులు అంకు మహేష్ మాట్లాడుతూ, బోధన్ ప్రజలలో దేశభక్తి మరియు ఐక్యతను పెంచడం కోసమే నిరంతరం ఏక చక్ర సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం చివరిలో ఐక్యత ప్రతిజ్ఞను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షులు హరికృష్ణ, ఆర్య సమాజ్ అధ్యక్షులు ప్రదీప్ గుప్తా, ఏక చక్ర సేవా సమితి సభ్యులు, యువతి యువకులు, వివిధ కళాశాలల మరియు పాఠశాలల యాజమాన్యాలు, యువజన సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

---

# రుద్రంగిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ





**రుద్రంగి డిసెంబర్ 1 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి చెక్ పోస్ట్ వద్ద వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆది శ్రీనివాస్ వాహనాన్ని అధికారులు ఆపి క్షుణ్ణంగా చెక్ చేశారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైపు ఆది శ్రీనివాస్ వాహనాల తనిఖీ అధికారులకు పూర్తి సహకారం అందించారు.

**అయ్యప్పస్వామి సేవలో..**

వేములవాడలోని శ్రీ అయ్యప్ప స్వామి నిత్యాన్నదాన ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష పరులకు అన్నదానం నిర్వహిస్తున్నారు.సోమవారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.అనంతరం అయన మాట్లాడుతూ రాజన్న దర్శనానికి వస్తున్న అయ్యప్ప స్వాములకు, పట్టణంలో దీక్షలు తీసుకున్న స్వాములకు అన్న ప్రసాద వితరణ (బిక్ష) ఏర్పాటు చేసిన ట్రస్ట్ సభ్యులను అభినందించారు. భక్తులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. అయన వెంట అయ్యప్ప అన్నదాన చారి ట్రబుల్ ట్రస్ట్ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

---

# బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు


**మహిళలు, పిల్లలు, విద్యార్థుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు**

- అనుమతి లేని డీజే సౌండ్.. డ్రోన్ ఎగరవేతపై కేసులు
- సిటీ పోలీస్ యాక్ట్ కింద ధర్నా.. ర్యాలీలకూ ముందస్తు అనుమతి తప్పనిసరి
- డిసెంబర్ 1 నుంచి జనవరి 1 వరకు ఆంక్షలు అమలు
- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ..




గోదావరిఖని, డిసెంబర్ 1 జనంసాక్షి : మహిళలు, పిల్లలు, విద్యార్థులు, వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమలవుతున్న నిషేధాజ్ఞలను మరో నెల రోజుల పాటు పొడిగించినట్టు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రకటించారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం మత్తులో అసభ్య పదజాలం, గొడవలు, మహిళలకు వేధింపులు పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ కట్టుదిట్టమైన నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. అదే విధంగా భారీ డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగం, అనుమతి లేకుండా డ్రోన్‌లు ఎగరవేయడంపైనా నిషేధాన్ని కొనసాగిస్తున్నట్టు సీపీ వెల్లడించారు. శబ్ద కాలుష్యం వల్ల చిన్నపిల్లలు, విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డ్రోన్‌ల దుర్వినియోగం గోప్యతకు, భద్రతకు ముప్పుగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో మైక్‌సెట్ వాడాలన్నా సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. ఈ మూడు నిషేధాజ్ఞలు 2025 డిసెంబర్ 1 ఉదయం 6 గంటల నుంచి 2026 జనవరి 1 ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటాయని, పరిస్థితుల బట్టి మరింత పొడిగించే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ 1348 ఫసలీ సంవత్సరం నిబంధనలకు అనుగుణంగా ఈ ఆంక్షలు జారీ అయినట్టు ఆయన వివరించారు. నిషేధాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇదే సమయంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 కింద ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తు పోలీసు అనుమతి తప్పనిసరని మరోసారి గుర్తు చేశారు. బంద్ పేరుతో బలవంతంగా దుకాణాలు, కార్యాలయాలు మూయించేందుకు యత్నించినా, బెదిరింపులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.



గ్రామస్తులను అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులను కూడగట్టుకొని సమిష్టి నిర్ణయం మేరకు అర్రాస్ పాట పాడారు. ఈ అర్రాస్ పాట దాదాపు 5 లక్షల నుంచి 20 లక్షల వరకు పలికింది. కొన్నిచోట్ల కాంగ్రెస్ టీఆర్ఎస్ పార్టీ బలపరిచిన నాయకుల రాజీ మేరకు సర్పంచ్ ఉప సర్పంచ్ పదవుల పంపకాల ఒప్పందంతో ఆ గ్రామపంచాయతీలో సింగిల్ నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇదిలా ఉంటే నామినేషన్ల ఉపసంహరణ గడువు డిసెంబర్ 3 తో ముగుస్తుంది. అప్పటిలోపు ప్రత్యర్ధి అభ్యర్ధిని తమ వైపు తిప్పుకొని నామినేషన్ ఉపసంహరించడానికి కసరత్తు మొదలయింది.

- బుజ్జగింపులు మందలింపులు
- కాంగ్రెస్‌లో వర్గ పోరు ఎమ్మెల్యేకు తలపోటు
- ఏకగ్రీవం నజరానా 20 లక్షలు
- పంచాయతీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం

# సర్పంచ్ పదవులు అర్రాస్!!

## 21 గ్రామపంచాయతీల్లో ఏకగ్రీవం

### ఏకగ్రీవం కోసం బేర సారాలు



**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 1 (జనం సాక్షి):** ప్రజాస్వామ్యబద్ధంగా జరగవలసిన పంచాయతీ ఎన్నికలు కొన్నిచోట్ల అపహాస్యమయ్యాయి. ఓటింగ్‌తో గెలవవలసిన అభ్యర్థులు నోట్ల తో ఓట్లకు బేరం పెట్టి గెలుపొం దారు. ఇప్పుడు ఆ గ్రామపంచాయతీలన్నీ ఏకగ్రీవమయ్యాయి. ఇంకా కొన్ని పంచాయతీల్లో బేర సారాలు బుజ్జగింపు లు మందలింపులు జరుగుతున్నాయి. దీంతో నామినేషన్ల ఉపసంహరణ రోజుకు మరిన్ని గ్రామపంచాయతీలు ఏకగ్రీవము అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా గ్రామపంచాయతీ మొదటి దఫ్వా ఎన్నికల నామినేషన్ల సందర్భంగా తాండూర్ నియోజకవర్గం లోని యాలాల బొమ్రాస్ పేట్ దుద్యాల పెద్దేముల్ తాండూర్ మండలాలలో దాదాపు 21 గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు అధికంగా ఉన్నారు. కేవలం నామినేషన్ల చివరి రోజు వరకు గ్రామపంచాయతీల సర్పంచ్ పదవి కోసం సింగిల్ నామినేషన్లు వేయడం తో ఏకగ్రీవమయ్యాయి. ఇంకా నామినేషన్ల ఉపసంహరణ డిసెంబర్ 3న ఉంది. అప్పటివరకు మరిన్ని గ్రామపంచాయతీలు ఏకగ్రీవము అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే బొమ్రాస్పేట్ మండలంలో సాలిందాపూర్ మదనపల్లి తండా జానకంపల్లి నాగిరెడ్డిపల్లి కట్టు కలువ తండా బీకుల గడ్డ తండా పాల బాయి తండా యాలాల మండలం లో లక్ష్మీనారాయణ పూర్ సంగం కుర్దు కిష్టాపూర్ పెర్కంపల్లి తండా సంగాయిగుట్ట తాండ గంగాసాగర్ పెద్దెముల్ మండలం లో సిద్దన్నమడుగు తాండ దుగ్గపూర్ దౌల్తాబాద్ మండలంలో తిమ్మాయిపల్లి నాగ సార్ బషీరాబాద్ మండలం మంతన్ గౌడ్ దుద్యాలలో సంగాయిపల్లి తాండూరులో చిట్టి గణపురం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి కోసం ఒకే ఒక నామినేషన్ దాఖలు చేశారు. ఈ గ్రామపంచాయతీలన్నీ నామినేషన్ల ఉపసంహరణ గడువు అనంతరం అధికారులు ఈ గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవికి సింగల్ నామినేషన్ వేసిన వారిని సర్పంచిగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు బాగానే కసరత్తు చేశారు. గ్రామస్తులను అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులను కూడగట్టుకొని సమిష్టి నిర్ణయం మేరకు అర్రాస్ పాట పాడారు. ఈ అర్రాస్ పాట దాదాపు 5 లక్షల నుంచి 20 లక్షల వరకు పలికింది. కొన్నిచోట్ల కాంగ్రెస్ టీఆర్ఎస్ పార్టీ బలపరిచిన నాయకుల రాజీ మేరకు సర్పంచ్ ఉప సర్పంచ్ పదవుల పంపకాల ఒప్పందంతో ఆ గ్రామపంచాయతీలో సింగిల్ నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇదిలా ఉంటే నామినేషన్ల ఉపసంహరణ గడువు డిసెంబర్ 3 తో ముగుస్తుంది. అప్పటిలోపు ప్రత్యర్థి అభ్యర్థిని తమ వైపు తిప్పుకొని నామినేషన్ ఉపసంహరించడానికి కసరత్తు మొదలయింది. అధికార పార్టీ కాంగ్రెస్ ప్రతిపక్ష పార్టీ టీఆర్ఎస్ నాయకులు సర్పంచ్ పదవికి పోటీ చేయడానికి నామినేషన్లు వేశారు. ఒకే పార్టీకి చెందిన వారు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇద్దరు నుంచి ముగ్గురు చొప్పున నామినేషన్లు దాఖలు చేయడంతో ఆయా పార్టీల నాయకులకు తలపోటుగా మారింది. అధికార పార్టీ కాంగ్రెస్ లో పోటీ అధికంగా ఉంది. రెబల్ అభ్యర్థులను ఒప్పించడానికి స్థానిక ఎమ్మెల్యే కు తలపోటుగా మారింది. కొన్నిచోట్ల నయాన భయాన బుజ్జగించి నజరానా ఇచ్చి సర్పంచ్ పదవికి వేసిన నామినేషన్ ఉపసంహరణకు ప్రయత్నం జరుగుతుంది. ఇది సఫలం అయితే జిల్లాలో మరిన్ని గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యే అవకా శం మెండుగా ఉంది. సర్పంచ్ పదవి దక్కించుకోవ డానికి ఉన్నది అమ్మేసి అప్పులు చేసి అర్రాస్ పాట సొమ్ము చెల్లించడానికి నాయకులు నానా తంటలు పడుతున్నారు. అర్రాస్ పాటసొమ్ము చెల్లించడానికి కొందరు గడువు తీసు కుంటే మరికొందరు ఉన్న ఆస్తిని రాసి ఇస్తున్నారు. ఈ అర్రాస్ సొమ్ముతో గ్రామ అభివృద్ధి తోపాటు మందిరాల నిర్మాణం చేయాలని గ్రామస్తులు తీర్మానించుకుంటున్నారు. దీంతో సర్పంచ్ పదవి అంగట్లో అపహాస్యమైంది. ఇప్పటికైనా మిగతా గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థులు దుబారా ఖర్చు తగ్గించి ఎన్నికల నిబంధనల మేరకు అభ్యర్థులు ప్రచారం కోసం డబ్బు ఖర్చు చేసి ప్రజాస్వామ్యబద్ధంగా గెలుపొందే ప్రయత్నం చేస్తారని అందరం ఆశిద్దాం ..

## నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**మోమిన్ పేట డిసెంబర్ 01 (జనం సాక్షి) :** మోమిన్ పేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ, వెల్చాల గ్రామ పంచాయతీ కార్యాలయాలలో నిర్వహిస్తున్న ఎన్నికల నామినేషన్ ల ప్రక్రియ ను పరిశీలించారు. ఎన్నికలను పురస్కరించుకుని గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం తనిఖీ చేశారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని, అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత నిర్ణయాలను అమలు చేయకూడదని అన్నారు. విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలని, నిర్ణీత గడువు లోపల నామినేషన్లు స్వీకరించేం దుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలు తెలుపుతూ, వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ తెరిచి, అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. కలెక్టర్ తో పాటు ట్రైని కలెక్టర్ హర్ష్ చౌదరి, ఎం పి డి ఓ సృజన సాహిత్య, ఎం ఆర్ ఓ రవీంద్ర, ఎంపీ ఓ యాదగిరి ఎన్నికల అధికారులు పంచాయతీ కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.

## నాగార్జున నగర్ కాలనీలో రోడ్ కబ్జా కేసు

### జిహెచ్ఎంసి నిర్లక్ష్యం... కాలనీ వాసుల ఆవేదన



**కాప్రా, డిసెంబరు 1 (జనంసాక్షి) :** నాగార్జున నగర్ కాలనీ హుడా లేఔట్‌లోని ప్రధాన రోడ్డును అక్రమంగా కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవకపోవడంతో కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ తరపున జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ కమిషనర్, అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లభించకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై సోమవారం ప్రజావాణిలో కాప్రా డిప్యూటీ కమిషనర్ గారికి వినతిపత్రం అందజేశారు. కమిటీ తెలిపిన వివరాల ప్రకారం.. హైకోర్టు రిట్ పిటీషన్ జడ్జిమెంట్ ఆధారంగా సదరు రోడ్డులో అక్రమంగా నిర్మించిన భవనాన్ని జిహెచ్ఎంసి ఇప్పటికే 2014లో కూల్చివేసి రోడ్డును ప్రజల వినియోగానికి అందుబాటులోకి తెచ్చింది. అయితే ఆ భవనం యజమాని 2016లో "OS 204/2016" నెంబరుతో కోర్టులో కేసు వేయగా, అది కొట్టివేయబడింది.

అనంతరం మరలా 2018లో "OS 408/2018" నెంబరుతో సీనియర్ సివిల్ కోర్టులో కేసు వేసినట్లు కమిటీ వెల్లడించింది. ఇట్టి కేసులో ఉద్దేశపూర్వకంగా కాలనీ కమిటీని పక్షంగా చేర్చకపోవడం, కీలకమైన వివరాలను దాచిపెట్టడం తీవ్ర ఆక్షేపణకు గురవుతున్నాయి. ముఖ్యంగా జిహెచ్ఎంసి తరపున ఇప్పటి వరకు కౌంటర్ దాఖలు చేయక పోవడం, ప్రభుత్వ న్యాయవాది ఎక్స్ పార్టీ అయ్యారు. ఈ విషయం కాలనీ ప్రజలను ఆందోళనకు గురిచేస్తుందని కమిటీ సభ్యులు వ్యాఖ్యానించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. "జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు ఎలాంటి స్పందన చూపకపోవడంతో, అక్రమ కబ్జాదారులతో కుమ్మక్కై రోడ్డును వారికి అప్పగించే ప్రయత్నం జరుగుతోం దన్న అనుమానం కలుగుతోంది" అని ఆరోపించారు. ఈ విషయంపై ఇప్పటికే మార్చి లో ఏర్పడిన కాలనీ కమిటీ ఆధ్వర్యంలో 04-07-2025, 22-09-2025 తేదీల్లో దరఖాస్తులు సమర్పించినప్పటికీ స్పందన లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే 03-12-2025న తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో, వెంటనే జిహెచ్ఎంసి లాయర్‌తో మాట్లాడి సెట్ ఎ సైడ్ పిటిషన్ వేయాలని, తగిన ఆధారాలు, పత్రాలు సమర్పించి కేసును గట్టిగా వాదించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. "రోడ్డును రక్షించడం ప్రభుత్వ బాధ్యత.. ప్రజల న్యాయ పోరాటానికి జిహెచ్ఎంసి తోడుగా నిలవాలి" అని నాగార్జున నగర్ కాలనీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు యావపురం రవి, మొగిలి కరుణాకర్ రెడ్డిలు వ్యాఖ్యానించారు. నాగార్జున నగర్ కాలనీ కోశాధికారి బొల్లంపల్లి శ్రీకాంత్ రెడ్డి, కమిటీ సభ్యులు సయ్యద్ సాదిక్, మహేందర్ గౌడ్, గోపాల్ యాదవ్, శ్రీశైలం, జహంగీర్ పాషా, కొండల్ రెడ్డి, సలహాదారులు లక్ష్మి కాంతయ్య, రామబ్రహ్మం, రమేష్ యాదవ్, కాలనీ వాసులు తిరుపతి యాదవ్, హన్మంత రెడ్డి, సాయి కుమార్ గౌడ్, వెంకన్న, మధుసూదన్ రెడ్డి, దీప్ కుమార్ రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలను నిర్వహించడానికి అనుమతి పొందండి

### సైబరాబాద్ కమిషనరేట్

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 01 (జనంసాక్షి) :** మరో 30 రోజుల్లో నగర వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించనున్న నేపథ్యం లో సైబరాబాద్ పోలీసులు కీలక ప్రకటన చేశారు. సోమవారం వెల్లడించిన ప్రకటనలో భాగంగా 2026 నూతన సంవత్సరంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ఈవెంట్ మేనేజ్మెంట్ లు, హాలో సాంస్కృతిక సంస్థలు, ఇతరత్రా ఔత్సాహికులు డిసెంబర్ 31న నూతన సంవత్సర వేడుక లను అట్టహాసంగా నిర్వహించడానికి ఇప్పటికే పకడ్బందీ కార్యాచరణను రూపొందించుకొని రూపొందించుకొని ఉంటారని పోలీసు అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ ఈవెంట్లను నిర్వహించడానికి ఆసక్తి ఉన్నవారు ముందస్తు అనుమతి కోసం 'cybpms.telangana.gov.in' వెబ్ పోర్టల్ ను ఆశ్రయించి ఈనెల 21వ తేదీలోపు నిర్దిష్టమైన నియమావళి అనుసరించి అనుమతిని పొందాల్సి ఉంటుందన్నారు. దీంతోపాటు టికెటెడ్ న్యూ ఇయర్ ఈవెంట్ల కోసం కమర్షియల్/టికెటెడ్ ఈవెంట్స్ ఫారమ్స్ ద్వారా అనుమతికై ఎంచుకోవాల్సిన అవసరం ఉందని, టికెటెడ్ కాని న్యూ ఇయర్ ఈవెంట్ల కోసం వాణిజ్యేతర/టికెటెడ్ కాని ఈవెంట్స్ ఫారమ్స్ ఎంచుకోవాల్సి న అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. భౌతికంగా సమర్పించిన దరఖాస్తులు, లేదా ఈ నెల 21వ తేదీ తర్వాత సమర్పించిన దరఖాస్తులకు పోలీస్ అధికారుల నుండి ఎన్నో ఎటువంటి అనుమతులు లభించవని, అలాంటివారు ఏవైనా ఈవెంట్లను నిర్వహిస్తే చట్టరీత్యా బాధ్యత వహించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

### మేడ్చల్ జిల్లాలో నూతన విత్తన చట్టంపై

## లబ్ధిదారులతో విస్తృత చర్చలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 01 (జనం సాక్షి) :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో నూతన విత్తన చట్టం ముసాయిదాపై ఈ రోజు లబ్ధిదారులు, రైతులు, విత్తన కంపెనీల ప్రతినిధులు, డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులతో విస్తృతంగా చర్చలు నిర్వహించబడగా, ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సిములు యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్రామ్ రెడ్డి హాజరై ముసాయిదా చట్టంలోని అంశాలను పాల్గొనువారితో వివరించి, రైతుల అభిప్రాయాలు, సూచనలు, విత్తన నాణ్యత, లభ్యత, మార్కెట్ నియంత్రణ, రైతుల హక్కుల సంరక్షణ వంటి కీలక విషయాలపై సమగ్రంగా చర్చించి, విత్తన చట్టంలో రైతుల ప్రయోజనాలు అగ్రస్థానంలో ఉండేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి పేర్కొంటూ, సమావేశంలో లభించిన సూచనలు అన్ని పైస్థాయికి పంపి తుది చట్ట రూపకల్పనలో భాగం చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది.



## యువతలో శారీరక ధృడత్వం పెరగాలి

- రాజకీయ సైద్ధాంతిక శిక్షణ అవసరం
- జనసేవా దళ్ శిక్షణను ప్రారంభించిన దండి సురేష్

**ఖమ్మం (జనం సాక్షి) :** యువతలో శారీరక ధృడత్వంతో పాటు మానసిక పరివర్తన, సమాజం పట్ల అవగాహన అవసరమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ సైద్దాంతిక శిక్షణ పొందాలని ఆయన -సూచించారు. ఖమ్మం నగర స్థాయి జనసేవా దళ్ శిక్షణా శిబిరం సోమవారం ఖమ్మం నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెంలో ప్రారంభమైంది. శిక్షణను సిపిఐ జిల్లా కార్యదర్శి సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా కలిగిన యువత పాలక వర్గాల తీరుతో నైరాశ్యానికి గురవుతుం దన్నారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో పాలకులు -విఫలం కావడంతో యువశక్తి నిర్వీర్యమవు తుందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో యువత చైతన్యవంతమైన ఆలోచనలతో రాజకీయాల్లోకి రావాలని వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులకు మద్దతుగా నిలవాల్సి ఉందన్నారు. నిరుద్యోగం పెరిగిన -నేపథ్యంలో పాలకులు కర్మ సిద్ధాంతాన్ని బోధిస్తూ పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. సుదీర్ఘ కాలం పోరాటాలతో అనేక హక్కులను, సంక్షేమ పథకాలను సాధించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జనవరి 18న ఖమ్మంలో జరుపుకుంటుందని సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఐదువేల మంది యువకులకు జన సేవాదళ్ శిక్షణ ఇస్తుమన్నారు. శారీరకంగా ధృడత్వం కలిగి ఉన్నప్పుడే మానసిక పరిపక్వత లభిస్తుందని శారీరక ధృడత్వం కలిగి సమాజ ఉన్నతికి కృషి చేయాలని ఆయన యువతను కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ సమస్యలపై జరిగే పోరాటాలకు సంబంధించి కార్యోన్ముఖులను చేయడమే లక్ష్యంగా శతాబ్ది ఉత్సవాలను -నిర్వహిస్తున్నామని సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ కె జానిమియా, మహ్మద్ సలాం, కార్పొరేటర్ బిజి క్లైమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, నగర నాయకులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, సైదా, మాలకొండయ్య, రావుల హన్మంతరావు, మాడుగుల నాగేశ్వరరావు, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై డిసెంబర్ 3న మహా ధర్నా



**చేవెళ్ల, డిసెంబరు 01 (జనంసాక్షి) :** చేవెళ్ల నియోజకవర్గం షాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీ లలో ధర్నా పోస్టర్ ను ఆవిష్కరించిన టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ కొండా విజయ్ కుమార్, చేవెళ్ల జర్నలిస్టులు, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నదని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎండీ.సలీమ్ పాషా అన్నారు. సోమవారం నాడు చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని షాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీ లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిసెంబర్ 3 న జరిగే మహా ధర్నా పోస్టర్ ను శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టుల జీవితాలు గత పుష్కర కాలంలో ఏ మాత్రం మెరుగు పడలేదని, ఉమ్మడి రాష్ట్రంలో పొందిన ఆరోగ్య భీమా వంటి సౌకర్యాలు సైతం అందకుండా పోయాయన్నారు. ప్రభుత్వ వైఖరి పట్ల రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో సహా 33 జిల్లాల్లో జర్నలిస్టుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, దీనితో ప్రత్యక్ష కార్యాచరణకు దిగక తప్పని పరిస్థితి ఏర్పడిందని.మన న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి పోరుబాట పట్టాలని నవంబరు 6, 2025న రంగారెడ్డి జిల్లా ప్రగతి రిసార్ట్స్ లో జరిగిన యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయం తీసుకుందని,అందులో భాగంగా హైదరాబాద్ లో మాసాబ్ ట్యాంక్ లో గల రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద డిసెంబర్ 3వ తేదీ, ఉదయం 10 గంటలకు మహా ధర్నా నిర్వహించాలని టియుడబ్ల్యూజే నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు లు చేవెళ్ల సీనియర్ జర్నలిస్టులు గోపాల్, సుభాష్ రెడ్డి, రాకేష్, మధు, కడ మంచి ఆనంద్, శ్రీనివాస్, దయాకర్ రెడ్డి, ఆనంద్, జీలాని పాషా, రాఘవేం దర్, యాసీన్, ముస్తఫా, రాజు, మారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 2026 నాటికి అభివృద్ధి పనులు పూర్తి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి
- ఖమ్మం నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల



**ఖమ్మం, డిసెంబర్ 1 (జనం సాక్షి) :**
మార్చి 2026 నాటికి ఖమ్మం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు సోమవారం ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో ఖమ్మం నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి గత ఏడాది మున్నేరు వరదల వల్ల వేలాది ప్రజలు ఇబ్బంది పడ్డారని, ప్రతి సంవత్సరం వరదల కారణంగా ఖమ్మం నగరంలో 10 డివిజన్ల ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారంగా ప్రభుత్వం మున్నేరు నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అడ్డంకిగా మారిన భూసేకరణ సమస్య, భూ ఆక్రమణల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేసి, నిర్మాణ పనులు వేగవంతం చేస్తూ నిర్దిష్ట గడువు మార్చి 2026 లోగా పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని అన్నారు. ఎస్టీపి నిర్మాణం, కేబుల్ బ్రిడ్జ్ దగ్గర రోడ్డు వెడల్పు పనులు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, 10 రోజులలో భూములు సంబంధిత ఏజెన్సీలకు అప్పగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

రాష్ట్రంలో 3 కేబుల్ బ్రిడ్జిలు ఉన్నాయని, హైదరాబాద్ లోని దుర్గం చెరువు, కరీంనగర్ లోని మానేరు నదిపై కేబుల్ బ్రిడ్జి లను తన హయాం లోనే మంజూరు చేశానని, నేడు ఖమ్మంలో మున్నేరు నదిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని, మిగిలిన రెండు బ్రిడ్జిల కంటే మున్నేరు కేబుల్ బ్రిడ్జి పెద్దదని అన్నారు. కేబుల్ బ్రిడ్జి వద్ద పర్యాటకంగా కూడా అభివృద్ధి జరిగేలా టూరి జం ప్యాకేజీ ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించామని మంత్రి తెలిపారు. ప్రపంచంలోనే బెస్ట్ గా ఉండే విధంగా కేబుల్ బ్రిడ్జి వద్ద లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

బాలపేట, బల్లేపల్లి, ఖానాపురం చెరువుల నుంచి వర్షాకాలం వరద నీరు అధికంగా వస్తుందని, దీని నియంత్రణకు 200 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టామని అన్నారు. 10 రోజులలో ఎస్టిపి నిర్మాణ పాయింట్ ఖరారు చేసి పనులు ప్రారంభిస్తామని అన్నారు. మార్చి 2026 నాటికి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఖమ్మం నగరం మణిహారంగా ఉండేలా కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని అన్నారు. డిసెంబర్ 2న కొత్తగూడెం జిల్లాలో జరుగనున్న సీఎం టూర్ విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. దేశానికే తలమానికంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఉంటుందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అధికంగా ఖనిజాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విశ్వవిద్యాలయం లేదని, ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని పంపిన ప్రతిపాదన ఆమోదించిన సీఎం కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయానికి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం జరిగిందని, దీనినీ సీఎం ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ మీడియా సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు టిఎన్‌జిఓ భవనంలో

## వక్ఫ్ ఉమ్మీద్ పోర్టల్, ఎస్ఐఆర్‌పై సదస్సు



**ఖమ్మం, డిసెంబర్ 1 (జనంసాక్షి):** ముస్లిం మైనార్టీలకు సంబంధించిన ఈద్గాలు, ఖబర్ స్తాన్‌లు, ఆశురా నాలు, దర్గాలు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఉమ్మిద్ పోర్టల్, ఎస్ఐఆర్ అంశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం నగరంలోని టీఎన్జీఓ భవనంలో అవగాహన సదస్సు తలపెట్టినట్లు జమియత్ ఉలేమా ఏ హింద్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్య క్షుడు మౌలానా మొహమ్మద్ సయీద్ అహమద్ ఖాస్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర జమీయత్ ఉలేమా ఏ హింద్ అధ్యక్షులు మౌలానా సయ్యద్ షా ఎ సానొద్దీన్ ఖా స్మి అధ్యక్షత వహిస్తారని, హాఫిజ్ పీర్ ఖలీక్ అహ్మద్ సాబిర్, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సుకు అధిక సంఖ్యలో విచ్చేసి, జయప్రదం చేయాలని ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## శంషాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి

**రాజేంద్రనగర్,డిసెంబర్1(జనంసాక్షి) :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మదనపల్లి కొత్త బ్రిడ్జ్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి (50) మృతి చెందాడు. శంషాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి తెలిపారు. నవంబర్ 25 ఉదయం 5.37 గంటలకు వచ్చిన 100 డయల్ కాల్ మేరకు పేట్రోలు మొబైల్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించగా, ఎడమ కాలు, కుడి కన్ను వద్ద తీవ్ర గాయాలతో స్థానికంగా మరణించినట్లు గుర్తించారు. నవంబర్ 25 ఉదయం సుమారు 5.20 గంటలకు శంషాబాద్ నుండి షాద్‌నగర్ వైపు వెళ్తున్నప్పుడు ఒక గుర్తు తెలియని వాహ నం నిర్లక్ష్యంగా నడిపి ఆ వ్యక్తిని ఢీకొట్టినట్లు తెలిసింది. తెలుపు-నీలం రంగు షర్ట్, నలుపు షార్ట్, నలుపు స్వెటర్ ధరించిన ఈ వ్యక్తి భిక్షగా డిలా కనిపించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసా గిస్తున్నట్లు శంషాబాద్ ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు పక్కాగా ఏర్పాట్లు

- అధికారులకు సిఎస్ రామకృష్ణారావు ఆదేశం



హైదరాబాద్, డిసెంబర్1 (జనంసాక్షి) : ఈనెల 8, 9 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, సబ్యసాచి ఘోష్, సంజయ్ కుమార్, సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితర ఉన్నతాధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. సందర్భంగా సిఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, ఈ సమ్మిట్ లో పాల్గొనే ప్రముఖులకు, దేశ, విదేశీ అతిథులకు ఆహ్వానాలు పంపించడం జరుగుతోందని, ఈ సమ్మిట్ కు హాజరయ్యే వారికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేయాలని అన్నారు. ఈ సమ్మిట్ ఏర్పాట్లపై ప్రత్యేకంగా ప్రజా భావన్‌లో వార్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో నిర్వహించే అతిపెద్ద సమ్మిట్ లో రాష్ట్రానికి చెందిన అన్నిశాఖలు తమ పురోగతిని షో కేస్ చేయాలన్నారు. ప్రధానంగా ప్లీనరీ, ముఖ్యమంత్రి చే వన్ టు వన్ సమావేశాలు, వివిధ సంస్థలచే ఎంఓయూలనే ప్రధాన అంశాలుంటాయని తెలిపారు. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పెద్ద ఎత్తున ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉన్నాయని పేర్కొన్నారు. డిసెంబర్ 13 తేదీ వరకు ఈ సమ్మిట్ కొనసాగుతుందని, 13 న ఉప్పల్ స్టేడియంలో ఫుట్ బాల్ మ్యాచ్ తో ముగుస్తుందని వెల్లడించారు.

# బెంగళూరు రోడ్లపై ట్రాఫిక్ అధ్వాన్నం

- ఎయిర్‌పోర్టు చేరడానికి నానాతంటాలు పడ్డా
- ఎక్కడా ఒక్క ట్రాఫిక్ పోలీసుల జాడలేదు
- సమాజ్‌వాది ఎంపీ రాజీవ్ రాయ్ ఘాటు విమర్శలు



బెంగళూరు, డిసెంబర్1 (జనంసాక్షి) : బెంగళూరు రోడ్లు, అక్కడి ట్రాఫిక్ సమస్యలు ఇటీవల తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో బెంగళూరు ట్రాఫిక్ పై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు ట్రాఫిక్ చాలా ఘోరంగా ఉందని.. నగర పోలీసులు నిష్ప్రయోజకులంటూ విమర్శించారు. పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనడానికి ఆదివారం తాను ఢిల్లీ బయల్దేరగా.. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయినట్లు తెలిపారు. వాహనాల రద్దీని క్లియర్ చేయడానికి రోడ్డుపై ఒక్క ట్రాఫిక్ పోలీస్ కూడా లేరని అన్నారు. విమానాశ్రయానికి సమయానికి చేరుకోవడంలో ఇబ్బంది నెలకొనడంతో బెంగళూరు పోలీసులను సంప్రదించినప్పటికీ.. వారు స్పందించలేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ ట్రాఫిక్ సమస్యపై ఎంపీ సోషల్ మీడియా వేదికగా కర్ణాటక సీఎం సిద్ధరామయ్య దృష్టికి తీసుకెళ్లారు. బెంగళూరులో ట్రాఫిక్ నిర్వహణ సరిగా లేదని.. అందమైన నగరంగా ప్రఖ్యాతి చెందిన నగరం అసమర్థ అధికారుల వల్లే అపఖ్యాతిని మూటగట్టుకుంటోందని విమర్శించారు. ట్రాఫిక్ సమస్యల వల్ల అందరి నుంచి విమర్శలు ఎదుర్కొంటోందని అన్నారు. దీంతో నగర ట్రాఫిక్‌పై మరోసారి చర్చ మొదలైంది.బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ సమస్యల పై ఇటీవల పలువురు ప్రముఖులు తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. బయోకాన్ పార్క్‌కు వచ్చిన ఓ విదేశీ విజిటర్.. నగరంలోని రోడ్లు, చెత్తపై చేసిన వ్యాఖ్యలతో తాను ఇబ్బందిపడ్డానని బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా పేర్కొనడంతో ఈ సమస్యపై చర్చలు మొదలయ్యాయి. ఇటీవల వ్యోమగామి శుభాన్షు శుక్లా బెంగళూరు ట్రాఫిక్‌పై స్పందిస్తూ.. బెంగళూరు రహదారులపై ప్రయాణం కంటే అంతరిక్షంలోకి వెళ్లడమే సులువని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. బెంగళూరులో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి రూ. 19వేల కోట్ల భూగర్భ సొరంగ రహదారి నెట్‌వర్క్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు.

# కారులో కుక్కతో పార్లమెంట్‌కు రేణుకాచౌదరి

- అభ్యంతరం చెప్పిన బిజెపి ఎంపీలు



న్యూఢిల్లీ, డిసెంబర్1 (జనంసాక్షి) : పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజైన సోమవారంనాడు ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి కారులో ఒక కుక్కను పార్లమెంటు ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఇది గమనించిన భద్రతాసిబ్బంది ఆ కుక్కను తిరిగి ఆమె నివాసానికి పంపేశారు. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పించింది. ఇది ఎంపీలకు ఇచ్చిన ప్రత్యేక అధికారాలను దుర్వినియోగం చేయడమమే అవుతుందని విమర్శించింది. అయితే దీనిపై రేణుకా చౌదరి ఘాటుగా స్పందించారు. 'ఒక మూగజీవి కారులో ఉంటే వారికి ఎందుకు అంత ఇబ్బంది? దీనిపై ఏదైనా చట్టం ఉందా? నేను వస్తుండగా దారిలో ఒక స్కూటరు, కారు ఢీకొన్నాయి. చిన్న కుక్క రోడ్డుపై తిరుగుతోంది. దానికి దెబ్బతగిలి ఉంటుందని అనిపించి దానిని కారులో ఎక్కించుకున్నాను. నేరుగా పార్లమెంటుకు వచ్చాను. వెంటనే దాన్ని వెనక్కి పంపించేశాను. కారు వదిలిపెట్టినట్టే కుక్క విషయంలోనూ చేశాను. దీనిపై చర్చించేదేముంది? కుక్కపిల్ల ఎవరినీ కరవదు. నిజంగా కాట్లు పడిన వారు పార్లమెంటులో కూర్చున్నారు. వాళ్లు ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. మేము మూగజీవాలను ప్రేమిస్తాం. పార్లమెంటులో కూర్చుని ప్రతిరోజూ మాపై విరుచుకుపడే వాళ్ల గురించి మేము మాట్లాడదలచుకోలేదని అన్నారు. రేణుకాచౌదరి చర్యను బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ తప్పుపట్టారు. పెంపుడు జంతువులను పార్లమెంటుకు తీసుకురావడం ఎంపీలకు ఇచ్చిన ప్రత్యేక హక్కులను దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. జవాబుదారీతనం అనేది తప్పనిసరిగా ఉండాల్సిందేనని పేర్కొన్నారు.

# మరోసారి జాతీయ స్థాయిలో సత్తా చాటిన తెలంగాణ పోలీసింగ్ వ్యవస్థ

**దేశంలో ఏడో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా శామీర్‌పేట్ పీఎస్**




హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ పోలీసింగ్ వ్యవస్థ మరోసారి జాతీయ స్థాయిలో సత్తాను చాటింది. కేంద్ర హోంశాఖ దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 10 ఉత్తమ పోలీస్ స్టేషన్లలో.. సైబరాబాద్ కమిషనరేట్‌కు పరిధిలోని శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఏడో స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించింది. ఢిల్లీలోని ఘాజీపూర్ ల్యాండ్‌ఫిల్ పోలీస్‌స్టేషన్ తొలిస్థానంలో ఉంది. ఏటా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న, వృత్తిపరమైన ప్రమాణాలను పాటిస్తున్న పది ఉత్తమ పోలీస్ స్టేషన్లను హోంశాఖ ఎంపిక చేస్తుంటుంది. ఈ ఎంపిక ప్రక్రియలో స్టేషన్ పనితీరు, పరిపాలనా సామర్థ్యం, ఫిర్యాదుదారులతో, బాధితులతో సిబ్బంది వ్యవహరించే తీరు, ఫిర్యాదుల పరిష్కారం, పోలీస్ స్టేషన్ రికార్డులు, డాక్యుమెంటేషన్ నిర్వహణను పరిశీలిస్తారు. ఈ అన్ని ప్రమాణాలలో శామీర్‌పేట్ స్టేషన్ ప్రతిభ కనబర్చడం ద్వారా దేశంలో ఏడో అత్యుత్తమ స్టేషన్‌గా, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ సాధించిన ఈ ఘనత పట్ల ఆ స్టేషన్ సిబ్బందికి ఉన్నతాధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏడీసీపీ పురుషోత్తం, ఏసీపీ మేడ్చల్ బాలగంగిరెడ్డితో పాటు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్.. మొత్తం సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

# అనుమానాస్పద స్థితిలో యువజంట మృతి

రంగారెడ్డి, డిసెంబర్1 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా కొత్తూరు పురపాలక కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. అనుమానస్పద స్థితిలో యువతీ యువకుడు మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన ఓ కార్మికుడు కొత్తూరు శివారులోని ఓ కంపెనీలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. వారిద్దరూ స్థానిక బిస్కెట్ పరిశ్రమలో కార్మికులుగా పని చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం తండ్రి భోజనానికి ఇంటికి రాగా.. తలుపు గడియ లోపలి నుంచి పెట్టి ఉంది. ఎంతసేపు తలుపు కొట్టిన ఎవరు స్పందించలేదు. దీంతో కిటికీ నుంచి తలుపు గడియ తీసి లోపలికి వెళ్లాడు. ఓ గదిలో అతడి కుమార్తెతో పాటు మరో గుర్తు తెలియని యువకుడి మృతదేహాలను చూశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఆ యువకుడు యువతిని హత్య చేసి ఆ తర్వాత తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

# హైదరాబాద్‌లో అజయ్ దేవ్‌గన్ ఫిల్మ్ సిటీ

- గ్లోబల్ సమ్మిట్‌లో ఎంఓయూకు సిద్ధం

హైదరాబాద్, డిసెంబర్1 (జనంసాక్షి) : తెలంగాణలో గ్లోబల్ సమ్మిట్ కోసం ఏర్పాట్లు ఘనంగా జరుగు తున్నాయి. ఈ నెల 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా వివిధ రంగాలకు చెందిన మూడు వేల మంది ప్రతినిధులకు ప్రత్యేకంగా ఆహ్వానాలు పంపారు. గ్లోబల్ సమ్మిట్ కోసం ప్రత్యేక వేదికను ఫ్యూచర్ సిటీలో రూపొందిస్తున్నారు. సమ్మిట్‌లో భాగంగా మూడు వేల డ్రోన్లతో షోను ఏర్పాటు చేస్తున్నారు హైదరాబాద్‌లో అజయ్ దేవ్‌గన్ ఫిల్మ్ సిటీ రూపొందించనున్నారు. ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అజయ్ దేవ్‌గన్ ఎంఓయూ కుదుర్చుకో నున్నారు. అలాగే హైదరాబాద్ నగరంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ గ్రూప్ ముందుకు వచ్చింది. వెంటారా కన్జర్వేటరీ నిర్మించేందుకు రిలయన్స్ ఆసక్తిగా ఉంది. వెంటారా యానిమల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయబోతోంది. వైల్డ్ లైఫ్ కన్జర్వేటరీ, నైట్ సఫారీ ప్రాజెక్ట్ పర్యాటక రంగానికి భారీ ప్రోత్సాహకం అందించనున్నాయి. గ్లోబల్ సమ్మిట్‌కు భారీ స్పందన లభిస్తోంది. సమ్మిట్‌లో కీలక ఒప్పందాల చేసుకునేందుకు పలువురు పెట్టుబడి దారులు ముందుకు వస్తున్నారు. ఫుడ్‌లింక్ భారీ ఇన్వెస్ట్‌మెంట్ చేయబోతోంది. రూ. 3,000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఫ్యూచర్ సిటీలో మూడు లగ్జరీ హోటల్స్ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రకటించనుంది.

# కొండగట్టు అగ్ని ప్రమాదంపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

హైదరాబాద్ (జనంసాక్షి) : కొండగట్టులో అగ్ని ప్రమాదంపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మానేని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ వైఫల్యమే కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, అగ్నిమాపక సిబ్బంది రాక ఆలస్యం కారణంగా అగ్నిప్రమాదం తీవ్రత ఎక్కువైందని.. భాదితులకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేకాదు తక్షణమే బాధితులకు తాత్కాలిక పరిహారం ఇవ్వాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌ను ఆదేశించాలంటూ పిటిషన్ వేశారాయన. అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్‌ను జగిత్యాల జిల్లాకు.. ఫైర్ స్టేషన్, ఫైర్ ఇంజిన్, సిబ్బందిని కేటాయించాలంటూ న్యాయవాది రామారావు కోరారు. అతడు దాఖలు చేసిన పిటిషన్‌ను 27572/ఇన్/2025గా నమోదు చేసుకున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ సత్వరమే విచారణ చేపట్టనుంది.

నవంబర్ 29 శనివారం రాత్రి 11 గంటల కొండగట్టు స్టేజీ వద్ద భారీ అగ్నిప్రమాదం జరిగింది. దాదాపు 30 దుకాణాలలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ప్లాస్టిక్ ఆటవస్తువులు, బొమ్మలు ఇతర సామగ్రి కాలిపోయాయి. మంటలు పెద్ద ఎత్తున వ్యాపిస్తుంటే, తాము ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయాందోళనతో బాధితులు బయటకు పరుగులు తీశారు. మొదటి దుకాణంలో మంటలు అంటుకున్న సమయంలోనే ఫైర్ ఇంజిన్‌కు, 108 కు సమాచారం ఇచ్చారు. కానీ, జగిత్యాల నుండి బయలుదేరిన ఫైర్ ఇంజిన్ మధ్యలోనే ఆగిపోయింది. మరో ఫైర్ ఇంజిన్ మెషినరీ మొరాయించడంతో కోరుట్ల, కరీంనగర్ నుండి ఫైర్ ఇంజిన్లను తెప్పించారు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

# ఎచ్చర్ల మండల తీరానికి బంగ్లా బోటు

శ్రీకాకుళం, డిసెంబర్1 (జనంసాక్షి) : బంగ్లాదేశ్‌కు చెందిన 13 మంది మత్స్యకారులు చేపల వేట చేస్తూ సముద్రంలో దారి తప్పి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం తీరానికి చేరుకున్నారు. వారి బోటును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆకలితో ఉన్న వారికి స్థానిక మత్స్యకారులు భోజనం పెట్టారు. మెరైన్ సిఐ ప్రసాదరావు, ఎచ్చెర్ల పోలీసులు, మత్స్యశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని వీరిని కళింగపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దిత్వా తుపాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో వీరు అదుపు తప్పి వచ్చారా? వేరే కారణం ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో వారిని బంగ్లాదేశ్‌లోని బోలబార్సిల్ జిల్లా చర్‌కోలాచద్ గ్రామానికి చెందిన సయిచ్, జహంగీర్, సభీర్, కోకన్, మఖ్‌సూద్, మాలిక్, మహ్మద్ ఫరూఖ్, మాక్‌సుద్, నాసిర్, హెలెల్, ఫరూఖ్, అలామ్, సమెన్‌గా గుర్తించారు. వీరు నవంబరు పదో తేదీన చేపల వేటకు వెళ్లి తప్పిపోయినట్లు గుర్తించారు. సముద్రంలో బోటు దారి తప్పి, 20 రోజుల తర్వాత డి.మత్స్యలేశం సముద్ర తీరానికి చేరుకున్నారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ రైజింగ్‌తో ఆర్థికాభివృద్ధి సాధ్యమేనా ?

- లక్ష్యాలను అనుకున్నట్లుగా తీసుకెళ్లే సామర్థ్యం ముఖ్యం

హైదరాబాద్, డిసెంబర్1 (జనంసాక్షి) : తెలంగాణలో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్తఇచేసుకోబోతోంది. ఈ క్రమంలో 'తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్' రూపొందిస్తోంది. భవిష్యత్‌లో చేయబోయే కార్యక్రమాలు. అభివృద్ధిపై ఇందులో ప్రస్ఫుటంగా ప్రస్తావించ నున్నారు. ఏరకంగా ముందుకు వెళు తున్నదీ వివరించనున్నారు. అయితే ఇది అంత ఆషామాషీ విషయం కాదు. ఇప్పటికే నిధుల కొరత, అప్పుల ఊబిలాంటి సమస్యలు ఉన్నాయి. వీటిని అధిగమించాలి. ఇందుకు ఆర్థిక కట్టుబాట్లు కూడా అవసరం. ఇవన్నీ లేకుండా ఇంత పెద్ద లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడం అంత సులువు కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, భవిష్యత్ పాలసీ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రజలకు అంకితం చేయాలని నిర్ణయించింది. తెలంగాణ భవిష్యత్తు కోసం రూపొందిస్తున్న 'తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ డాక్యుమెంట్‌కు 'రైజింగ్ 2047'గా నామకరణం చేశారు. గతాన్ని అనుభవంగా తీసుకుని, ఆ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటూనే భవిష్యత్‌కు అడుగులు వేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు ప్రకటించారు. పాలసీలలో పెరాల్సిస్ వస్తే రాష్ట్ర భవిష్యత్ తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించారు. ఈ పాలసీ డాక్యుమెంట్ తయారీలో భాగంగా, తాము ఐఎస్‌బీ, నీతి ఆయోగ్ వంటి ప్రముఖ సంస్థల సలహాలు కూడా తీసుకున్నట్లు




వెల్లడించారు. విజన్‌లో భాగంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగానే తెలంగాణను మూడు ప్రధాన ఆర్థిక విభాగాలుగా వర్గీకరించారు. తెలంగాణ ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్రంలోని ప్రాంతాలను మూడు విభాగాలుగా విభజించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం అంతా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమిగా పరిగణించబోతున్నారు. గతంలో ఔటర్ లోపలి ప్రాంతంలో ఉన్న నాలుగు విభాగాల గందరగోళం తొలగిపోతుందని, కాలుష్య రహిత నగరంగా ఉండాలంటే ఈ ప్రాంతాన్ని 'క్యూర్' చేయాల్సిందేనని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు బయటి నుండి ఆర్‌ఆర్‌ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి-అర్బన్ రీజియన్ ఎకానమిగా గుర్తించారు. 360 కి.మీ. పొడవైన ఆర్‌ఆర్‌ఆర్‌కు కేంద్రం అంగీకారం తెలిపిందని, ఇది నగరానికి రెండో అర్బన్ రీజియన్‌గా మారుతుందని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేలతో పాటు, బుల్లెట్ ట్రైన్ వేయడానికి కేంద్రం నుండి అనుమతి తెచ్చామని, హైదరాబాద్-బెంగుళూరు మధ్య కనెక్టివిటీని పెంచి అభివృద్ధిని సిద్ధం చేస్తున్నామని సిఎం రేవంత్ ప్రకటించారు. ఆర్‌ఆర్‌ఆర్ బయటి నుండి తెలంగాణ సరిహద్దు వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమిగా గుర్తించారు. ఆదాయం పెంచాలి? పేదలకు పంచాలి అనేది తమ ప్రభుత్వ విధానమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ సమస్య లేకపోయినా, పోషకాహార సమస్య ఉందని, దాన్ని ఎలా పరిష్కారం చేయాలనే దానిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ గ్రామాలకు చేరినప్పటికీ, ఇప్పుడు నాణ్యమైన విద్య, సాంకేతిక విద్య అందించడంపై దృష్టి పెట్టామని, విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. తెలంగాణను 'నాలెడ్జ్ హబ్'గా మారిస్తే, పెట్టుబడులు, కంపెనీలు క్యూ కడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఎయిర్‌పోర్టుల విస్తరణలో భాగంగా వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలో కొత్త ఎయిర్‌పోర్టులు తెస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇవన్నీ సకారాం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నదే తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా చెబుతున్నారు. అయితే ఇది ఎంతవరకు సాకారం అవుతుందన్నది ప్రభుత్వ చిత్తశుద్ధిని పట్టి ఉంటుంది.



# శివ్‌నాడార్ ఫౌండేషన్ సదస్సుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ఆహ్వానం అందింది. శివ్‌నాడార్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మక సదస్సు ఇగ్నిషన్‌లో పాల్గొని ప్రసంగించాలని ఆహ్వానించారు. నేడు సాయంత్రం 6.30 గంటలకు జర్నలిస్ట్ శోమా చౌదరి నిర్వహణలో చెన్నైలోని ఐటీసీ గ్రాండ్ చోళాలో ఈ సదస్సు జరగనుంది. దేశంలోని ప్రముఖ నాయకులు, ఆర్థికవేత్తలు, విధాన రూపకర్తలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమంలో రీబూటింగ్ ది రిపబ్లిక్ అనే అంశంపై కేటీఆర్ ప్రసంగించనున్నారు. దేశాభివృద్ధిలో రాజకీయాలు, టెక్నాలజీ పాత్ర, ఇన్నోవేషన్ హబ్‌ల ఆవశ్యకత, సమ్మిళిత ఆర్థికాభివృద్ధిపై కేటీఆర్ తన ఆలోచనలను పంచుకోనున్నారు. ఈ వేదికపై జాతీయ రాజకీయాలకు సంబంధించిన పలు కీలక అంశాలను కూడా ఆయన ప్రస్తావించే అవకాశముంది.

ఇగ్నిషన్ ప్లాట్‌ఫామ్ పబ్లిక్ పాలసీ, ఆర్థిక శాస్త్రం, సైన్స్ సాంకేతిక రంగాల నుంచి అగ్రశ్రేణి ఆలోచనాపరులను హోస్ట్ చేయడానికి పేరుగాంచింది. కేటీఆర్ సెషన్ తర్వాత, కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్, ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త దేవేష్ కపూర్ పాల్గొనే మరొక ముఖ్యమైన సంభాషణ జరగనుంది. ఈ సదస్సు భారతదేశ భవిష్యత్తుపై లోతైన మరియు నిర్మాణాత్మకమైన చర్చలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370